PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 355 | విజయవాడ, శనివారం 27 జులై 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 27 July 2024 | Rs

సిటీ◆



పారిస్‌లోని సెయిన్ నదిలో ఒలింపిక్స్ సంరంభం

ఆరంభం అదిరింది



జాతీయ పతాకాలతో భారత్ క్రీడాకారులు

- అబ్బురపరచిన విన్యాసాలు
- త్రివర్ణ పతాకధారులు శరత్ కమల్, పివి సింధు
- ఒలింపిక్స్ చరిత్రలో తొలిసారి నదిలో ప్రారంభ వేడుకలు

పారిస్: ప్రతి నాలుగేళ్లకొకసారి జరిగే ప్రతిష్టాత్మక ఒలింపిక్ క్రీడల ఆరంభం అదిరింది. శుక్రవారం నుంచి రెండువారాల పాటు సాగే ఒలింపిక్ క్రీడలు ప్రారంభమైనట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఓసి) అధ్యక్షులు థామస్ బాచ్ ప్రకటించారు. భారత కాలమానం ప్రకారం రాత్రి 11గంటలకు ప్రారంభమైన వేడుకలు ఫ్రెంచ్ సంస్కృతికి దర్పణం పట్టాయి. పారిస్‌లోని సెయిన్ నది వెంబడి ఆరు కిలో మీటర్ల పొడవునా సాగిన వేడుకల్లో ఒక్కో దేశ క్రీడా బృందం ఒక్కో పడవలో తమ దేశ జాతీయ పతాకాలతో పాల్గొనడం పారిస్ ఒలింపిక్స్‌కు ఒక ప్రత్యేక ఆకర్షణ. ఫ్రాన్స్ మహిళా పాప్ సింగర్లు లేడీ గాగా, ఆయా నకమురా పాడిన పాటలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. జోరున వర్షం కురిసినా సంబరాల హోరు ఏ మాత్రం తగ్గలేదు పారిస్ ఒలింపిక్స్ మస్కట్‌కు ఫ్రిజెస్ అని నామకరణం చేయగా.. ఒలింపిక్స్ చరిత్రలో నదిలో ప్రారంభ వేడుకలు జరగడం ఇదే తొలిసారి. పారిస్‌లోని సెయిన్ నది వెంబడి సుమారు 6కి.మీ. దూరం వరకు క్రీడా పరేడ్ సాగింది. సుమారు 8వేలమంది అథ్లెట్లు ప్రారంభోత్సవాల్లో పాల్గొనగా.. 3లక్షలకు పైగా... ప్రేక్షకులు ఈ వేడుకను ప్రత్యక్షంగా వీక్షించారు. చివర్లో మిరుమిట్లు గొలిపే లేజర్ షోలను ప్రదర్శించారు. ఈ ఒలింపిక్స్‌లో 225 దేశాలనుంచి సుమారు 10,500మంది అథ్లెట్లు పతకాలకోసం పోటీపడుతుండగా.. పతకాల పట్టికలో అగ్రస్థానం కోసం అమెరికా, చైనా జట్ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. గత ఒలింపిక్స్‌లో ఈ రెండు దేశాల మధ్య ఒక్క బంగారు పతకం మాత్రమే కావడంతో అందరిలోనూ ఉత్కంఠ నెలకొంది. తీవ్రవాద ముప్పు నేపథ్యంలో ప్రారంభోత్సవాల కోసం ఫ్రాన్స్ ప్రభుత్వం 45వేలకుపైగా పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేసింది. ఇక భారత్ నుంచి 117మంది అథ్లెట్లు పారిస్ ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తుండగా.. భారత బృందం ముందు టేబుల్ టెన్నిస్, ఆటగాడు శరత్ కమల్, బ్యాడ్మింటన్ క్రిడాకారిణి పివి సింధు త్రివర్ణ పతకాన్ని చేబూని ముందువరుసలో నడిచాడు. ఈ ఒలింపిక్స్‌లో భారత్ రెండంకెల పతకాల సాధనే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. విజయవాడకు చెందిన ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్, విశాఖపట్నంకు చెందిన జ్యోతి యర్రాజి(100మీ. హర్డిల్స్), జ్యోతిక శ్రీ(మహిళల 4×400మీ. పరుగు)లో బరిలోకి దిగుతున్నారు. అలాగే హైదరాబాద్ స్టార్ మహిళా బాక్సర్ నిఖత్ జరీన్ పారిస్ ఒలింపిక్స్‌లో పతకంపై గురిపెట్టింది. ఒలింపిక్స్‌లో భారత్ ఇప్పటివరకు మొత్తం 35పతకాలు సాధించగా.. అందులో ఒక్క 2020 టోక్యో ఒలింపిక్స్‌లోనే 7పతకాలు సాధించింది. పారిస్ ఒలింపిక్స్ జులై 26నుంచి ఆగస్టు 11వరకు జరగనున్నాయి.

వైసిపి పాలనలో ఆర్థిక విధ్వంసం

శ్వేతపత్రం విడుదల


కోలుకోలేని నష్టం జరిగిందన్న బాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఆర్థిక విధ్వంసం జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఆర్థికశాఖపై శ్వేతపత్రాన్ని ఆయన శుక్రవారం శాసన సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన భారీ అవకతవకల కారణంగా రాష్ట్రానికి కోలుకోలేని నష్టం జరిగిందని చెప్పారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై ప్రజల్లో చర్చ జరగాలని, ఎంఎల్‌ఏలు తమ నియోజకవర్గాల్లో పర్యటించి ఈ విషయమై ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. 2024 జూన్ నాటికి రూ.9,74,556 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని చెప్పారు. అవి, ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరిపై తలసరి అప్పు 1,44,336 రూపాయల అప్పుఉందని వివరించారు. తమ ప్రభుత్వ హయాంలో 13.2శాతంఉన్న ఆదాయం వైసిపి పాలనలో 9.5శాతానికి పడిపోయిందన్నారు. వైసిపి పాలనలో జరిగిన ఆర్థిక విధ్వంసంపై ప్రజల్లో చర్చ జరగాలని, అందుకోసం ఎమ్మెల్యేలందరూ తమ నియోజకవర్గాల్లో పర్యటించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని చెప్పారు.

పిపిపి పద్ధతిలో రాష్ట్ర రహదారులు

ఆర్థిక స్థితి నేపథ్యంలో సంపద సృష్టించే మార్గాలను అన్వేషించాలని అన్నారు. దీనికోసం ఎంఎల్‌ఏలు, నిపుణులు ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని చెప్పారు. జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర రహదారులను కూడా పిపిపి పద్ధతిలో నిర్మిస్తే ఎలా ఉంటుందో ఆలోచించాలని అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో వరదలు, వర్షాలతో రోడ్డు ప్రతిఏడాది దెబ్బతింటాయని, ఆయా ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు వేసి ద్విచక్ర వాహనాలు , ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, లాంటి వాహనాలకు టోల్ లేకుండా ఉచిత రవాణాకు అవకాశం ఇస్తూ మిగిలిన పెద్ద వాహనాలకు టోల్ వసూలు వసూలు చేసేలా పనులు ప్రారంభించాలనుకుంటున్నట్లు తెలిపారు.



Category	Amount (in cr)
Debt as on 31.03.2019	3,75,295

Debt & Liabilities as on 12.06.2024	
Government Debt	4,38,278
Public Account Liabilities	80,914
Corporation Debt	2,48,677
Due to Civil Supplies for Subsidy	36,000
Due to Power Sector	34,267
Outstanding dues to vendors & schemes	1,13,244
Outstanding dues to employees	21,980
Non contribution to Sinking fund	1,196
Total	**9,74,556**

శాసనసభలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

రెండేళ్లలో భోగాపురం ఎయిర్‌పోర్టు

విజయనగరం, రాజమండ్రి, తిరుపతి, కడప ఎయిర్‌పోర్టులని అభివృద్ధి చేశామన్నారు. భోగాపురం న్యూ ఎయిర్‌పోర్టు పనులు ప్రారంభించామని, ఇది ఎప్పుడో పూర్తికావాల్సిఉందని అన్నారు. వైసిపి ప్రభుత్వం పనులు రద్దు చేయడం, భూమి తగ్గించడం వల్ల పూర్తికావడానికి మరో రెండు సంవత్సరాల సమయం పడుతుందన్నారు.

ఎఐ సిటీగా అమరావతి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) సిటీగా అమరావతిని తీర్చిదిద్దనున్నామని బాబు చెప్పారు. అనుకున్న విధంగా పనులు .జరిగి ఉంటే అమరావతి ప్రపంచంలోనే బెస్ట్ సిటీగా తయారయి ఉండేదని, జగన్ అసమర్థవిధానాల వల్ల తీవ్ర నష్టం జరిగిందని అన్నారు.

పోలవరం కొత్త డయాఫ్రమ్ వాల్‌కు రూ.990కోట్లు

వైసిపి ప్రభుత్వ అనాలోచిత విధానల వల్ల పోలవరం డయాఫ్రమ్ వాల్ మూడు చోట్ల దెబ్బతినట్టు విదేశీ నిపుణుల కమిటీ తేల్చి చెప్పిందని అన్నారు. మరమ్మత్తులు చేసినా గ్యారంటీ లేదని నిపుణులు చెప్పారని, ఈ నేపథ్యంలో కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణానికి 990 కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని అన్నారు.

17మందికే టాప్ ర్యాంక్

- నీట్-యుజి ఫలితాల సవరణ



సుప్రీంకోర్టు వెలుపల చర్చించుకుంటున్న నీట్ పిటిషనర్లు

న్యూఢిల్లీ : నీట్ టాప్ ర్యాంకర్లుగా చివరికి 17 మంది మాత్రమే మిగిలారు. గతంలో 67 మందిని నీట్ టాపర్లుగా ఎన్‌టిఎ ప్రకటించిన సంగతి తెలిసిందే. నీట్-యుజి 2024 సవరించిన ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) శుక్రవారం వెల్లడించింది. మే 5న నిర్వహించిన ఈ పరీక్షకు ముందుగా విడుదల చేసిన ఫలితాల్లో 67 మందికి టాప్ ర్యాంక్ లభించిన సంగతి తెలిసిందే. ఈ తరువాత గ్రేస్ మార్కులను ఉపసంహరించుకుని సవరించిన ఫలితాల్లో 61 మందికి టాప్ ర్యాంక్ లభించింది. తాజాగా శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో 17 మందికే టాప్ ర్యాంక్ లభించింది. ఫిజిక్స్‌లో ఒక ప్రశ్నకు రెండు సమాధానాలు వున్నాయని ఎన్‌టిఎ చెప్పిన తరువాత నిపుణుల కమిటీ అభిప్రాయం మేరకు ఒక సమాధానానికే పూర్తి మార్కులు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఆ ఆదేశాల మేరకు ఈ తుది ఫలితాలను ప్రకటించారు. టాప్ 100 ర్యాంక్‌ల్లో 17 మంది 720 మార్కులకు 720 మార్కులు సాధించి టాప్ ర్యాంకర్లుగా నిలవగా, ఆరుగురు 716 మార్కులు, 77 మంది 715 మార్కులు సాధించారు. మే 25న నిర్వహించిన నీట్ పరీక్షలో అక్రమాలపై సిబిఐ విచారణ జరుపుతోంది. ఆరు ఎఫ్‌ఐఆర్‌లను నమోదు చేసింది. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్న పిటిషన్లను సుప్రీంకోర్టు ఇటీవల తిరస్కరించిన సంగతి తెలిసిందే.

అప్పులపై తప్పుడు ప్రచారం

- గవర్నర్‌తో అబద్దాలు చెప్పించారు
- ఆధారాలతో ఫిర్యాదు చేస్తాం
- మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని కూటమి గత వైసిపి ప్రభుత్వ అప్పులపై తప్పుడు ప్రచారం చేయడంతో పాటు చివరకు గవర్నర్‌తో కూడా అబద్దాలను చెప్పించారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని తన నివాసంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం చేసిన అప్పులపై కూటమి నేతలు అసత్యాలు ప్రచారం చేయడమే కాకుండా, గవర్నర్ చేత కూడా అబద్దాలు చెప్పించారని అన్నారు. దీనికి సంబంధించి ఆధారాలతో సహా గవర్నర్‌కు ఫిర్యాదుచేయనున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం 10 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసినట్లు గవర్నర్ చేత చెప్పించారని, నిజానికి ఈ ఏడాది జూన్‌దాకా చంద్రబాబు ప్రభుత్వం 50 రోజుల్లో చేసిన అప్పుతో కలిపి మొత్తం అప్పు రూ 5,18, 708 కోట్ల రూపాయలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ష్యూరిటీతో కార్పోరేషన్‌లు చేసిన అప్పులు కలిపినా రూ 7,48,612 కోట్లు మాత్రమేనని అన్నారు. చంద్రబాబుపాలనలో అప్పులు 21.63 శాతం పెరగ్గా, తమ ప్రభుత్వం హయాంలో 12.9 శాతమేనని చెప్పారు. పూర్తిస్థాయి బడ్జెట్‌ను తీసుకు వస్తే అప్పులపై వాస్తవాలు చెప్పాల్సివస్తుందని, అందుకనే ఓట్ ఆన్ అక్కౌంట్ బడ్జెట్ తో పాలన చేయాలని చూస్తున్నారని అన్నారు. 2019లో ఖజానాలో రూ 100కోట్లు వున్నా తాము పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని అన్నారు. ప్రస్తుతం 7 నుండి 8వేల కోట్ల రూపాయలు అందుబాటులో వున్నా పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టలేని స్థితిలో ఉన్నారని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన ఈ 52 రోజుల పాలనలో అరాచకాలు, దౌర్జన్యాలు, హత్యలతో రాష్ట్ర ప్రజలను భయంకపితులను చేస్తున్నారని చెప్పారు. చంద్రబాబు రాజకీయ జీవిత చరిత్ర అంతా వంచన, గోబెల్స్ ప్రచారంతోనే ముడిపడి వుందన్నారు. కోవిడ్ లాంటి విపత్తు వచ్చినా ఏమాత్రం తగ్గకుండా ప్రజలకు డిబిటి పథకాలను అందించామని తెలిపారు. పోలవరం చంద్రబాబు అనాలోచిత నిర్ణయాలవల్లే దెబ్బతిందన్నారు. అలాగే మద్యంపై దుష్ప్రచారం చేస్తున్నారని వాస్తవంగా ఆ బ్రాండ్‌లన్నీ చంద్రబాబు ప్రభుత్వంలో అనుమతులు తెచ్చుకున్నవేనని అన్నారు. ఉచిత ఇసుక అని తమ ప్రభుత్వ హయాం కంటే ఎక్కువ ధరకు అందిస్తున్నారని అన్నారు.

క్యూబాపై అమెరికా ఆగడాలు ఆపాలి

- అగ్రరాజ్యం చర్యలకు వ్యతిరేకంగా ఒత్తిడి తేవాలి
- ఈక్వెడార్ మాజీ విదేశాంగ మంత్రి గులామి లాంగ్
- క్యూబాకు అండగా నిలవాలి: సీతారాం ఏచూరి

• లోపలి పేజీలో..•

నేడు నీతి ఆయోగ్ పాలకమండలి భేటీ

- హాజరుకానున్న సిఎం చంద్రబాబు
- కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఏడుగురు సిఎంలు దూరం

'పోలవరం', నిర్వాసితులూ ముఖ్యమే

- మంత్రి నిమ్మల రామానాయుడు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పోలవరం నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజ్‌ను పూర్తిస్థాయిలో అందిస్తామని జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రాష్ట్రం కోసం, రైతుల కోసం నిర్వాసితులు త్యాగం చేశారని, ప్రభుత్వానికి పోలవరం ప్రాజెక్టు ఎంత ముఖ్యమో నిర్వాసితుల బాధ్యత కూడా అంతే ముఖ్యమని వెల్లడించారు. రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చే శక్తి పోలవరం ప్రాజెక్టుకు ఉందని శాసనమండలిలో శుక్రవారం చెప్పారు. ఈ ప్రాజెక్టు ఎత్తును గత ప్రభుత్వం 45.72 మీటర్ల నుంచి 41.15 మీటర్లకు తగ్గించిన విషయం వాస్తవమే అని టిడిపి సభ్యులు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. కాంటూరు ఎత్తు 45.72 మీటర్లకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, దీనివల్ల 320 టిఎంసిల గోదావరి జలాలు వాడుకునే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు ఎత్తు పెరిగే కొద్దీ మునిగే మండలాలు, గ్రామాల సంఖ్య పెరుగుతుందని, నిర్వాసితుల సంఖ్య కూడా పెరుగుతుందని అన్నారు. ఎత్తు పెంచే సమయంలో నిర్వాసితుల సంఖ్య లెక్కలు వేయడంలో చాలా తప్పులు జరుగుతున్నాయని వివరించారు. నిర్వాసితుల లెక్కలు కూడా కచ్చితంగా లెక్కకట్టాలని, బడ్జెట్‌లో తొలి ప్రాధాన్యత నిర్వాసితులకు ఇవ్వాలని కోరారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. పునరావాసం కల్పించే విషయంలో కూడా తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. నిరుద్యోగులకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అడిగిన ప్రశ్నకు రవాణా, యువజన మిగతా 5లో

ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితా రూపకల్పన

- ఎన్నికల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ, నియోజకవర్గ ఎమ్మెల్సీ షేక్ బాబ్జీ మృతితో ఏర్పడిన ఖాళీకి సంబంధించి తాజా ఓటర్ల రూపకల్పనకు ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసింది. 2024 నవంబరు ఒకటి నాటికి జాబితా రూపొందించేలా షెడ్యూల్ విడుదల చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్ యాదవ్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 29న ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల రిజిస్ట్రేషన్‌కు ఇసి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. శ్రీకాకుళం - విజయనగరం - విశాఖ ఉపాధ్యాయ నియోజకవర్గానికి, కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు 2024 సెప్టెంబరు 30న ఎన్నికల సంఘం నోటీసు జారీ చేయనుంది. ఈ ఏడాది డిసెంబరు 30 నాటికి తుది ఓటర్ల జాబితా రూపొందిస్తామని సిఇఒ కార్యాలయం పేర్కొంది. ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, పాకలపాటి రఘువర్మ, ఐలా వెంకటేశ్వరావు పదవీకాలం 2025 మార్చి 29తో ముగియనుందని ఇసి వెల్లడించింది.

ఖరీఫ్ ఆశలు ఆవిరి!



వర్షం లేక విత్తనం వేయకపోవడంతో అనంతపురం జిల్లా రాప్తాడు వద్ద బీడుగా ఉన్న పొలం

- ఊరించి ఉసూరుమనించిన వానలు
- వేరుశనగ సాగుకు దాటిన అదును
- రెండో ఏడాదీ 'అనంత'లో కరువు ఛాయలు!

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఊరించిన వర్షాలు ఆ తర్వాత ఉసూరుమనించాయి. జూన్‌లో అత్యధికంగా వర్షాలు నమోదయ్యాయి. అయితే, ఖరీఫ్ పంటల సాగుకు కీలకమైన జులైలో మాత్రం తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రభావం పంటల సాగుపై తీవ్రంగా పడింది. వేరుశనగ పంట సాగుకు అనువైన సమయమైన జులైలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో, ఈ పంటపై రైతుల ఆశలు ఆవిరయ్యాయి. 2023 ఖరీఫ్‌లోనూ వర్షాభావంతో రైతులు పంటలు సాగు చేయలేకపోయారు. ఈ ఏడాదీ మిగతా 5లో

అదును దాటడంతో విత్తనాలను అమ్మేసుకున్నాం

ఏడు ఎకరాల్లో వేరుశనగ, కంది పంట సాగు చేయాలని జూన్‌లో పడిన వర్షాలకు దుక్కులు దున్నుకుని పొలాలను సిద్ధం చేసుకున్నాం. ఎకరానికి రూ.7 వేల వరకు ఖర్చయింది. వేరుశనగ విత్తనాలను మూడు మూటలు సిద్ధం చేసుకున్నాం. వర్షాలు పడితే విత్తుకుందామని నెల రోజులుగా ఎదురు చూసినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు వేసినా దిగుబడి వచ్చే అవకాశం లేకపోవడంతో విత్తనాలను అమ్మేసుకున్నాం. గత ఏడాదీ వర్షాల్లేక పంటలు పండలేదు.

-మాధవరెడ్డి, రామినేపల్లి గ్రామం, రాప్తాడు మండలం

రైతులను ఆదుకోవాలి

గతేడాది తీవ్ర వర్షాభావంతో రైతులు నష్టపోయారు. ఇందుకు సంబంధించి పంటల బీమా ఇంతవరకూ అందలేదు. ఈ ఏడాది జులైలో వర్షాలు పడకపోవడంతో విత్తనం విత్తుకోలేకపోయారు. దుక్కుల కోసం ఖర్చు అయింది. ప్రభుత్వం పరిహారం అందించి రైతులను ఆదుకోవాలి. ప్రత్యామ్నాయ విత్తనాలను ఉచితంగా అందిస్తే, వచ్చే నెలలో వర్షాలు పడితే ఆ పంటలను సాగు చేసుకునేందుకు వీలుంటుంది.

-చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, అనంతపురం.

ముగిసిన అసెంబ్లీ సమావేశాలు

- 27.22 గంటల పాటు సభా నిర్వహణ
- స్పీకరు అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

16వ శాసనసభ మొదటి సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. మొదటి విడత సమావేశాలు జూన్ 21, 22 తేదీలు, రెండో విడత సమావేశాలు ఈ నెల 23 నుంచి 26 వరకు మొత్తం ఆరు రోజులు నిర్వహించినట్లు శాసనసభ స్పీకరు అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. శాసనసభ సమావేశాలు ముగిసిన వెంటనే సభా నిర్వహణకు సంబంధించి గణాంకాలను విడుదల చేశారు. మొత్తమ్మీద సభ 27 గంటల 22 నిమిషాలు నడిచిందని తెలిపారు. మౌఖికంగా సమాధానం చెప్పిన స్టార్ ప్రశ్నలు 36, సభలో సమాధానం ఇవ్వబడిన స్వల్ప వ్యవధి ప్రశ్నలు 1, ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు 3, ప్రవేశపెట్టిన బిల్లుల సంఖ్య 2, ఆమోదం పొందిన బిల్లుల సంఖ్య 2, ప్రసంగాలు 68 మంది, 344వ నియమం కింద చర్చ ఒక ప్రశ్న నడిచిందని స్పీకరు వెల్లడించారు. సభలో రాజకీయ పక్షాల బలాబలాలు టిడిపి 135 మంది, జనసేన 21, వైసిపి 11, బిజెపి 8 మంది మొత్తం 175 మంది సభ్యులు అని స్పీకరు అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు.

బాలికపై లైంగిక దాడి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్ (ఏలూరు జిల్లా)

బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమరవరం గ్రామానికి చెందిన బాలిక (7)ను అదే గ్రామానికి చెందిన మడకం వెంకటేష్ (27) గురువారం రాత్రి గోదావరి చూపిస్తానని చెప్పి ట్రాక్టర్‌పై ఎక్కించుకెళ్లాడు. సమీపంలోని గిరిజన ప్రాథమిక సహకార మార్కెట్ సొసైటీ సమీపంలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. పాప కోసం కుటుంబ సభ్యులు గాలిస్తున్న సమయంలోనే ఆ ప్రబుద్ధుడు బాలికను ట్రాక్టర్‌పై తీసుకొచ్చి ఊరు శివార్లలో వదిలేసి వెళ్లిపోయాడు. ఏడుస్తూ ఇంటికి వస్తున్న సమయంలో తల్లిదండ్రులు గుర్తించి బాలికను విషయం అడగగా జరిగిన అఘాయిత్యం గురించి చెప్పింది. దీంతో బాధితురాలి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికను జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని శుక్రవారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరామర్శించారు. కుటుంబ సభ్యులను కలిసి సంఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జగన్ సభకు రావాలి

- ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసిపికి ప్రజలు 11 సీట్లు ఇచ్చారని, ప్రజల తీర్పును గౌరవించి అసెంబ్లీకి రావాలని అన్నారు. ప్రజల పక్షాన మాట్లాడేందుకు, ప్రజావాణి వినిపించేందుకు ప్రతిపక్షం ఉండాలని చెప్పారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పాత్ర చేపట్టలేనంటూ చేతులెత్తేశారని, ప్రతిపక్షనేత హోదా కావాలంటూ కోర్టుకు మాత్రం వెళ్తున్నారని తెలిపారు. రాజకీయ హత్యకు గురైన 36 మంది వైసిపి కార్యకర్తల వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. హత్యలు జరిగితే రాష్ట్రడిజిపికి వివరాలు ఇవ్వకుండా నేరుగా ఢిల్లీలో ధర్నా చేయడం ఏమిటని ప్రశ్నించారు.


గవర్నరుకు జగన్ లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి గవర్నరు చేసిన ప్రసంగంలో కొన్ని అంశాలను ప్రభుత్వం వక్రీకరణ చేసిందని వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గవర్నరు అబ్దుల్ నజీర్‌కు ఆయన శుక్రవారం 7 పేజీల లేఖ రాశారు. ఇదే విషయాన్ని ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో తెలిపారు.

రైతులను ఆదుకుంటాం

- ఇళ్లు నీట మునిగిన ప్రతి కుటుంబానికీ రూ.3 వేల తక్షణ సాయం
- 1.06 లక్షల ఎకరాల్లో వరి పంట నీటి ముంపు
- 4,317 ఎకరాల్లో నారుమళ్లుమునక
- శాసనసభలో సిఎం చంద్రబాబు ప్రకటన



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వరదలకు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శాసనసభలో శుక్రవారం వరదలు, భారీ వర్షాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. చర్చ అనంతరం ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. వరద బాధిత ప్రాంతాలకు వెళ్లి అక్కడ బాధితులను పరామర్శించి, నష్టం అంచనాలను పరిశీలించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను సిఎం ఆదేశించారు. ఆయా జిల్లాల మంత్రులు కూడా తమ ప్రాంతాల్లో జరిగిన నష్టం వివరాలను సేకరించి అందజేయాలని సూచించారు. తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో పంటలు దెబ్బతిన్నాయన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మెట్ట ప్రాంతమైనప్పటికీ అక్కడ కూడా వరదల వల్ల కొంత నష్టం ఏర్పడిందన్నారు. ప్రాథమిక అంచనాల మేరకు ఈ వరదల్లో 4,317 ఎకరాల్లో ఆకుమడులు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. లక్షా ఆరు వేల ఎకరాల్లో వరినాట్లు ముంపునకు గురయ్యాయని తెలిపారు. 3,160 ఎకరాల్లో మొక్కజొన్న, 960 ఎకరాల్లో పత్తి పంటలకు నష్టం వాటిల్లింది. ఈ నష్టం అంచనాలన్నీ కేవలం ప్రాథమిక అంచనానని, క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు ఈ నష్టం ఇంకా పెరిగే సూచనలున్నాయని సిఎం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో 273 ఎకరాల్లో పంటలు ఇప్పుడు కూడా నీళ్లలోనే మునిగిపోయి ఉన్నాయన్నారు. ప్రకృతి విపత్తు వచ్చినప్పుడు ప్రజలను పూర్తిగా ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. గతంలో హుదూద్, తిత్లీ తుపాన్లు వచ్చినప్పుడు ప్రజలకు సాయం చేశామన్నారు. ఇప్పుడు ఈ ఐదారు జిల్లాల్లో వచ్చిన విపత్తుల వల్ల నష్టపోయిన వారందరికీ సాయం అందిస్తామన్నారు. ప్రతి కుటుంబానికీ 25 కేజీల బియ్యం, కేజీ పప్పు, లీటరు పామాయిల్, కేజీ బంగాళదుంపలు, కేజీ ఉల్లిపాయలు చొప్పున ఇస్తున్నామన్నారు. అవి ఒకవైపు ఇస్తూనే, గతంలో ఎన్నడూ ఇవ్వని విధంగా ఎక్కడైతే ఇళ్లలోకి వరద నీరు పూర్తిగా వచ్చి చేరిందో, ఎవరైతే పునరావాస కేంద్రాల్లో ఉంటున్నారో వాళ్లందరికీ ఒక్కో కుటుంబానికి రూ.3 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తామన్నారు. తానే స్వయంగా వెళ్లి వరద బాధితులను పరామర్శించాలనుకున్నానని, కాని.. నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొనడానికి ఢిల్లీకి వెళ్లాల్సి ఉండటంతో కుదరడం లేదని తెలిపారు. మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ.. వరదలు, వర్షాలపై ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేశామని తెలిపారు. వరదల వల్ల నలుగురు చనిపోయారని తెలిపారు.

గుట్టలుగా సమస్యలు : శిరీష

తమ నియోజకవర్గంలో గుట్టలుగా సమస్యలు పేరుకుపోయాయని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. 11 మండలాల్లో 8 మండలాలు వరదలకు నష్టపోయాయని తెలిపారు. 34 వేల కుటుంబాల నష్టపోయాయన్నారు. వరద ప్రభావం ఉన్న నియోజకవర్గంలో ఒక్కటైనా శాశ్వత పునరావస కేంద్రం లేదన్నారు. డెంగీ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. 34 వేల కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మురుగు వల్ల బాగా నష్టం :పితాని

మురుగు వల్ల పంటలన్నీ ముంపునకు గురయ్యాయని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తెలిపారు. గత ఐదేళ్లుగా డ్రెయినేజీ వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందన్నారు. కాల్వల మరమ్మతులను పటించుకోవడం లేదన్నారు. వెంటనే ఒక ప్రణాళిక ప్రకారం నీటిపారుదల కాల్వలు, డ్రెన్లు మరమ్మతులు చేయాలన్నారు.

40 వేల ఎకరాల్లో వరికినష్టం :బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో 40 వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. అలాగే ఉండి నియోజకవర్గంలో 15 వేల ఎకరాల్లో నష్టం జరిగిందని ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ.. ఏలేరు రిజర్వాయర్ వల్ల తమ నియోజకవర్గంలో ఎక్కువ నష్టం జరిగిందన్నారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదలకు రైతులు బాగా నష్టపోయారని తెలిపారు. గత ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అస్తవ్యస్తం చేసిందన్నారు. బీమా లేకపోవడం వల్ల రైతులకు నష్టం జరిగిందన్నారు. తణుకు నియోజకవర్గంలో 10 వేల ఎకరాల్లో నాట్లు ముంపునకు గురయ్యాయని ఎమ్మెల్యే ఎ రాధాకృష్ణ తెలిపారు.

అత్యాచారాలపై చర్చించాలి

- మండలిలో పిడిఎఫ్ వాయిదా తీర్మానం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అత్యాచారాలపై చర్చించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు శాసనమండలిలో వాయిదా తీర్మానం అందజేశారు. శాసనమండలి శుక్రవారం ప్రారంభం కాగానే ఈ అంశంపై చర్చించాలని కోరుతూ ఛైర్మన్ కె మోషేనురాజుకు అందజేశారు. ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించినట్లు ఛైర్మన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. నెలరోజుల వ్యవధిలోనే విజయనగరం, అనకాపల్లి, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో అత్యాచార ఘటనలు జరగడం బాధాకరమన్నారు. ప్రతినిత్యం జరుగుతున్న ఈ ఘటనలను కట్టడి చేయాలని కోరారు. బాధితుల పక్షాన ప్రభుత్వం నిలబడి దోషులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ, శిశు సంక్షేమ, హోంశాఖ ఈ ఘటనలపై ఉమ్మడిగా అవగాహన సదస్సులు ఏర్పాటుచేయాలని కోరారు.

విద్యాకానుక టెండర్లపై విచారణ

- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందించే విద్యాకానుక టెండర్లపై విచారణ జరిపిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ టెండర్లను ఖరారు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని టిడిపి సభ్యులు పి అశోక్‌బాబు, బి తిరుమల నాయుడు, వేపాడ చిరంజీవి అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. విద్యాకానుకను కొనసాగిస్తామని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అడిగిన ప్రశ్నకు లోకేష్ సమాధానం చెప్పారు. టెండర్లు లేకుండా సరైన ప్రక్రియ పాటించలేదని, కావున దీనిపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. 2020-21 విద్యా సంవత్సరంలో రూ.1503 ఉన్న కిట్ ధర ఈ విద్యాసంవత్సరం రూ.2702లకు ఖరారు చేశారని తెలిపారు. ధర పెరుగుదలకు అధికారులు చెప్పిన సమాధానం తనకు సంతృప్తికరంగా లేదన్నారు. బ్యాగుల నాణ్యతపై తనకు కూడా ఫిర్యాదులు అందాయని చెప్పారు. విద్యార్థులకు బైలింగ్వల్ టెక్స్టుబుక్స్ అందించడం వల్ల పుస్తకాల బరువు 20 కెజీలకు పెరిగిందన్నారు. పుస్తకాల బరువు 10 నుంచి 12 కెజీల కంటే ఎక్కువ ఉండకూడదనే నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఈ పుస్తకాలను ఏం చేయాలో అనే ఆలోచన చేస్తున్నామని చెప్పారు. విద్యాకానుక కిట్లకు పార్టీ రంగులు కూడా అవసరం లేదన్నారు. యూనిఫాం కుట్టుకూలి ధరలు తల్లిదండ్రులకు త్వరలో అందిస్తామన్నారు.

పోస్టుల భర్తీకి చర్యలు

ప్రభుత్వ జూనియర్, పాలిటెక్నిక్, డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేష్ సమాధానం చెప్పారు. విశ్వవిద్యాలయాల్లో 3,220 బోధన, 4,663 బోధనేతర పోస్టులు ఖాళీలు ఉన్నాయని సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి, పంచుమర్తి అనురాధ, కంచర్ల శ్రీకాంత్ అడిగిన ప్రశ్నకు మంత్రి లోకేష్ సమాధానంగా తెలిపారు. ఈ సందర్భంగా పిడిఎఫ్ సభ్యులు కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ.. జూనియర్, డిగ్రీ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో 15 ఏళ్ల నుంచి బోధన సిబ్బంది ఖాళీ పోస్టులు భర్తీ చేయడం లేదన్నారు. యూనివర్సిటీల్లోనే 5 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. అందరితో చర్చించి పోస్టులు భర్తీ చేయాలని కోరారు. విశ్వవిద్యాలయాల్లో పోస్టుల భర్తీ కోసం గతంలో టిడిపి, వైసిపి ప్రభుత్వాలు విడుదల నోటిఫికేషన్లు కోర్టులో ఉన్నాయని తెలిపారు. సభ్యులు చిరంజీవిరావు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాల్లో ప్రమాణాలు పూర్తిగా అడుగంటాయని అన్నారు. బోధన పోస్టుల సిబ్బందిని భర్తీ చేయకపోవడంతో ప్రమాణాలతో కూడిన విద్యను అందించలేకపోతున్నామని తెలిపారు. ఏడాదిలోపు విద్యారంగాన్ని ప్రక్షాళన చేసి యూనివర్సిటీల్లో ప్రమాణాలు పెంచాలని కోరారు. విద్యార్థుల అడ్మిషన్లపై స్పష్టమైన కేలండరు విడుదల చేయాలని రామగోపాల్ రెడ్డి కోరారు.

మళ్లీ ఉప్పొంగుతున్న గోదావరి

భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

- లంకలను వీడని వరద
- ఆగస్టు వరకూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు
- 5,700 ఎకరాల్లో ఉద్యాన పంటలు నష్టం



కోనసీమ జిల్లా అల్లవరం మండలం పల్లెపాలెంలో ఇళ్లల్లోకి ప్రవేశించిన వరద

ప్రజాశక్తి- యంత్రాంగం

గోదావరి మళ్లీ ఉప్పొంగుతోంది. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు భద్రాచలం వద్ద 47 అడుగులతో నిలకడగా ఉన్న గోదావరి క్రమేపీ పెరుగుతోంది. రాత్రికి 48.40 అడుగులకు చేరింది. దీంతో భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీల వద్ద వరద ప్రవాహం 13.50 అడుగుల వద్ద స్థిరంగా ఉంది. కాటన్ బ్యారేజీ నుంచి 175 గేట్లను పైకి ఎత్తి 12,44,232 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. పోలవరం 48 గేట్ల ద్వారా 11,06,947 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఇఇ మల్లికార్జునరావు, డిఇ మాధవరావు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.150 మీటర్లు, స్పిల్‌వే దిగువన 24.800 మీటర్లు నమోదైనట్లు ఇఇలు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

అల్లూరి జిల్లా చింతూరు మండలంలోని సోకిలేరు. కొయిగురు. కొమ్మూరు వాగులు పొంగి ప్రవహిస్తూనే ఉన్నాయి. పాడేరు డివిజన్‌లోని అనంతగిరి మండలంలో గెడ్డలు పొంగి ప్రవహిస్తుండటంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారు. ముంచింగిపుట్టు మండలం లక్ష్మీపురం, బుంగపుట్టు, బూసిపుట్టు, వనుగుమ్మలో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

కుక్కునూరు మండలం దాచారం-కుక్కునూరు, ముత్యాలంపాడు-వింజరం మధ్య రహదారులు స్తంభించడంతో చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి మండల కేంద్రానికి ఆ గ్రామ వాసులు చేరుకోవాల్సి వస్తోంది. విలీన మండలాల ప్రజలు ఆగస్టు వరకూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

లంకలను వీడని వరద

తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లోని గోదావరి లంకల్లో ముంపు ఇంకా తగ్గలేదు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలో 60 ఇళ్లను వరద ముంచెత్తింది. అల్లవరం మండలం పల్లిపాలెం గ్రామంలోకి వరద నీరు చేరింది. ముమ్మిడివరం మండలంలో లంక ఆఫ్ ఠానేలంక, కూనలంక, గురజాపులంక, చింతల్లంక, కాట్రేనికోన మండలంలో పల్లంకుర్రు, పి.గన్నవరం మండలంలో శివాయలంక, చినకందపపాలెంలకు వరద నీరు చేరింది. రామచంద్రపురం మండలం కోటిపల్లి రేవు పూర్తిగా నీటమునిగింది. కోనసీమ జిల్లాలో నాలుగు వేల ఎకరాలు, తూర్పు గోదావరి జిల్లాలో వర్షాలు, గోదావరి వరదలకు సుమారు 1,700 ఎకరాల్లో 1,150 మంది రైతులకు చెందిన ఉద్యాన పంటలు ముంపునకు గురైనట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

1261వ రోజుకు ఉక్కు దీక్షలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)



వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేయాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ అన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1261వ రోజుకు చేరాయి. దీక్షలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌కు తక్షణమే రూ.10 వేల కోట్లు కేటాయించాలన్నారు. ఉక్కు కర్మాగారం తెలుగు ప్రజల హక్కు అని, ప్రయివేటుపరం చేయడం తగదని అన్నారు. ప్లాంట్‌ను కాపాడుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా కార్మికవర్గం, ప్రజానీకం సిద్ధంగా ఉందని తెలిపారు. ప్లాంట్ పరిరక్షణకు టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్రంలోని మోడీ సర్కారుపై ఒత్తిడి తేవా లని కోరారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు ఎం రాజశేఖర్, డి.ఆదినారాయణ, నీరుకొండ రామచంద్రరావు, బిఎన్.రాజు, సుబ్బయ్య పాల్గొన్నారు.



పంచాయతీలలో విధులకు దూరంగా 21వేల మంది పారిశుధ్య కార్మికులు

- వేతనాలు చెల్లించకపోవడమే కారణం
- శాసనసభలో డిప్యూటీసిఎం వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వ్యాధులు వాపిస్తున్నాయి. ప్రజానీకం జ్వరాల బారిన పడుతున్నారు. మరోవైపు పంచాయతీలలో పెద్ద సంఖ్యలో పారిశుధ్య కార్మికులు విధులకు దూరంగా ఉంటున్నారు. సకాలంలో వారికి వేతనాలు చెల్లించకపోవడమే ఈ పరిస్థితికి కారణం. రాష్ట్ర శాసనసభలో ఒక ప్రశ్నకు జవాబుగా డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్వయంగా ఈ వివరాలు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులకు 103 కోట్ల రూపాయలు వేతనాల బకాయిలు ఉన్నట్లు ఆయన చెప్పారు.

చాలా పంచాయతీల్లో కొంత కాలంగా వేతనాలు చెల్లించడం లేదని, ఫలితంగా 21వేల మందికిపైగా పారిశుధ్య కార్మికులు విధులకు హాజరు కావడం లేదని వివరించారు. గత ప్రభుత్వ హయంలో కేంద్రం 8,283 కోట్ల రూపాయలను విడుదల చేస్తే పంచాయతీలకు 7,587 కోట్ల రూపాయలు మాత్రమే చేరాయని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం నేరుగా పంచాయతీలకు వెళ్లాల్సిన నిధులను కూడా గత ప్రభుత్వం ఇతర అవసరాలను వాడుకుందని అన్నారు. పంచాయతీలలో కనీస అవసరాలకు కూడా నిధులు లేక సర్పంచ్‌లు ఇబ్బందులు పడ్డారని చెప్పారు. అంతకుముందు టిడిపి ఎమ్మెల్యేలు కూన రవికుమార్, చింతమనేని ప్రభాకర్, గౌరు చరితా రెడ్డిలు ఈ విషయమై మాట్లాడారు.

డిప్యూటి సిఎం పవన్‌కల్యాణ్ సమాదానం చెబుతూ కేంద్రం రూ 8,283 కోట్లను విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ 7,587 కోట్లను విడుదల చేసిందన్నారు. చాలా పంచాయతీలలో వేతనాలు ఇవ్వడం లేదని పారిశుధ్యకార్మికులు విధులకు హాజరు కావడంలేదన్నారు. దాదాపు 21వేల మంది సిబ్బంది విధులకు దూరంగా వున్నారని తెలిపారు. పారిశుధ్య కార్మికులకు రూ 103 కోట్ల వేతన బకాయిలు వున్నాయని తెలిపారు.

మద్యాన్ని నియంత్రించండి

- ప్రభుత్వానికి ఐద్వా వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మద్య నియంత్రణ చేసి మహిళలకు, వారి కుటుంబాలకు రక్షణ కల్పించాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి కోరారు. ఈ మేరకు ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రకు వెలగపూడి సచివాలయంలో శుక్రవారం ఆమె వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో 2020లో 5.55 లీటర్ల మద్యం సగటు వినియోగం ఉండగా, 2023-24 నాటికి 6.23 లీటర్లకు పెరిగినట్టు ప్రకటించారన్నారు. 2019-21 కాలంలో 15-49 ఏళ్ల మధ్య వయసు కలిగిన మహిళలు మద్యం తాగిన భర్తల చేతిలో భౌతిక, లైంగిక దాడులకు గురైనట్టు తెలిపారు. మద్యం, మాదక ద్రవ్యాలకు బానిసలై ఆత్మహత్యలు చేసుకున్న వారి సంఖ్య 2018 కన్నా 2020 నాటికి నూరు శాతం పెరిగినట్టు జాతీయ నేర గణాంక సంస్థ లెక్కలు చెబుతున్నాయన్నారు. మద్యం కారణంగా నేరాలు రెట్టింపయ్యాయని గుర్తుచేశారు. ఢిల్లీలో నిర్భయ, హైదరాబాద్‌లో దిశ, విజయనగరంలో ఆరు నెలల పసిపాపపై అఘాయిత్యం వంటి ఘటనలు కేవలం మద్యం, మాదక ద్రవ్యాల మత్తులో జరిగినవేనన్నారు. అందువల్ల నేరాల నియంత్రణకు మద్యం నియంత్రణ తప్పనిసరి చేయాలన్నారు. మద్యం షాపుల సంఖ్యను గత ప్రభుత్వం కంటే తగ్గించాలన్నారు. క్రమేణా కనీస స్థాయి తేవాలన్నారు. మద్య నిషేధం నుంచి మద్యం షాపులను అనుమతిస్తూ 1996లో చంద్రబాబు తొలిసారి సిఎం అయిన సందర్భంలో ప్రకటించినట్టు మండలానికి ఒక షాపునకు పరిమితం చేయాలన్నారు. తాగేవాళ్ల సంఖ్యను తగ్గించాలన్నారు. మైనర్లకు మద్యం, మత్తు పదార్థాలు అందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. టూరిజం పేరుతో వైసిపి ప్రభుత్వం అనుమతించిన మద్యం షాపులను తొలగించాలన్నారు. మద్యం ఆదాయంలో 5 శాతమైనా మద్య వ్యతిరేక ప్రచారానికి కేటాయించాలన్నారు. షాపుల్లో మద్యం అమ్మే సమయాలను తగ్గించాలని, వారంలో ఒక రోజు డ్రైడేగా ప్రకటించాలన్నారు. గుడి, బడి, ఆస్పత్రి, బస్టాండుల్లో, రద్దీ కేంద్రాల్లో ఉన్న మద్యం షాపులను తొలగించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విస్తృతంగా చేపట్టాలన్నారు. వ్యసన విముక్తి కేంద్రాలు, పునరావాస కేంద్రాల సంఖ్యను పెంచాలని, సిఎం చంద్రబాబు ప్రకటించిన విధంగానే తాగేవారికి కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ మద్యం అమ్మకాలను, నాటుసారా విక్రయాలను అరికట్టడానికి చర్యలు చేపట్టాలన్నారు. మద్యం వల్ల అర్థాంతరంగా ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. మద్యం అమ్మకాల్లో జరిగిన అక్రమాలు, అవినీతికి కారణమైన వారందరిపైనా చర్యలు తీసుకోవాలన్నారు.

కార్యాలయ సిబ్బందిపైనే అనుమానం!

- 2,400 ఫైళ్ల దగ్ధం
- మదనపల్లె ఘటనపై సిసోడియా



భూ బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సిసోడియా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో రికార్డుల దగ్ధం ఘటనపై కొంతమంది కార్యాలయ సిబ్బందిపై అనుమానం ఉందని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా చెప్పారు. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే కొంతమందిపై సస్పెన్షన్ వేటు పడిందని, మరికొంతమందిని అరెస్టు చేసే అవకాశం ఉందని తెలిపారు. శుక్రవారం భూ బాధితుల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. కార్యాలయంలో సుమారు 2,400 ఫైళ్లు దగ్ధమైనట్లు గుర్తించామని, వాటిని రికవరీ చేసే అవకాశం ఉందని వివరించారు. ఏదైనా కెమికల్ ఉపయోగించడం వల్ల పెద్దఎత్తున మంటలు సంభవించాయా? మరే రకమైన ద్రవ పదార్థాలు ఏమైనా వాడారా? అనే విషయాలు ఫోరెన్సిక్ నివేదిక వచ్చిన తర్వాత తెలుస్తుందని, ఆ తరువాతనే దోషులను అరెస్టు చేస్తామని తెలిపారు. ఇప్పటికే ఏడుగురిని అదుపులోకి తీసుకుని పలు కోణాల్లో విచారిస్తున్నామన్నారు. భూ కుంభకోణాల్లో ఎక్కువగా ప్రమేయం ఉన్న రైస్‌మిలు యజమాని మాధవరెడ్డి పరారీలో ఉన్నారిని, ఆయన కోసం పోలీసు బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు.

అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 20 ఏళ్లుగా 2.16 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్ అయ్యాయని, అందులో 4,400 ఎకరాలు రిజిస్ట్రేషన్ కూడా జరిగిపోయినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో నివేదికలు తెప్పించుకొని వాటి ఆధారంగా చర్యలు చేపడతామన్నారు. తాము స్వీకరించిన అర్జీల్లో ప్రధానంగా దౌర్జన్యంగా భూములు, డికెటి భూముల రిజిస్ట్రేషన్లు వంటివి వచ్చాయని, వాటిని సెక్షన్ 145 ప్రకారం బాధితులకు అప్పగించే ప్రయత్నం చేస్తామన్నారు. కోర్టులో ఉన్న భూ కేసులను కోర్టు పరిధిలోనే న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 400 అర్జీలు వచ్చాయని, ప్రతి ఒక్క అర్జీని పరిశీలించి కచ్చితంగా బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

శానిటేషన్‌పై దృష్టి

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ కార్పొరేషన్లలో శానిటేషన్, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు దృష్టిపెట్టాలని మున్సిపల్‌శాఖ మంత్రి పి నారాయణ ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్‌లకు కొత్తగా నియమించిన కమిషనర్లతో సచివాలయంలో మంత్రి నారాయణ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మున్సిపల్‌శాఖ డైరెక్టర్ హరినారాయణన్, టిడ్కో ఎమ్‌డి సాయికాంత్ వర్మ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి గంధం చంద్రుడు హాజరు అయ్యారు. ఆయా కార్పొరేషన్లలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, టిడ్కో ఇళ్లపై చర్చించారు. నగరాల్లో పార్కులు, సెంట్రల్ డివైడర్లు, రోడ్ల గుంతలు పూడ్చటం, డ్రెయిన్లలో పూడిక తొలగింపుపై దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. సెంట్రల్ డివైడర్‌లలో ఎలాంటి ఫ్లెక్సీలున్నా వెంటనే తొలగించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు చేయాలన్నారు. అన్న క్యాంటీన్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు (స్టెరిలైజేషన్) చేయించాలని, టౌన్ ప్లానింగ్‌పై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేసేలా చూడాలని ఆదేశించారు.

విశాఖలో భారీగా ప్రభుత్వ ఆస్తుల తాకట్టు

- పెద్ద ఎత్తున నిధుల మళ్లింపు
- శ్వేతపత్రంలో వెల్లడి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గత ప్రభుత్వ పాలనలో ఒక్క విశాఖపట్నంలోనే రూ.1941 కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి నిధులు సేకరించినట్లు శ్వేతపత్రంలో తెలిపారు. శుక్రవారం రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టి ఆర్థికశాఖ శ్వేతపత్రంలో ఈమేరకు వివరాలను పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా తన ప్రసంగంలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. విశాఖను రాజధాని అని ప్రచారంచేస్తూ, అక్కడి ఆస్తులనే తాకట్టు పెట్టారని ఆయన చెప్పారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం నుండి అందిన నిధులను కూడా పెద్ద మొత్తంలో దారి మళ్లించినట్లు తెలిపారు. స్థానిక సంస్థలకు ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన నిధులను రూ.1453 కోట్లు దారి మళ్లించారని చెప్పారు.

పిడి అకౌంట్స్‌లో స్థానిక సంస్థల డబ్బులు 1689 కోట్లను కూడా ఇతర అవసరాలకు వినియోగించారని చెప్పారు. డిస్కమ్స్ మొత్తం రూ.2,166 కోట్లు డైవర్ట్ చేశారని, ఉద్యోగుల సేవింగ్స్ రూ.5,423కోట్లు, పెన్షన్ అండ్ ప్రావిడెంట్ ఫండ్, ఎపిజెన్‌కో, ఎపి ట్రాన్స్‌కో, డిస్కమ్స్ కలిపి రూ.3,143కోట్లు ఎపిఎస్‌బిసిఎల్‌లో బాండ్స్‌లో పెట్టుబడులుగా పెట్టాయని ఫలితంగా ప్రతి సంవత్సరం రూ.25.40కోట్లు నష్టం వస్తోందని తెలిపారు.

విశాఖలో తాకట్టు పెటిన ప్రభుత్వ ఆస్తుల వివరాలు

ప్రభుత్వ ఆస్తులు	- ఎకరాలు	తాకట్టు రుణం
ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల	- 24	రూ.359కోట్లు
డైరీ	- 30	రూ.309కోట్లు
ప్రభుత్వ ఐటిఐ కళాశాల	- 17	రూ.270కోట్లు
పోలీస్ క్వార్టర్స్	- 9	రూ.215కోట్లు
ట్రైనింగ్ అండ్ ప్రొడక్షన్ సెంటర్ ఆఫ్ డిసేబుల్డ్ వెల్ఫేర్	- 19	రూ.157కోట్లు
ఇఇ బంగ్లా	- 10	రూ.203కోట్లు
ఆర్‌అండ్‌బి క్వార్టర్స్	- 3	-రూ.99కోట్లు
రైతు బజారు	- 4	-రూ.90కోట్లు
సర్క్యూట్ హౌస్	- 3	రూ..81కోట్లు
పిడబ్ల్యుడి ఆఫీస్	- 4	రూ.79కోట్లు
సెరికల్చర్	- 6	రూ.47కోట్లు
సీతమ్మధార తహసీల్దార్ ఆఫీస్	- 1	రూ.34కోట్లు

గ్రామీణ పేదలను వంచించిన కేంద్రం

- బడ్జెట్‌లో కార్పొరేట్లకే పెద్దపీట
- నిరసనగా 28, 29 తేదీల్లో బడ్జెట్ ప్రతుల దగ్ధం
- రైతు, వ్యకాస, కౌలుదార్ల సంఘాల తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న డి పాపారావు

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతాలకు మోడీ ప్రభుత్వం మరోమారు అన్యాయం చేసిందని పలువురు వక్తలు విమర్శించారు. పేదలను కొట్టి, కార్పొరేట్లకు దోచిపెట్టేలా బడ్జెట్ ఉందని పేర్కొన్నారు. దుర్మార్గమైన కేంద్ర ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఈ నెల 28, 29 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా, మండల కేంద్రాలు, గ్రామాల్లో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేయాలని ఎపి రైతు, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యాన నిర్వహించిన రాష్ట్ర స్థాయి చర్చావేదిక తీర్మానించింది. దీనిలో భాగంగానే విజయవాడ లెనిన్ సెంటర్‌లో ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కేంద్ర బడ్జెట్ ప్రతులను దగ్ధం చేయనున్నట్లు ఆయా సంఘాల నాయకులు తెలిపారు. ఈ సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్-వ్యవసాయ గ్రామీణ పేదలపై ప్రభావం' అనే అంశంపై రాష్ట్ర స్థాయి చర్చావేదికను విజయవాడలోని గవర్నరుపేట బాలోత్సవ భవనంలో శుక్రవారం నిర్వహించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన ఈ చర్చావేదికలో ఆర్థికరంగ విశ్లేషకులు డి పాపారావు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ రైతాంగ, కార్మిక, పేద ప్రజలు, గ్రామీణ వ్యతిరేక సంస్కరణలను ముందుకు తీసుకెళ్లేదిగా ఉందన్నారు. ఢిల్లీలో రైతాంగం పెద్దయెత్తున ఆందోళనలు చేసిన తర్వాత కూడా కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడేందుకు వ్యవసాయ రంగాన్ని కేంద్రం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. స్వామినాథన్ సిఫార్సు ప్రకారం ఎంఎస్‌పిలో సి2ప్లస్50ని కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా చేసే ఏ ఒక్క చర్యా తీసుకోలేదని చెప్పారు. బడ్జెట్‌లో ఉత్పత్తి రంగాల కన్నా స్పెక్యులేటివ్ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలతో గ్రీస్, శ్రీలంక, పాకిస్తాన్ తరహా సంక్షోభం దేశంలోనూ తలెత్తే పరిస్థితి ఉందన్నారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. కేంద్రం వ్యవసాయ రంగం ఉత్పత్తులు ఉత్పాదకత పెంచాలని బడ్జెట్‌లో చెప్పిందని, కేటాయింపులు తగ్గించి ఉత్పాదక పెంచమనడం అర్థం లేనిదని అన్నారు. బీహార్‌కు గ్రాంటు రూపంలో భారీగా నిధులిచ్చిన కేంద్రం రాష్ట్ర రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పు సమకూర్చుతామని చెప్పడం బాధాకరమన్నారు. పోలవరం ప్రాజెక్టుతోపాటు ఇతర విభజన హామీలను సాధించేందుకు బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్‌తో కలిసి కేంద్రంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఒత్తిడి తేవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మూడేళ్లుగా వరుసగా వ్యవసాయ అనుబంధ రంగాలకు కేంద్రం కేటాయింపుల్లో కోతపెడుతోందన్నారు. 2022-23లో కన్నా ఈ బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీలో 35 శాతం, ఆహార సబ్సిడీలో 25 శాతం ఉపాధి హామీ చట్టం నిధుల్లో 20 శాతం కోతపెట్టిందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు బడ్జెట్ రివైజ్ చేసి రూ.5 వేల కోట్లను కేటాయించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ.. వాస్తవంగా భూమిపై వ్యవసాయ పంటలు సాగుచేస్తున్న కౌలు రైతులను కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై కేశవరావు మాట్లాడుతూ.. బడ్జెట్ ప్రతుల దగ్ధం కార్యక్రమాన్ని పెద్దయెత్తున చేపట్టి కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు రైతు, కౌలు, వ్యవసాయ కార్మిక సంఘాల డిమాండ్లకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దడాల సుబ్బారావు, సింహాద్రి ఝాన్సీ, జి ఈశ్వరయ్య, అక్కినేని భవానీప్రసాద్, డి హరినాథ్, ఎం వెంకటరెడ్డి పాల్గొన్నారు.



గుదిబండి నాగిరెడ్డి భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పుతున్న వి శ్రీనివాసరావు తదితరులు

పేదల కోసం బతికిన నాగిరెడ్డి

- నివాళులర్పించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
- కొల్లిపరలో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి- కొల్లిపర (గుంటూరు జిల్లా)

ప్రజా పోరాటాల ద్వారా ఎర్రజెండా కీర్తి ప్రతిష్టలను ప్రజల్లోకి తీసుకెళ్లిన గుదిబండి నాగిరెడ్డి ధన్యజీవి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన కొల్లిపరలో నాగిరెడ్డి భౌతికకాయాన్ని ఆయన సందర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులతో కలసి నాగిరెడ్డి భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. నాగిరెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ కొల్లిపర ప్రాంతంలో వ్యవసాయ, రైతు, కార్మిక ఉద్యమాల ద్వారా పేద ప్రజలకు నాగిరెడ్డి అండగా నిలిచారన్నారు. 1974లో కొల్లిపర గ్రామంలో పది రోజులు జరిగిన సిపిఎం రాష్ట్ర రాజకీయ పాఠశాల నిర్వహణ బాధ్యతలు తీసుకోవడమే కాక, సిపిఎం నేత పుచ్చలపల్లి సుందరయ్యకు తన ఇంట్లోనే బస ఏర్పాటు చేసి, రాజకీయ పాఠశాలను జయప్రదంగా జరిగేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. చదవడం, చదివించడం నాగిరెడ్డి ప్రత్యేకతని, ఈ తరం వారు ఆయన నుంచి అది నేర్చుకోవాలన్నారు. ప్రజాశక్తి ఏజెన్సీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని, నిరంతరం ప్రజాశక్తి పేపరు చదివేవారని తెలిపారు. పార్టీ సాహిత్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గణనీయమైన కృషి చేశారని వివరించారు. ఆయన ఆశయాలకు కట్టుబడి పని చేస్తామన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ తరపున ఘన నివాళులర్పించారు. డి.రమాదేవి మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో నాగిరెడ్డి జన్మించినప్పటికీ పేదల కోసం కడవరకూ కృషి చేశారని తెలిపారు. 1978లో దుగ్గిరాల నియోజకవర్గం నుండి శాసనసభ్యులుగా పోటీ చేసి కేవలం 800 ఓట్లతో తేడాతో ఓడిపోయారన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, కె.ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై నేతాజీ, ఎన్ భావన్నారాయణ, నాయకులు ములకా శివసాంబిరెడ్డి, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపి మోదుగుల వేణుగోపాలరెడ్డి తదితరులు ఉన్నారు. నాగిరెడ్డి అంత్యక్రియలు కొల్లిపరలో శుక్రవారం జరిగాయి.

పెరిగిన బంధన్ బ్యాంక్ లాభాలు

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో ప్రయివేటు రంగంలోని బంధన్ బ్యాంక్ నికర లాభాలు 47 శాతం పెరిగి రూ.1,063 కోట్లకు చేరాయి. మొండి బాకీలు తగ్గడంతో మెరుగైన ఫలితాలు నమోదు చేసినట్లు ఆ బ్యాంక్ తెలిపింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.721 కోట్ల లాభాలు ప్రకటించింది. ఇదే సమయంలో రూ.4,908 కోట్లుగా ఉన్న మొత్తం ఆదాయం.. క్రితం క్యూ1లో రూ.6,063 కోట్లకు చేరిందని తెలిపింది. 2024 జూన్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 4.23 శాతానికి పరిమితమయ్యాయి. గతేడాది ఇదే కాలం నాటికి 6.76 శాతంగా జిఎన్‌పిఎ చోటు చేసుకుంది. నికర నిరర్థక ఆస్తులు 2.18 శాతం నుంచి 1.15 శాతానికి పరిమితమయ్యాయి.



బాధితులకు సరుకులు అందిస్తున్న సిపిఎం నేతలు

ముంపు బాధితులకు సిపిఎం చేయూత

ప్రజాశక్తి - వేలేరుపాడు, జంగారెడ్డిగూడెం (ఏలూరు జిల్లా)

పెదవాగు ప్రాజెక్టుకు గండి పడటంతో సర్వం కోల్పోయిన బాధితులకు సిపిఎం అండగా నిలిచింది. ఏలూరు జిల్లా వేలేరుపాడులోని వరద బాధితులకు నిత్యావసర వస్తువులు, సామగ్రి, కూరగాయలు శుక్రవారం పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగు ప్రాజెక్టు తెగిపోయి పలు గ్రామాలు నీట మునిగాయని తెలిపారు. దీంతో బాధిత ప్రజలకు సిపిఎం తన వంతు సాయంగా నిత్యావసర సరుకులు, కూరగాయలు, బిస్కెట్లు, ఆయిల్ ప్యాకెట్లు, ఉల్లిపాయలు, బట్టలు, పచ్చళ్లు సేకరించి మేడేపల్లి, అల్లూరునగర్, రామవరం, వసంతవాడ, మద్దిగట్ల గ్రామాల్లో పంపిణీ చేసినట్లు చెప్పారు. జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, పోలవరం, కొయ్యలగూడెం మండల కమిటీల ఆధ్వర్యంలో సుమారు రూ.50 వేలు విలువైన సరుకులు పంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు, పోలవరం మండల కార్యదర్శి జి.వెంకట్రావు, నేతలు ఎస్.సాయికృష్ణ, మడివి చలపతి, పసల సూర్యారావు, ఆనందరావు, పిల్లి చంటి, సీతారామయ్య, బుల్లెమ్మ పాల్గొన్నారు. దీనికి ముందు సరుకుల లోడుతో బయలుదేరిన ఆటోను జంగారెడ్డిగూడెంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం జెండా ఊపి ప్రారంభించారు.

వేతన చట్టాల అమలుకు పోరాటాలు ఉధృతం

సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు



మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

షెడ్యూల్ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతన చట్టం సవరించి అమలు చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని ప్యాడీ అండ్ రైస్ మర్చంట్స్ హాల్‌లో రైస్ మిల్లు కార్మికుల రాష్ట్ర విస్తృత సమావేశం శుక్రవారం జరిగింది. రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నర్సింగరావు మాట్లాడుతూ.. వ్యవసాయ రంగ ఆధార పరిశ్రమ అయిన రైస్‌మిల్లుల్లో పని చేస్తున్న కార్మికులు.. యజమానులు, పాలకుల విధానాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం, పిఎఫ్, ఇఎస్ఐ, గ్రాట్యూటీ వంటి చట్టాలను అమలు కావడం లేదన్నారు. కార్మిక చట్టాల అమలుపై అధికారులు పరిశ్రమలను తనిఖీ చేయాలని, చట్టాలు అమలు చేయని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరసనలు, ధర్నాలు చేయబోతున్నట్లు ప్రకటించారు.

ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల ఉపాధి కాపాడే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన కార్మికులంతా ఎపి రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీ నూతన కన్వీనర్‌గా బి.వాసుదేవరావు, సభ్యులుగా సిహెచ్.ఈశ్వరరావు, ఎం.సుందరబాబు, ఎం.ధనరాజ్, బి.శ్రీను, గుబ్బల సత్యనారాయణ, వి.రత్తయ్య, ఎం.ఎర్రమాల, ఎం.చంద్రయ్య ఎన్నికయ్యారు. సమావేశంలో హనుమంతు కోటేశ్వరరావు, కె.తవిటినాయుడు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి ఐడిబిఐ బ్యాంక్ సిద్ధం

- తుది దశలో ప్రక్రియ
- హిందుస్థాన్ జింక్‌లోనూ డిజిన్వెస్ట్‌మెంట్
- వైజాగ్ స్టీల్‌పై వేచి చూడాలి
- దీపమ్ సెక్రటరీ వెల్లడి



న్యూఢిల్లీ : ఐడిబిఐ బ్యాంక్ ప్రయివేటీకరణ తుది దశలో ఉందని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ అసెట్ మేనేజ్‌మెంట్ (దీపమ్) సెక్రటరీ తూహిన్ కాంత పాండే తెలిపారు. దీనిపై అతి త్వరలోనే ప్రభుత్వం తదుపరి అడుగు వేయనుందన్నారు. ఏ సమయంలోనైనా ప్రయివేటీకరణ నిర్ణయం జరగవచ్చున్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా సరైన బిడ్డర్లను ఎంపిక చేసే పనిలో ఉందన్నారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి), కేంద్రం సంయుక్తంగా ఐడిబిఐ బ్యాంక్‌లోని 61 శాతం వాటాలను ఉపసంహరించుకోనున్నాయన్నారు. ఇందులో ఎల్ఐసి 30.24 శాతం, కేంద్రం 30.48 శాతం చొప్పున వాటాలను విక్రయించనున్నాయి. ఐడిబిఐ బ్యాంక్‌లో కేంద్రానికి, ఎల్ఐసికి కలిపి మొత్తం 94.72 శాతం వాటా ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు మార్చి నాటికి ప్రయివేటీకరణ ప్రక్రియ పూర్తి కానుందని ఆ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2023 జనవరిలోనే బ్యాంక్ ప్రయివేటీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల వేళ తమకు నష్టం జరగవచ్చనే అంచనాల్లో మోడీ సర్కార్ తాత్కాలికంగా ప్రయివేటీకరణను వాయిదా వేసింది. తాజాగా దీన్ని వేగవంతం చేయడం గమనార్హం.

పిఎస్‌యుల్లో వాటాలను ప్రయివేటు శక్తులకు విక్రయించడం ద్వారా రూ.50,000 కోట్లు సమీకరించాలని 2024-25 బడ్జెట్‌లో బిజెపి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ ప్రణాళికలో భాగంగానే ఐడిబిఐ బ్యాంక్‌ను అమ్మకానికి పెడుతోంది. ఐడిబిఐ బ్యాంక్‌ను చేజిక్కించు కొనేందుకు వీలున్న మదుపరులకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి కావాల్సిన భద్రతాపరమైన అనుమతులు ఇటీవలే లభించాయి. ఆర్‌బిఐ నుంచి కూడా త్వరలోనే అనుమతులు వస్తాయని ఓ అధికారి తెలిపారు.

హిందుస్థాన్ జింక్‌లోని వాటాలను కూడా విక్రయించాలని ప్రభుత్వం యోచిస్తోందని పాండే తెలిపారు. అయితే ఇది పలు చిన్న విడతల్లో జరుగుతుందన్నారు. "హిందుస్థాన్ జింక్‌లో ప్రభుత్వ మైనారిటీ వాటాలను విడతల వారీగా విక్రయించేందుకు ప్రయత్ని స్తున్నాం. మేము మా పెట్టుబడి బ్యాంకర్ల ద్వారా మార్కెట్ ప్లేయర్‌లతో పరస్పర చర్చలు చేస్తున్నాము. ఇందుకోసం మరికొన్ని రోడ్‌షోలు చేపట్టవచ్చు. దీనిపై మరింత స్పష్టత వచ్చిన వెంటనే మేము ముందుకు వెళ్తాము."అని పాండే తెలిపారు. హిందూస్థాన్ జింక్‌లో కేంద్రానికి ఇప్పటికీ 29.54 శాతం వాటా ఉంది. వేదాంత కంపెనీ 64.92 శాతం ఈక్విటీని కలిగి ఉంది. డిజిన్వెస్ట్‌మెంట్‌పై ప్రభుత్వ వ్యూహంలో ఎటువంటి మార్పు లేదని, మధ్యంతర బడ్జెట్‌లో వివరించిన విధంగానే కొనసాగుతుందని పాండే స్పష్టం చేశారు. పిఎస్‌యుల వాటాల విక్రయాలకు సంబంధించి సమయాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తుందన్నారు.

వైజాగ్ స్టీల్‌కు సంబంధించిన రాష్ట్రీయా ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్)లో డిజిన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించి 2021లోనే కేబినెట్ ఆమోదం తెలిపిందని పాండే తెలిపారు. అయితే దీనిపై ఏ విధంగా ముందుకు సాగాలనే దానిపై వేచి చూడాలన్నారు. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణను ముందుకు తీసుకెళ్లడానికి ముందు పరిపాలనా మంత్రిత్వ శాఖ అనేక విధాన పరమైన సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో 63.75 శాతం వాటాలను విక్రయించాలని కేంద్రం యోచిస్తోంది.

మార్కెట్లకు భారీ ఉపశమనం

- సెన్సెక్స్ 1292 పాయింట్ల ర్యాలీ

ముంబయి : వరుసగా ఐదు సెషన్లలో నష్టాలు చవి చూసిన దేశీయ స్టాక్ మార్కెట్లకు వారాంతంలో భారీ ఉపశమనం లభించింది. క్యాపిటల్ గెయిన్ ట్యాక్స్ పెంపునతో విదేశీ ఇన్వెస్టర్లు నిధులు ఉపసంహరించగా, ఇతర ఇన్వెస్టర్లు ఆదే బాటలో ఇటీవల పెద్ద మొత్తంలో షేర్లను విక్రయించారు. దీంతో షేర్ల ధరలు దిగిరావడంతో తక్కువ ధరల వల్ల మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 1292 పాయింట్లు (1.62 శాతం) పెరిగి 81,332 పాయింట్లకు చేరింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 428 పాయింట్లు (1.76శాతం) పెరిగి 24,834 వద్ద ముగిసింది. బిఎస్ఇ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.7.16 లక్షల కోట్లు పెరిగి రూ.456.98 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్-30లో భారతీ ఎయిర్ టెల్, అదానీ పోర్ట్స్, సన్ ఫార్మా, టాటా స్టీల్, ఇన్ఫోసిస్ తదితర స్టాక్స్ అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి.

బ్లేడ్‌లెస్ సాంకేతికతతో సామ్‌సంగ్ కొత్త ఎసిలు

న్యూఢిల్లీ : ప్రముఖ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్ కొత్తగా చిల్డ్ వాటర్ ఇండోర్ కేటగిరీలో కొత్త విండ్ ఫ్రీ ఎయిర్ కండిషనర్‌లను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఈ కొత్త శ్రేణీలో విండ్-ఫ్రీ, 360 డిగ్రీల బ్లేడ్‌లెస్ టెక్నాలజీని వినియోగించినట్లు తెలిపింది. ఇది వినియోగదారులకు నేరుగా వచ్చే శీతల ప్రవాహాల అసౌకర్యం లేకుండా అత్యుత్తమ కూలింగ్ అనుభవాన్ని అందించడానికి రూపొందించబడిందని తెలిపింది. వీటి ప్రారంభ ధరను రూ. 35,000గా నిర్ణయించినట్లు వెల్లడించింది.

ఓపెన్ ఎఐ నుంచి కొత్త సెర్చింజిన్

న్యూయార్క్ : గూగుల్‌కు పోటీగా ఓపెన్‌ఎఐ సెర్చింజిన్‌ను తెస్తోంది. చాట్‌జిపిటితో రాణిస్తున్న ఓపెన్‌ఎఐ తాజాగా 'సెర్చ్‌జిపిటి' పేరుతో నూతన విభాగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. ఇంటర్నెట్‌లోని రియల్‌టైమ్ డేటాను ఈ ఎఐ ఆధారిత సెర్చింజిన్ యూజర్లకు అందించనున్నట్లు వెల్లడించింది. ఇది ప్రస్తుతానికి ప్రోటోటైప్ స్టేజ్‌లో ఉందని, పరిమిత గ్రూప్, పబ్లిషర్లతో పరీక్షిస్తున్నామని ఓపెన్‌ఎఐ తెలిపింది. ప్రస్తుతం సెర్చింజిన్ మార్కెట్‌లో గూగుల్ 91 శాతం వాటాను కలిగి ఉంది.

సంపాదకీయం

గొప్ప ముందడుగు!

మైనింగ్, ఖనిజ కార్యకలాపాలపై రాయల్టీ విధించే హక్కు రాష్ట్రాలకున్నదని సుప్రీంకోర్టు విస్తృత ధర్మాసనం గురువారం వెలువరించిన తీర్పు చారిత్రాత్మకమైనది. ప్రధాన న్యాయమూర్తి వైవి చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిదిమంది సభ్యుల విస్తృత ధర్మాసనం 8-1 మెజార్టీతో ఇచ్చిన తీర్పుతో పదమూడేళ్లుగా పెండింగ్‌లోనున్న ఈ అతి పురాతనమైన కేసు పరిష్కృతం కావడం మరో రికార్డు. రాయల్టీ అనేది పన్ను వంటిది కాదని, రాయల్టీని విధించే అధికారం రాష్ట్రాలకు ఉన్నదని ధర్మాసనం స్పష్టం చేయడం ఫెడరలిజానికి బలం చేకూర్చే అంశం. ఖనిజ సంపద అధికంగా ఉన్న ఒడిషా, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు సుప్రీం తీర్పు గొప్ప విజయంగా చెప్పవచ్చు. ప్రభుత్వానికి చేసే చెల్లింపులన్నింటినీ కేవలం పన్నులుగా పరిగణించకూడదని ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. ఖనిజాలు, గనులతో కూడిన భూమికి పన్ను విధించడానికి రాష్ట్రాల శాసనసభలకే అధికారం ఉంటుంది తప్ప పార్లమెంటుకు ఆ హక్కు ఉండదు. ఈ వ్యవహారంలో తలదూర్చే అధికారం కేంద్రానికి లేదు' అని మెజారిటీ న్యాయమూర్తులు ఇచ్చిన రూలింగ్ నిర్ణయాత్మకమైనది. రాష్ట్రాల హక్కులను ఒక్కొక్కటిగా గుంజుకుంటూ కేంద్ర ప్రభుత్వం వాటిని మున్సిపాలిటీలకన్నా అధ్వానంగా మార్చివేయ జూస్తున్న ప్రస్తుత తరుణంలో సర్వోన్నత న్యాయస్థానం తీర్పు గొప్ప ముందడుగు.

విచారణ సందర్భంగా కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ వాదనలు వినిపిస్తూ ఖనిజాలు ఉన్న భూములపై రాష్ట్రాలు పన్నులు విధించలేవని, ఆ హక్కు కేంద్రానికే ఉంటుందని వాదించడమేగాక రాష్ట్రాలు ఎవరికి వారు వేర్వేరుగా లెవీ విధిస్తే ప్రతికూల ప్రభావం పడుతుందన్న వితండ వాదనను ధర్మాసనం నిర్ద్వంద్వంగా తిరస్కరించడం ముదావహం. భారత్‌లో ఖనిజాలు, గనులవంటి నిక్షేపాలుగల రాష్ట్రాలు ఆదాయపరంగా బీదవిగా వున్నాయి. పైన పేర్కొన్న రాష్ట్రాలు అటువంటివే. ఆ ఖనిజాల వెలికితీతవల్ల తీవ్రమైన కాలుష్యం బారిన కూడా పడేది ఆయా రాష్ట్రాల ప్రజలే! అందునా అత్యధికులు ఆదివాసీలు కావడం గమనార్హం. సుప్రీం కోర్టు తాజా తీర్పు ఆయా రాష్ట్రాల ఖజానాకు రాయల్టీ ఆదాయాన్ని సమకూర్చడంవల్ల ఆర్థిక పరిస్థితి తప్పక మెరుగుపడుతుంది. తద్వారా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కూడా తోడ్పడుతుంది. సముద్ర తీర రాష్ట్రాలు సహజ వనరులవల్ల కొంత ప్రయోజనం పొందుతుండగా వెనుకబడిన కొండ ప్రాంత రాష్ట్రాలు కూడా టూరిజం వంటి రంగాల ద్వారా ఆదాయాలు పొందుతున్నాయి. ఖనిజ రాయల్టీ ద్వారా ఈ రాష్ట్రాలు కూడా ప్రయోజనం పొందవచ్చు.

నరేంద్ర మోడీ అధికారానికి వచ్చాక 'సహకార ఫెడరలిజ'ం అని మాటల్లో చెబుతూ ఆచరణలో రాష్ట్రాల హక్కులను ఒక్కొక్కటిగా లాగేయడం మనందరికీ తెలిసిందే. ఆయా శాసనసభలు ఆమోదించిన పలు బిల్లులకు గవర్నర్లు మోకాలడ్డడం, వాటిని క్లియర్ చేయాలని కోరుతూ కేరళ, పంజాబ్, తమిళనాడు తదితర రాష్ట్రాలు సుప్రీం కోర్టు గడపతొక్కిన పరిస్థితి కూడా తాజా చరిత్ర. అంతేగాక రాష్ట్రాలకు కేటాయించాల్సిన పన్నుల వాటా విడుదల కోసం హస్తినాపురిలో ముఖ్యమంత్రులు ధర్నా చేయాల్సిన దుస్థితి దాపురించింది. ఇలాంటి నేపథ్యంలో ఫెడరలిజానికి బలం చేకూర్చే రాజ్యాంగ విస్తృత ధర్మాసనం తీర్పు ఎంతో ఊరటనిస్తుంది. భారత రాజ్యాంగపు మౌలిక లక్షణాలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సార్వభౌమాధికారం, సామాజిక న్యాయం, ఫెడరలిజాలకు ప్రస్తుత కార్పొరేట్-మతతత్వ కూటమి తీవ్ర హాని కలిగిస్తున్నది. దాన్ని ఎదుర్కోవాలని భారత ప్రజలు తాజా ఎన్నికల్లో సంకేతమిచ్చారు. ఆ పోరాటం మరింతగా బలోపేతం కావాల్సి ఉంది. ఫెడరలిజాన్ని బలోపేతంచేసే ఇలాంటి తీర్పులు ప్రజాఉద్యమం పటిష్టం కావడానికి తప్పక దోహదపడతాయి. భారత రాజ్యాంగం మౌలిక స్వభావం మరింత పరిపుష్టం అవుతుందని ఆకాంక్షిద్దాం.

మంచి మాట



ఆర్థిక శక్తుల ఒత్తిడి, పెట్టుబడిదారుల లాభాపేక్ష, మార్కెట్ పోటీ పెట్టుబడిదారీ వ్యవస్థను ముందుకు నడిపిస్తాయి. అదే సమయంలో ఆ వ్యవస్థ చేసే దారుణాలకు వ్యతిరేకంగా మానవత్వం తిరుగుబాటు చేస్తుంది. ఈ రెండు అంశాల వల్ల సమాజంలో ఏర్పడిన వైరుధ్యం ప్రస్తుత పరిస్థితుల పట్ల ఏహ్యభావాన్ని పెంచుతుంది. అదే సోషలిజానికి మార్గం సుగమం చేస్తుంది.

- జేమ్స్ కొనొల్లీ,
ఐరిష్ సోషలిస్టు రిపబ్లికన్ పార్టీ స్థాపకుడు.

వ్యాఖ్య

ఉద్యోగ స్కీములు మోసం-కార్పొరేట్లకే లాభం

భారత ఆర్థిక వ్యవస్థ చాలా క్లిష్టమైన చౌరస్తాలో వుంది. స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) పెరుగుదల రేటు ఏ విధంగానూ ఉద్యోగ కల్పనా సామర్థ్యాన్ని పెంచలేకపోతున్నది. కల్పించబడిన ఉద్యోగాలలో కూడా 57.3 శాతం స్వయం ఉపాధి రంగానివే. 18.3 శాతం ఏ ప్రతిఫలం లేని ఇంటి పనివారివైతే 45 శాతం పైగా వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు. ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకం (పిఎల్ఐ) పేరిట 2020 మార్చిలో ప్రవేశ పెట్టిన పథకం ఉత్పత్తి రంగంలో ఉపాధి కల్పించడంలో ఘోరంగా విఫలమైంది. ఏడాదికేడాది భారతీయ వస్తూత్పత్తి రంగంలో కొట్టొచ్చినట్టుగా తగ్గిపోతున్న ఉత్పాదకత 2022-23 నాటికి 2.38 శాతానికి చేరింది. అయితే మోడీ ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహకాలు, ఇంకా అనేక రకాలైన నిలువు దోపిడీ వరప్రసాదాలు కలగలసి దేశంలోని లిస్టెడ్ కంపెనీలు 2023-24లో అపారంగా 10.1 శాతం నికర లాభాలు పోగుపోసుకున్నాయి. ఇది 2007-08 తర్వాత కాలంలోనే అత్యధికం. ఇప్పటికొస్తే భారత ఆర్థిక వ్యవస్థ సగటున ఏటా 78.5 లక్షల ఉద్యోగాలు కల్పించవలసిన అత్యావశ్యక పరిస్థితిలో వుందని ఆర్థిక సర్వే పేర్కొన్నది. పెరిగే శ్రామిక సంఖ్య ఉద్యోగావసరాలను అందుకోవాలంటే అది తప్పనిసరి.

ఉద్యోగ రంగంలో నెలకొన్న తీవ్ర సంక్షోభం లోక్‌సభ ఎన్నికలలో ఒక వేడివేడి అంశంగా ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో మోడీ మూడవ ప్రభుత్వ తొలి బడ్జెట్ ఉపాధి కల్పనకూ నూతన ఉద్యోగావకాశాలు సృష్టించడానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని ఎవరైనా భావిస్తారు. కానీ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించిన బడ్జెట్ సంప్రదాయ ఉద్యోగ రంగంలో ఉద్యోగాల కల్పన పేర డొల్లతనపు మోసపూరిత చర్యలకు పాల్పడటమే చూశాం. అదే సమయంలో ఆ పేరిట కార్పొరేట్లకు ప్రభుత్వ నిధులను ఉదారంగా గుమ్మరించడమూ కనిపించింది.

మూడు స్కీముల గుట్టు

ఆర్థిక మంత్రి ఉద్యోగ కల్పన అనుసంధానిత ప్రోత్సాహకాలు (ఇఎల్ఐ) పేరిట ప్రకటించిన పథకాల పరంపర కార్పొరేట్ పండితులను విశేషంగా ఉత్సాహపర్చింది. ఇందులో మొదటిదైన ఎ స్కీము ఉద్యోగులందరికీ వర్తించేదిగా వుంటే బి, సి లు మాత్రం నిర్దిష్టమైన తరగతులకు వర్తించుతాయి. ఎ స్కీము ప్రకారం ఎవరైనా ఒక యజమాని కొత్తగా ఒక కార్మికుడిని చేర్చుకుంటే లేదా అంతకు ముందు తమ జాబితాలో లేని ఒక కార్మికుడిని ఇఎఫ్‌పిఓ (ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్)లో చేరిస్తే ఆ కార్మికునికి వచ్చే ఒక నెల జీతాన్ని రూ. 15,000 మేరకు ప్రభుత్వం మూడు కిస్తీల్లో చెల్లిస్తుంది. దీని అర్థమేమంటే యజమాని ఆ కార్మికుడికి చెల్లించే జీతంలో పన్నెండో వంతు నేరుగా ప్రభుత్వమే అందజేస్తుంది. ఉత్పత్తి రంగంలో యాభై మందికి తక్కువ కాకుండా ఇఎఫ్‌పిఓ యేతర కార్మికులను తీసుకునే యాజమాన్యాలకు బి స్కీము వర్తిస్తుంది. ఈ స్కీము కింద ప్రభుత్వం ఇఎఫ్‌పిఓకు అటు ఉద్యోగులు ఇటు యాజమాన్యం చెల్లించవలసిన వాటాను అంటే జీతంలో 24 శాతాన్ని ప్రజాధనం నుంచి నేరుగా చెల్లిస్తుంది. ఇక సి స్కీము ప్రకారమైతే ఏదైనా కంపెనీ గనక ఇద్దరు నుంచి ఐదుగురు ఉద్యోగులను తీసుకుంటే నెలకు రూ.3000 వరకూ ఇఎఫ్‌పిఓ లో యజమాని వాటా అందుకుంటుంది. చాలా స్పష్టంగా ప్రభుత్వం వేతనాల మొత్తంలో 32.33 శాతాన్ని ప్రజల ధనంతో చెల్లు వేస్తుందన్నమాట. ఈ పథకాలలో మరీ ప్రమాదకరమైన అంశమేమంటే ఆ కంపెనీలు ప్రతి ఏటా కొత్త ఉద్యోగులను తీసుకుంటేనే ఈ పథకం అమలువుతుంది. దీనివల్ల జరిగేదేమంటే మొదటి ఏడాది ఉద్యోగులను కేవలం నిర్ణీత కాలానికే తీసుకుని ఏడాది కాగానే పని నుంచి తొలగించేస్తాయి. ప్రభుత్వ సబ్సిడీ పొందడం కోసం రిట్రెంచిమెంటు మరింత తీవ్రం చేసేందుకు ఈ పథకాలు కారణమవుతాయి.



> 'సి' స్కీము ప్రకారమైతే ఏదైనా కంపెనీ గనక ఇద్దరు నుంచి ఐదుగురు ఉద్యోగులను తీసుకుంటే నెలకు రూ.3000 వరకూ ఇఎఫ్‌పిఓ లో యజమాని వాటా అందుకుంటుంది. చాలా స్పష్టంగా ప్రభుత్వం వేతనాల మొత్తంలో 32.33 శాతాన్ని ప్రజల ధనంతో చెల్లు వేస్తుందన్నమాట. ఈ పథకాలలో మరీ ప్రమాదకరమైన అంశమేమంటే ఆ కంపెనీలు ప్రతి ఏటా కొత్త ఉద్యోగులను తీసుకుంటేనే ఈ పథకం అమలువుతుంది. దీనివల్ల జరిగేదేమంటే మొదటి ఏడాది ఉద్యోగులను కేవలం నిర్ణీత కాలానికే తీసుకుని ఏడాది కాగానే పని నుంచి తొలగించేస్తాయి. ప్రభుత్వ సబ్సిడీ పొందడం కోసం రిట్రెంచిమెంటు మరింత తీవ్రం చేసేందుకు ఈ పథకాలు కారణమవుతాయి.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

నిరుద్యోగ సేనల పడిగాపులే

మరో పెద్ద దెబ్బ ఇంటర్న్‌షిప్ విధానం. ఈ పథకాన్ని ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే అగ్రశ్రేణి కంపెనీల కోసం రూపొందించింది. అత్యధిక లాభాలతో నడుస్తున్న ఈ 500 కంపెనీలు తమ మొత్తం ఉత్పత్తినీ సేవలనూ కేవలం ఇంటర్న్‌లు లేదా అంప్రెంటిస్‌లతో నడిపించుకోవడానికి వీలుగా ఈ పథకం తయారైంది. వీరికి నెలకు 5000 రూపాయల స్టైఫండ్ భారం, ఒక దఫా సహాయంగా రూ. ఆరు వేల చెల్లింపు అన్నీ ప్రభుత్వమే చేస్తుంది. మిగిలిన శిక్షణా వ్యయం కూడా సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధుల నుంచి తీసుకోవచ్చు. ఈ కార్పొరేట్ అనుకూల ప్రభుత్వం అపఖ్యాతికరమైన ఈ పథకం ద్వారా ఉద్యోగ సంబంధాలను మరింత దుర్బలపరిచే దిశలోకి నడిపిస్తుంది. అత్యాధునికమైన యంత్రాలు, సాంకేతికత పరిజ్ఞానంతో వేగంగా నేర్చుకునే సత్తా సంతరించుకున్న కొత్త ఇంటర్న్ బ్యాచీలు మొత్తం కీలక ఉత్పత్తి ప్రక్రియకు బాధ్యత వహించాల్సిన పరిస్థితి కల్పించబడుతుంది. ఈ ఉత్పత్తి క్రమంలో పాత బ్యాచీల స్థానంలో రావడం కోసం భారీ నిరుద్యోగ సైన్యాలు లేదా వృత్తి విద్యా సాంకేతిక శిక్షణ పొందిన వారు ఫ్యాక్టరీల గేట్ల దగ్గర పడిగాపులు పడి నిరీక్షించాల్సి వస్తుంది.

మరింత దిగజారుడుకే !

ఈ విధంగా ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు తరలించి ప్రైవేటు భోషాణాలు నింపడం వల్ల నిరుద్యోగ సమస్య ఇసుమంతైనా పరిష్కారం కాదు. లాభార్జనతో ముడిపడిన ఉత్పత్తిని పెంచడమంటే దాంట్లో ఎలాంటి చెల్లింపులేని శ్రామిక శక్తి వాటా పెంచడమే. ఇఎల్ఐ, ఇంటర్న్‌షిప్ స్కీములు తీసుకు రావడం ద్వారా కార్పొరేట్లకు ఉచిత శ్రామిక బలగాన్ని సమకూర్చి పెట్టేందుకు మోడీ సర్కారు బరితెగించి ప్రయత్నిస్తున్నది. కానీ మరో వైపున ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుండడం వల్ల మొత్తం గిరాకీ నిరంతరాయంగా పడిపోతున్నది. దాంతో నికర అమ్మకాలు తగ్గిపోతున్నాయి. ఉత్పత్తితో ముడిపడిన లాభాలూ వాస్తవరూపం దాల్చడం లేదు. అది ఉత్పత్తి సంబంధమైన ఆలోచనల నుంచి ప్రైవేటు పెట్టుబడులను దెబ్బతీస్తున్నది. కార్పొరేట్ ఆదాయం పెరుగుదల స్థిరంగా స్పెక్యులేషన్ మార్గంలోనే మళ్లించ బడుతున్నది. ప్రభుత్వం కార్పొరేట్లకు ఈ స్కీములతో సబ్సిడీలు ఇవ్వొచ్చునేమో గానీ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి, ప్రజల జీవన స్థితిగతులు మాత్రం మరింత దిగజారతాయి.

> ప్రభుత్వ ఖజానా నుంచి నిధులు తరలించి ప్రైవేటు భోషాణాలు నింపడం వల్ల నిరుద్యోగ సమస్య ఇసుమంతైనా పరిష్కారం కాదు. లాభార్జనతో ముడిపడిన ఉత్పత్తిని పెంచడమంటే దాంట్లో ఎలాంటి చెల్లింపులేని శ్రామిక శక్తి వాటా పెంచడమే. ఇఎల్ఐ, ఇంటర్న్‌షిప్ స్కీములు తీసుకు రావడం ద్వారా కార్పొరేట్లకు ఉచిత శ్రామిక బలగాన్ని సమకూర్చి పెట్టేందుకు మోడీ సర్కారు బరితెగించి ప్రయత్నిస్తున్నది. కానీ మరోవైపున ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తుండడం వల్ల మొత్తం గిరాకీ నిరంతరాయంగా పడిపోతున్నది. దాంతో నికర అమ్మకాలు తగ్గిపోతున్నాయి. ఉత్పత్తితో ముడిపడిన లాభాలూ వాస్తవరూపం దాల్చడం లేదు.

(జులై 24 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

విశ్లేషణ

అమెరికాతో ఆయుధ ఒప్పంద విషాదం

రఘు

అమెరికా భారత్‌ల మధ్య ఇటీవల జరిగిన ఒక రక్షణ ఒప్పందం భారతదేశ స్వావలంబన శక్తిని దెబ్బ కొడుతున్నది. 'స్ట్రైకర్ వీల్డ్ ఇన్ఫాంట్రీ కంబాట్ వెహికల్' (ఐసివి-ఎనిమిది చక్రాల సాయుధ వాహనం. యుద్ధ రంగానికి పదాతి దళాన్ని, మందుగుండు సామగ్రిని తరలించడానికి వాడతారు) అనే అమెరికన్ ఆయుధ శకటాలను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేయడానికి ఉద్దేశించిన ఒప్పందం ఇది. భారత సైన్యంలో కొన్ని పాత ఆయుధ శకటాలు ఉన్నాయి. అవి రష్యావి. వాటి స్థానంలో, దేశీయంగానే కొత్తవి అభివృద్ధి చేయడానికి, ఉత్పత్తి చేయటానికి మన రక్షణ మంత్రిత్వ శాఖ, డిఆర్‌డిఓ లు జయప్రదంగా కృషి చేస్తున్నాయి. కానీ ఇటీవల జరిగిన భారత్ అమెరికా ఒప్పందం వల్ల వీటి దేశీయ ఉత్పత్తి అగమ్యగోచరంగా మారింది. నిజానికి, అమెరికా భారత్‌ల మధ్య ఉండే ఉన్నత సాంకేతిక ఒప్పందాల ప్రకారం కొత్త ఆయుధాల ఉత్పత్తిని రెండు దేశాలూ కలిసి చేయాలి. పరిశోధనలూ కలిసి చేయాలి. ఇదంతా పక్కకు పోయి, అమెరికా మిలిటరీ హార్ట్‌వేర్‌ను భారత్ కొనడంగా లేదా ఇండియాలో ఉత్పత్తి చేసి ఇండియాకే అమ్మడంగా ఇది తయారైంది. ఈ ఒప్పందాల కారణంగా అమెరికా హార్డ్‌వేర్ వాణిజ్యం బలపడి 22 బిలియన్ డాలర్లకు చేరింది. ఉన్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇండియాకు మార్పిడి చేస్తున్నట్టుగా, మాటవరసకు చెప్పుకుంటూ, పాత ఒప్పందాలను బేఖాతరు చేస్తూ, అమెరికా తన దగ్గర ఉన్న ఆయుధాలను అమ్ముకొంటున్నది. భారతదేశం ఇంతకు ముందు కూడా అమెరికా దగ్గర ఆయుధాలు కొనేది. కానీ ఆధునికీకరణకు అవసరమైనంత మేరకే అది ఉండేది. ఆ విధంగా అపాచీ ఎటాక్ హెలికాప్టర్లు, చినోక్ హెవీ లిఫ్ట్ హెలికాప్టర్లు, సముద్రాలలో వాడే పి8 యాంటీ సబ్‌మెరైన్ ఎయిర్ క్రాఫ్ట్‌లు లాంటివి చాలా తక్కువ సంఖ్యలో కొనుగోలు చేసేవారు. కానీ ఇప్పుడు పెద్ద సంఖ్యలో చేస్తున్న కొనుగోళ్ల వల్ల, వీటిని ఇక్కడే అసెంబుల్ చేయటం లేదా ఉత్పత్తి చేయడం జరుగుతోంది. దీంతో దేశీయ సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి, ఉత్పత్తి చేసే ప్రక్రియలకు తలుపులు మూసుకున్నాయి.

హైటెక్ ఒప్పందాలు...

ఢిల్లీలో 2023 ఫిబ్రవరిలో జరిగిన ఇరు దేశాల జాతీయ భద్రతా సలహాదారుల సమావేశంలో స్ట్రైకర్ అమ్మకం ప్రస్తావనకు వచ్చింది. అంతకు ముందు సంవత్సరమే, భారత్ అమెరికాల 'క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇనీషియేటివ్' ప్రకటన ద్వారా ఇందుకు రంగం సిద్ధమైంది. 2023 నవంబర్లో జరిగిన ఇరు దేశాల రక్షణ విదేశాంగ మంత్రుల సమావేశం తర్వాత ఇచ్చిన ప్రకటనలో కూడా ఇది పొడసూపింది. అలాగే ఇరు దేశాల పారిశ్రామిక వర్గాలతో అమెరికా రక్షణ సలహాదారు ఆధ్వర్యంలో జరిపిన చర్చల తరువాత ఇటువంటి ప్రకటనే వెలువడింది. ఇదే పద్ధతులలో అనేక ఇతర ఒప్పందాలు కూడా జరిగాయి. ఉదాహరణకు, దేశీయ తేజ ఫైటర్ విమానం కోసం వాడిన ఎలక్ట్రిక్ జి ఈ 414 ఇంజిన్లు కానీ, త్వరలో రాబోయే, ఆయుధ సహిత ఆర్ క్యూ9 రిపర్లు, గార్డియన్ డ్రోన్లు లాంటి మిలటరీ కొనుగోళ్ళు కూడా ఇదే విధంగా జరిగాయి. ఈ అమ్మకాలు కొనుగోళ్ల వేడి చల్లారకుండా, ఈ 'బిగ్ టికెట్ డీల్స్' పదే పదే పతాక శీర్షికలకు ఎక్కుతూ వచ్చాయి. అమెరికా అవలంబించిన ఎత్తుగడల వల్ల ఈ ఒప్పందాల లోతుపాతుల్లోకి వెళ్లి, వివరాలను ఆలోచించుకునే సమయం, ఇతర అవకాశాలను బేరీజు వేసుకునే పరిస్థితి కూడా భారత్‌కు లేకుండా పోయింది. అమెరికా మీద ఆధారపడటం కొనసాగుతూ ఉండటంతో, డబ్బు లావాదేవీలు, సాంకేతిక బదిలీ అమెరికా తనకు బాగా అనుకూలంగా ఉండేట్టు మార్చుకోగలిగింది.



> అమెరికా భారత్‌ల మధ్య ఉండే ఉన్నత సాంకేతిక ఒప్పందాల ప్రకారం కొత్త ఆయుధాల ఉత్పత్తిని రెండు దేశాలూ కలిసి చేయాలి. పరిశోధనలూ కలిసి చేయాలి. ఇదంతా పక్కకు పోయి, అమెరికా మిలిటరీ హార్ట్‌వేర్‌ను భారత్ కొనడంగా లేదా ఇండియాలో ఉత్పత్తి చేసి ఇండియాకే అమ్మడంగా తయారైంది. ఈ ఒప్పందాల కారణంగా అమెరికా హార్డ్ వేర్ ట్రేడ్ బలపడి 22 బిలియన్ డాలర్లకు చేరింది. ఉన్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇండియాకు మార్పిడి చేస్తున్నట్టుగా, మాట వరసకు చెప్పుకుంటూ, పాత ఒప్పందాలను బేఖాతరు చేస్తూ, అమెరికా తన దగ్గర ఉన్న ఆయుధాలను అమ్ముకొంటున్నది.

స్ట్రైకర్ ఐసివి

స్ట్రైకర్ ఐసివి కి ప్రపంచంలో ఆయుధ శకటంగా గట్టి పేరే ఉన్నా, ఇది మరీ నవీనమైనదేమీ కాదు, సాంకేతికంగా ఉన్నతమైనదీ కాదు. ఇది అమెరికా, కెనడా స్పెయిన్, యూరోప్‌లో ఉండే అనేక ఆయుధ శకటాల కలయిక. వాటి కంటే కొంచెం మెరుగు. ఎనిమిది చక్రాలు ఉండి, ఇద్దరు ఆపరేటర్లతో సహా తొమ్మిది మంది సైనికులకు ఇందులో చోటు ఉంటుంది. 2001లో అమెరికన్ సైన్యంలో దీన్ని ప్రవేశ పెట్టారు. కానీ 2014లో దీని ఉత్పత్తిని ఆపి వేశారు. 4500 దాకా ఉన్న ఈ స్ట్రైకర్లను అమెరికన్ మిలిటరీ ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, సిరియా, ఉక్రెయిన్లలో వాడింది. సాఫీగా ఉండే పట్టణ ప్రాంతాలలో జరిగే యుద్ధాలకు ఇవి సరిపోతాయని, దుర్గమ ప్రాంతాలను తట్టుకోలేవని అంటారు. ఉక్రెయిన్ లో ఇవి భారీనష్టాలను, విమర్శలను చవిచూశాయి.

ఇది 25 టన్నుల బరువుండే చక్రాల వాహనం. అయితే రష్యన్ వాహనం లాగా ఎగుడు దిగుళ్లను తట్టుకోలేదు. ఇది నేల మీద, నీటి మీద నడవగలిగే ఉభయచరం కాదు. లడాక్, సిక్కిం లాంటి ఎత్తైన ప్రదేశాల్లో ఉండే పలుచటి వాతావరణాన్ని, తట్టుకోవాలంటే వీటి ఇంజన్లలో మార్పు చేయాల్సి ఉంటుంది. అధిక అశ్విక శక్తి ఉండే అడ్వాన్స్ యంత్రాలు అవసరమవుతాయి.

సాధారణంగా ఉండే 350 అశ్విక శక్తి ఇంజను కాకుండా, 750 అశ్విక శక్తి ఉండే ఇంజన్‌కు మార్చాల్సి ఉంటుంది. అమెరికన్ ఇండియా సంయుక్త మిలటరీ విన్యాసాలు కొద్ది కాలం ముందు జరిగినప్పుడు, చినోక్ హెలికాప్టర్ల సహాయంతో, స్ట్రైకర్లను రవాణా చేశారు. అయితే ఇటువంటి విన్యాసాలకు అమెరికన్ సైన్యంలో మాత్రం అనుమతి లేదనే విషయం గమనించాలి. ఇటువంటి చాలా అంశాలను పరిగణన లోకి తీసుకోకుండా వివిధ రకాల 530 స్ట్రైకర్లను మన దేశం కొనుగోలు చేస్తున్నది. తొలి విడతలో 40 దాకా స్ట్రైకర్లను వెనువెంటనే తెచ్చుకుంటున్నారు. ఇక్కడి విభిన్న పరిస్థితులకు తట్టుకునేట్టుగా, అంతర్గత మార్పులు చేర్పులతో, మిగిలిన స్ట్రైకర్లను ఇక్కడే ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. దీనికి ఎంత ఖర్చవుతుంది? ఈ ఉత్పత్తిలో దేశీయంగా ఎక్కువ భాగస్వామ్యం ఎవరిది వుంటుంది? అనేది ఇంకా తెలియదు.

స్వావలంబనకు ముప్పు

మన దేశంలోనే, ఆయుధ శకటాల సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేసుకొని ఉత్పత్తి చేసే ప్రక్రియ. అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ కూడా, ముందుకు పోతున్నది. ఈ దశలో స్ట్రైకర్ డీల్ జరగడం, రిటైర్డ్ సైనిక అధికారులను, పరిశీలకులను విస్మయానికి గురి చేస్తున్నది.

స్వావలంబనకు ఇది ఒక పెద్ద విఘాతంగా వారు భావిస్తున్నారు. కాని యుద్ధ అవసరాలకు దీటుగా ఆయుధాలు కొనుగోలు చేయాల్సిన ఆవశ్యకత ఉందనే వాదన ఒకటి ఉంది. దాన్ని ఒప్పుకుంటే స్వావలంబన ఎప్పటికీ సాధ్యం కాదని, స్వావలంబన ప్రయత్నాలకు ఏదో ఒక అడ్డంకి ఎప్పుడూ ఉంటూనే ఉంటుందనీ గమనించాలి. అమెరికా హార్డ్‌వేర్ పట్ల మొగ్గు చూపే వాళ్ళు అధికార వర్గాల్లో కూడా ఎప్పుడూ ఉంటారు. ఒకవైపు తమ ఆయుధాలకు ఆర్డర్లు సంపాదించడం, మరొకవైపు తానే మన దేశంలో ఉత్పత్తికి దిగడం ద్వారా డిఫెన్స్ మార్కెట్‌ను అమెరికా కబళిస్తున్నది. దీనివల్ల దేశీయంగా ఉత్పత్తి జరగాలనే ప్రయత్నాలకు, ప్రేరణలకు, స్థానం లేకుండా పోతున్నది.

ఒక దశాబ్దంగా మన రక్షణ శాఖ, పరిశోధనా సంస్థలు చేస్తున్న కృషిపై ఇదంతా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఆనాడు, దేశం లోపలే ఈ ఆయుధాల శకటాల తయారీకి మద్దతుగా, రక్షణ శాఖ, డిఆర్‌డిఓ నిలబడ్డాయి. వారి మార్గదర్శకత్వంలో టాటా, మహేంద్రాలతో సంప్రదింపులు జరిగాయి. ఫలితంగా 18 నెలల్లోనే టాటా ఒక నమూనాను ఆవిష్కరించి, ఆశ్చర్య పరిచింది. 2014 డిఫెన్స్ ఎక్స్‌పో లో దీన్ని ప్రదర్శించింది. 2018లో, సైన్యానికున్న అదనపు అవసరాలకు అనుగుణంగా దీన్ని ఉభయచరంగా అభివృద్ధి చేశారు. మహేంద్ర గ్రూపు సహాయంతో మరింత, మెరుగైన నమూనా తయారు చేశారు. 2020 డిఫెన్స్ ఎక్స్‌పో లో దీన్ని ప్రదర్శించారు. అనేక ట్రైల్స్, క్షేత్ర స్థాయి పరీక్షల తర్వాత సైన్యంలోనూ, సిఆర్‌పిఎఫ్ లోను దీన్ని జయప్రదంగా ప్రవేశపెట్టారు. భవిష్యత్తులో ఇటువంటి ప్రయత్నాలు ఏమవుతాయి? దేశీయంగా తయారయ్యే మిలిటరీ ఉత్పత్తుల భవిష్యత్తు ఏమిటి? వందలాది, అమెరికా స్ట్రైకర్లు భారత సైన్యంలో, పెద్ద ఎత్తున ప్రవేశపెట్టబడిన తర్వాత, రక్షణ పరిశ్రమలో దేశీయంగా ఈ శకటాల అభివృద్ధి ముందుకు సాగుతుందని, ఉత్పత్తి జరుగుతుందని ఆశించలేము. ఈ ఒప్పందం తెచ్చిపెట్టిన విషాదం ఇదే.

(స్వేచ్ఛానుసరణ)

జనవాక్యం

కళ్ళు తెరవాలి!

రాష్ట్రంలో గత పాలకులు వివిధ రూపాల్లో రాజకీయ అధికారాన్ని అడ్డు పెట్టుకుని వేల కోట్ల రూపాయలు దోచుకున్న వైనాలు వెలుగు చూస్తున్నాయి. ఆధారాలు దొరక్కుండా ఫైళ్లను తగలబెడుతున్నారంటే అవినీతి ఏ స్థాయిలో జరిగిందో ఊహించు కోవచ్చు! పాలక పక్ష నేతలు తమ ఎన్నికల ధృవపత్రంలో తమ కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాల్లో కూడా తప్పుడు సమాచారం ఇచ్చినట్లు పత్రికల్లో కథనాలు రావడం చూస్తున్నాం! ప్రతి జి.ఓ, ప్రతి నిర్ణయం వెనుక అవినీతి చోటు చేసుకున్నది. అయినా ఆదాయ పన్ను శాఖ...ఆ యా నేతల ఆదాయం, అక్రమం గా ఆస్తులు కూడబెట్టిన వైనాలపై విచారణ జరపడం లేదు. మరి ఇక్కడ కూడా లాలూచీ జరిగిందేమోనన్న సందేహం కలుగుతున్నది. ఇప్పటికైనా ఆదాయ పన్ను శాఖ రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుని నేతల, అధికారుల అక్రమ సంపాదనను వెలుగులోకి తీసుకు రావాలి.

- గరిమెళ్ల రామకృష్ణ,
ఏలూరు, ఏలూరు జిల్లా.



కోవిడ్ సేవలకు గుర్తింపు లేదా?

రెండేళ్ల క్రితం రెండేళ్ల పాటు ప్రపంచాన్ని వణికించిన కరోనా మహమ్మారి గురించి ఎవరమూ తేలిగ్గా మర్చిపోలేం. మన దేశంలో కూడా అత్యధిక మరణాలు, ఆర్థిక ఇబ్బందులు దశలవారీగా నమోదవుతున్నా, నిలిచి పోరాడి గెలిచాం. ఆ ఆపత్కాలంలో ముఖ్యంగా వైద్య సిబ్బంది, పోలీసు, శానిటేషన్ సిబ్బంది ముందు వరసలో ప్రాణాలకు తెగించి సేవలందించారు. నాడు ముఖ్యంగా ప్రభుత్వం, సమాజం 'మీ మేలు మరిచిపోం' అంటూ పళ్లాలు మోగించి, చప్పట్లు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించి కృతజ్ఞతలు తెలిపింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోవిడ్ సేవల్ని అందించిన వారిని వీరులుగా కీర్తించి తగు ప్రతిఫలం ఇస్తామని హామీ ఇచ్చాయి. వృత్తి ధర్మంలో ఉండి, మరణించిన వారి కుటుంబాలకు పెద్ద మొత్తంలో ఆర్థిక సాయం, సేవలందించిన వారికి భవిష్యత్‌లో ఉద్యోగాలలో ప్రాధాన్యత ఇస్తామని చెప్పాయి. అయితే ఆ మాటలు ఎంత వరకు కార్య రూపం దాల్చాయో తెలియదు. ప్రభుత్వాలు ఆ లెక్కల్ని ప్రజల ముందు ఉంచాలి. ఎవరికి ఎంత సాయం అందిందీ, ఎవరికి మొండి చెయ్యి దక్కిందన్న విషయాలు బహిర్గతం కావాలి. విజయనగరం జిల్లా కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న 18 మంది నర్సులు కోవిడ్ వెయిటేజీ మార్కుల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేదు. కోవిడ్ విపత్కర కాలంలో వాళ్లు ప్రాణాలకు తెగించి విధి నిర్వహణ చేసినట్లు రికార్డులున్నాయి. అయినా వెయిటేజి మార్కులకు ఎందుకు నోచుకోవడం లేదో అర్థం కాదు. ఆ సమయంలో విధుల్లో ఉన్న కొంత మంది వైద్యులదీ అదే పరిస్థితి. సంబంధిత అధికారులు రికార్డు పరిశీలించి ఇవ్వాల్సిన వెయిటేజి సమయానికి ఇవ్వక పోవడం వల్ల వారి అవకాశాలకు తీరని నష్టం జరుగుతోంది. కాంట్రాక్ట్ పోస్టుల్లో ఉన్న వారు ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసే సమయానికి వారికి న్యాయంగా ఇవ్వాల్సిన కోవిడ్ వెయిటేజి ఇస్తే వారికి న్యాయం జరుగుతుంది. ఎన్నో ఏళ్ల నుండి సేవలు చేస్తున్న వారిని వీలైతే శాశ్వత ఉద్యోగాల్లోకి తీసుకున్నా న్యాయంగా ఉంటుంది. ఇది ఒక్క పట్టణంలో దృష్టికి వచ్చిన అన్యాయం. రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా ఏ స్థాయిలో ఉందో లెక్కలు లేవు. సమయం మించి పోయి, ఉద్యోగార్హత వయసు దాటిపోక ముందే కోవిడ్ వీరులకు ప్రభుత్వం న్యాయం చెయ్యాలి. వారికి ఆపత్కాలంలో ఇచ్చిన హామీకి విలువ ఉండాలి. ప్రభుత్వాలకు ఇది నైతిక బాధ్యత.

- డా.డి వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం, విజయనగరం.

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

బిల్లుల పెండింగ్‌పై కేంద్రానికి, గవర్నర్లకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను పెండింగ్‌లో ఉంచినందుకు పశ్చిమ బెంగాల్, కేరళ గవర్నర్ల కార్యాలయాలకు, కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు శుక్రవారం నోటీసులిచ్చింది. హోం మంత్రిత్వ శాఖ, కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్‌ఖాన్, బెంగాల్ గవర్నర్ సివి ఆనంద్‌బోస్‌లకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం నోటీసులిచ్చింది. మూడు వారాల్లోగా నోటీసులపై స్పందించాలని ఆదేశించింది. రాష్ట్రాలకు కూడా జాయింట్ నోటీస్ సమర్పించాలని సూచించింది. "బిల్లులు గత ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. బిల్లుల విషయంలో రాష్ట్రపతికి చేసిన సూచనను నేను సవాలు చేస్తున్నాను. గవర్నర్లలో గందరగోళంతో బిల్లులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఇది రాజ్యాంగ విరుద్ధం" అని కేరళ ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కెకె వేణుగోపాల్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమానికి అవసరమైన సామాజిక అంశాలపై బిల్లులను రూపొందించామని బెంగాల్ తరపున హాజరైన న్యాయవాది అభిషేక్ సింఘ్వీ తెలిపారు. ప్రతిసారీ కోర్టు ఆదేశాలతోనే కొన్ని బిల్లులు క్లియర్ అవుతున్నాయని పేర్కొన్నారు. తమిళనాడుకి చెందిన బిల్లుల విషయంలోనూ ఇదే కొనసాగుతోందని అన్నారు.

43 మంది సైబర్ నేరగాళ్ల అరెస్టు

న్యూఢిల్లీ : కంప్యూటర్లలో సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తామనే పేరుతో విదేశీయుల్ని మోసగించిన గురుగ్రామ్ కాల్ సెంటర్ కేసును సిబిఐ ఛేధించింది. సైబర్ నేరస్థులుగా అనుమానిస్తున్న 43 మందిని అరెస్టు చేసినట్లు సిబిఐ అధికారులు శుక్రవారం వెల్లడించారు. ఈ కేసు విచారణలో భాగంగా గురుగ్రామ్‌లోని డిఎల్‌ఎఫ్ సైబర్ సిటీలో ఉన్న ఇన్నోసెంట్ టెక్నాలజీ (ఒపిసి) ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయంపై సిబిఐ దాడులు నిర్వహించింది. విదేశీయుల్ని మోసం చేయడానికి లైవ్ కాల్స్ చేస్తున్న అనేక మంది ఏజెంట్లను సిబిఐ గుర్తించింది. ఢిల్లీ, గుర్గావ్, నోయిడాతో సహా ఏడు ప్రాంతాల్లో దాడులు చేసినట్లు సిబిఐ తెలిపింది. అంతర్జాతీయ సైబర్ నేరాల కోసం ఉద్దేశించిన కేంద్రాలను గురుగ్రామ్‌లోని కాల్ సెంటర్ సమన్వయం చేస్తుందని తమ సోదాల్లో వెల్లడైందని సిబిఐ అధికారులు తెలిపారు. సైబర్ నేరంలో బాధితుల్ని తమ కంప్యూటర్లలో హానికరమైన సాఫ్ట్‌వేర్లను డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రేరేపించేవారని సిబిఐ పేర్కొంది. ఈ తరువాత బాధితుల కంప్యూటర్లలో సాంకేతిక సమస్యలు పరిష్కారం, నెట్‌వర్క్ పునరుద్దరణ కోసం వారి వద్ద నుంచి భారీ మొత్తంలో కాల్‌సెంటర్ వసూలు చేసేదని సిబిఐ తెలిపింది. ఈ స్కామ్ ద్వారా వివిధ దేశాల నుంచి వచ్చిన ఆదాయాన్ని హాంకాంగ్‌కు తరలించినట్లు వెల్లడైనట్లు తెలిపింది. ఈ కేసు విచారణ కోసం ఇంటర్‌పోల్, ఎఫ్‌బిఐ వంటి సంస్థలతో సిబిఐ సంప్రదింపులు జరుపుతోంది.

గాజాలో పోలియో ముప్పు

- యునిసెఫ్ ఆందోళన

గాజా స్ట్రిప్ : గాజాలో చిన్నారులకు పోలియో ముప్పు పొంచి వుందని ఐక్యరాజ్యసమితి పిల్లల నిధి (యునిసెఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. శరణార్థి శిబిరాలపై కూడా ఇజ్రాయిల్ సైన్యం విరుచుకుపడటంతో చిన్నారులు ప్రతిరోజూ భయాందోళనను ఎదుర్కొంటున్నారని పేర్కొంది. నవజాత శిశువులకు టీకాలు కూడా అందడం లేదని, పోలియో ముప్పు పొంచి వుందని హెచ్చరించింది. యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ క్రిస్టీన్ రస్సెల్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. "దాడుల్లో గాయపడిన చిన్నారులు తిరిగి గాయపడటం చూశాం. సరైన వనరులు లేకపోవడంతో వారి ప్రాణాలు కాపాడేందుకు వైద్యులు, నర్సులు కష్టపడుతున్నారు. వేలాదిమంది చిన్నారులు గాయాలతో, అనారోగ్యంతో, ఆకలితో ఉన్నారు. వారి కుటుంబాల నుండి విడిపోయారు" అని రస్సెల్ పేర్కొన్నారు.

తీవ్రమైన హింస, ఆకలి చిన్నారుల శరీరాలు, మనసులపై మానని గాయాలుగా మారతాయని ఆమె హెచ్చరించారు. దాడుల నుండి తప్పించుకునేందుకు ఆ కుటుంబాలు పదేపదే పారిపోవాల్సి వస్తోందని, ఇది మానవతా విపత్తుగా పరిణమిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్యం, మురుగునీటి శుద్ధి పూర్తిగా క్షీణించిందన్నారు. యునిసెఫ్ సహా పలు మానవతా సంస్థలు చేస్తున్న సహాయానికి సైన్యం కాల్పులు తీవ్ర ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం గాజా చెక్ పాయింట్ దగ్గర నిలిచివున్న యునిసెఫ్ వాహనాలపై ఇజ్రాయిల్ కాల్పులు జరపడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎలాంటి ఆటంకం లేకుండా సహాయాన్ని అనుమతించాలని, తక్షణమే కాల్పుల విరమణను ప్రకటించాలని యునిసెఫ్ డిమాండ్ చేసింది.

తక్షణమే కాల్పుల విరమణ

- ఐసిజె తీర్పుపై ఇజ్రాయిల్ స్పందించాలని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా పిలుపు

సిడ్నీ : పాలస్తీనా భూభాగాలను ఆక్రమించడం, నివాసాలు నిర్మించడం చట్ట విరుద్ధమని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) గతవారంలో ఇచ్చిన తీర్పుపై ఇజ్రాయిల్ స్పందించాలని ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా శుక్రవారం పిలుపునిచ్చాయి. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని కోరాయి. 'అంతర్జాతీయ సమాజం ఆందోళనలను ఇజ్రాయిల్ పట్టించుకోవాలి' అని ఈ దేశాలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు ఈ మూడు దేశాలు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశాయి. అంతర్జాతీయ మానవతా చట్టం ప్రకారం ప్రజల రక్షణ చాలా ముఖ్యమైనదని తెలిపాయి. పాలస్తీనియన్లపై కొనసాగుతున్న తీవ్రమైన హింసాత్మక చర్యలను మూడు దేశాలు ఖండించాయి. రెండు దేశాల మధ్య సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరాయి.

క్యూబాపై అమెరికా ఆగడాలు ఆపాలి

- అగ్రరాజ్యం చర్యలకు వ్యతిరేకంగా ఒత్తిడి తేవాలి
- ఈక్వెడార్ మాజీ విదేశాంగ మంత్రి గులామి లాంగ్
- క్యూబాకు అండగా నిలవాలి: సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

క్యూబాపై అమెరికా చర్యలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ఒత్తిడి తీసుకురావాలని ఈక్వెడార్ మాజీ విదేశాంగ మంత్రి గులామి లాంగ్ తెలిపారు. శుక్రవారం నాడిక్కడ హరి కిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో మోన్‌కేడా దినం 71వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సదస్సు జరిగింది. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఆర్. అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్నదనే ఆరోపణలపై క్యూబాను బ్లాక్‌లిస్ట్‌లో చేర్చి అమెరికా ఉక్కిరిబిక్కిరి చేస్తోందని సదస్సు పేర్కొంది. దీనికి వ్యతిరేకంగా అమెరికాపై అంతర్జాతీయ ఒత్తిడిని పెంచాలని పిలుపునిచ్చింది. క్యూబాపై కుట్రలో భాగంగానే ట్రంప్ హయాంలో క్యూబాను ఈ జాబితాలో చేర్చారని ఈక్వెడార్ మాజీ విదేశాంగ మంత్రి గులామి లాంగ్ అన్నారు. క్యూబాపై దీర్ఘకాలంగా ఉన్న ఆంక్షలను ఉపసంహరించుకోవాలని, దానికి అంతర్జాతీయంగా గళం వినిపించాల్సిన అవసరం ఉందని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం ఆత్మగౌరవం కోసం పాటుపడే వారందరూ క్యూబాకు అండగా నిలవాలని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. ఎన్ని దాడులు ఎదురైనా క్యూబా సోషలిస్టు బాట నుంచి వెనక్కి తగ్గదని క్యూబా రాయబార కార్యాలయానికి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న రాయబారి అబెల్ అబల్లె అన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు పల్లబ్‌సేన్ గుప్తా, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి దేవరాజన్, సిపిఐ ఎంఎల్ సెంట్రల్ కమిటీ సభ్యుడు రాజీవ్ దిమారి, దేవ్ రాయ్, ప్రొఫెసర్ సోనియా గుప్తా తదితరులు మాట్లాడారు.



సదస్సులో ప్రసంగిస్తున్న సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

వియత్నాం కమ్యూనిస్టు పార్టీ చీఫ్ పూ ట్రాంగ్‌కు సిపిఎం నివాళి

ఇటీవల కన్నుమూసిన వియత్నాం కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్‌గుయెన్ పూ ట్రాంగ్‌కు సిపిఎం ఘనంగా నివాళులర్పించింది.

న్యూఢిల్లీలోని వియత్నాం రాయబార కార్యాలయాన్ని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ, కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్‌కుమార్ సందర్శించారు. ఎన్‌గుయెన్ పూ ట్రాంగ్ మృతికి సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. పార్టీ సంతాప సందేశ పత్రాన్ని వియత్నాం రాయబారికి అందజేశారు.

ఇంగ్లీష్‌లో మాట్లాడాలన్నందుకు
స్కూల్ ప్రిన్సిపల్‌పై ఎఫ్ఐఆర్

- మధ్యప్రదేశ్‌లో హిందూత్వ శక్తుల అరాచకం

భోపాల్ : ఇంగ్లీష్‌లో మాట్లాడాలని ఒక విద్యార్థికి సూచించినందుకు స్కూల్ ప్రిన్సిపాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అరాచకం బిజెపి ప్రభుత్వ పాలనలోని మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. ఆర్ఎస్ఎస్ విద్యార్థి విభాగం ఎబివిపి ఒత్తిడితో పోలీసులు ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గుణ పట్టణంలోని వందన కాన్వెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ కేథరిన్ వటోలీపై కొత్వాలీ పోలీస్ స్టేషన్‌లో బిఎన్ఎస్ సెక్షన్ 196, సెక్షన్ 229 కింద కేసు నమోదు చేశారు. ఈ సంఘటన గురించి స్థానికులు, పాఠశాల సిబ్బంది వెల్లడించిన వివరాల ప్రకారం ఇటీవల విద్యార్థులతో అసెంబ్లీ నిర్వహించారు. నలుగురు హౌస్ కెప్టెన్లలో ఇద్దర్ని తమ నాయకత్వ నైపుణ్యాలను ప్రదర్శించే విధంగా ప్రసంగించాలని ఉపాధ్యాయులు సూచించారు. ఒక విద్యార్థి హిందీలో తన ప్రసంగాన్ని ప్రారంభించాడు. సిస్టర్ కేథరిన్ ఇంగ్లీష్‌లో ప్రసంగించాలని విద్యార్థికి తెలిపారు. ఇది పాఠశాలలో గతంలో ఇచ్చిన సూచనే. ఈ సూచనతో విద్యార్థి ప్రసంగించకుండా తమ తరగతికి వెళ్లిపోయాడు. 'హిందీలో మాట్లాడినందుకు విద్యార్థుల నుంచి మైక్ లాక్కున్నారు' అనే శీర్షికతో ఒక హిందీ పత్రిక వార్త వచ్చింది. మతపరమైన మనోభావాలను దెబ్బతీశారని, హిందీని అవమానించారని ఎబివిపి కార్యకర్తలు పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రిన్సిపాల్‌పై వచ్చిన ఆరోపణలను పాఠశాల సీనియర్ సిబ్బంది ఒకరు ఖండించారు. ఇంగ్లీష్‌లో మాట్లాడాలని మాత్రమే చెప్పినట్లు వివరణ ఇచ్చారు. తమ సంస్థ ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తుందని చెప్పారు. నామమాత్రపు ఫీజులు, నాణ్యమైన విద్య కారణంగా అనేకమంది తల్లిదండ్రులు తమ పాఠశాలను ఎంచుకుంటారని తెలిపారు. ఈ వందన కాన్వెంట్ స్కూల్‌ను మహిళలే నిర్వహిస్తుంటారు. ఇటీవలే 50వ వార్షికోత్సవాన్ని జరుపుకున్న ఈ పాఠశాల పూర్వ విద్యార్థులు దేశ విదేశాల్లో ఉన్నతస్థానాల్లో సేవలందిస్తున్నారు.

విద్వేష ఉత్తర్వులపై
స్టే పొడిగింపు

- యుపి, ఎంపి, ఉత్తరాఖండ్‌లపై సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : కన్వర్ యాత్ర సందర్భంగా బిజెపి పాలిత రాష్ట్రాలు ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ జారీ చేసిన విద్వేషపు ఉత్తర్వులపై సుప్రీంకోర్టు శుక్రవారం మధ్యంతర స్టేను పొడిగించింది. కన్వర్‌యాత్ర మార్గంలో శాంతి భద్రతల రీత్యా స్టాల్స్, హోటళ్లపై యజమాని, ఫోన్‌నెంబర్, సిబ్బంది, ఇతర వివరాలతో కూడిన నేమ్ ప్లేట్లను ఏర్పాటు చేయాలని తొలుత ఉత్తర ప్రదేశ్, ఆ తరువాత ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ ఉత్తర్వులనిచ్చాయి. జూన్ 22న ఇచ్చిన ఆదేశాల్లో స్పష్టతనిచ్చామని, వాటిపై ఎటువంటి వివరణ ఇచ్చేది లేదని సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ హృషికేశ్‌రాయ్, జస్టిస్ ఎస్‌విఎన్ భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం పేర్కొంది. పేర్లను బహిర్గతం చేయాలని ఎవరినీ బలవంతం చేయలేమని వ్యాఖ్యానించింది. తమ ఉత్తర్వులను సవాలు చేస్తూ మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్‌లపై తమ స్పందన తెలిపేందుకు పిటిషనర్లకు అనుమతిస్తూ... తదుపరి విచారణను ఆగస్టు 5కి వాయిదా వేసింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తమ ఉత్తర్వులను సమర్థించింది. పారదర్శకత కోసం, గందరగోళాన్ని నివారించేందుకు, శాంతియుత యాత్ర కొనసాగించడం తమ ఆలోచన అని పిటిషన్‌లో పేర్కొంది.

నెతన్యాహు ప్రసంగానికి వ్యతిరేకంగా నిరసనల హోరు

- గాజాలో మరణాలపై మౌనంగా ఉండలేం : కమలా హారిస్

వాషింగ్టన్: యుద్ధ నేరస్తుడు బెంజిమిన్ నెతన్యాహు అమెరికన్ కాంగ్రెస్‌నుద్దేశించి ప్రసంగించడాన్ని అమెరికన్ కార్మిక వర్గం తీవ్రంగా నిరసించింది. యుద్ధ నేరస్తునికి గురువారం అమెరికన్ కాంగ్రెస్ సభ్యులు నిల్చొని సాదరంగా స్వాగతించగా, పార్లమెంటు వెలుపల కేపిటల్ హిల్స్ వీధులు నిరసనలతో హోరెత్తాయి. వేలాది మంది విద్యార్థులు, వర్కర్లు, హక్కుల కార్యకర్తలు వీధుల్లోకి వచ్చి అమెరికన్ కాంగ్రెస్ వైపు ర్యాలీగా వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. గాజాతో సహా పాలస్తీనాలో లక్షా 68వేల మంది అమాయక పౌరుల నెత్తురు తాగిన నరరూప రాక్షసుడు నెతన్యాహు అంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రదర్శనను అడ్డుకోవడానికి యత్నించడంతో పోలీసులకు, నిరసన కారులకు మధ్య ఘర్షణ తలెత్తింది. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పెప్పర్ స్ప్రే ప్రయోగించారు. పలువురిని అరెస్టు చేశారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును అడ్డుకోవడంపై నిరసనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసనల్లో విద్యార్థులు, లేబర్ యూనియన్లు, హక్కుల కార్యకర్తలు పాల్గొన్నారు.



నెతన్యాహు ప్రసంగానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, కార్మికులు, హక్కుల పోరాట కార్యకర్తలు

ఇజ్రాయిల్‌కు అమెరికా మద్దతును ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్‌కు అమెరికా సాయం అందించడాన్ని 61 శాతం మంది అమెరికన్లు వ్యతిరేకిస్తున్నారని, అందులోనూ 30 ఏళ్ల లోపువారు 77శాతం దాకా ఉన్నారని తాజా సర్వేలో వెల్లడైంది. ఈ నిరసనల తాకిడిని గమనించిన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ గాజాలో అమాయక పౌరుల మరణాలపై నెతన్యాహు ఆందోళనతో ఉన్నారని, అక్కడ మారణ కాండ జరుగుతుంటే మౌనం ఉండబోమంటూ కంటి తుడుపు మాటలు మాట్లాడారు. నవంబరులో జరగనున్న అమెరికన్ అధ్యక్ష ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆమె ఆ ప్రకటన చేశారని పరిశీలకులు భావిస్తున్నారు.

భారత్‌లో మైనారిటీలపై హింస, వివక్ష

- యుఎన్ మానవ హక్కుల సంఘం ఆందోళన

న్యూఢిల్లీ : ఐక్యరాజ్యసమితి (యుఎన్) మానవ హక్కుల కమిటీ భారత్‌లో ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులతో సహా మైనారిటీ సమూహాలు ఎదుర్కొంటున్న హింస, వివక్ష గురించి ఆందోళన వ్యక్తం చేసింది. వారిపై అలాంటి వివక్షను నిషేధించటానికి సమగ్ర చట్టం కోసం పిలుపునిచ్చింది. భారత్‌లో షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి), షెడ్యూల్డ్ తెగ (ఎస్‌టి)లు, ఎల్‌జిబిటిఐ ప్రజల పైనా జరుగుతున్న వివక్ష, హింస గురించి యుఎన్ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. క్రొయేషియా, హోండురాస్, ఇండియా, మాల్దీవులు, మాల్టా, సురినామ్, సిరియన్ అరబ్ రిపబ్లిక్‌లపై తన తాజా సెషన్‌లో ఏడు దేశాలను పరిశీలించిన తర్వాత నిపుణుల సంఘం ఒక నివేదికలో ఈ వ్యాఖ్యలు చేసింది. పౌర, రాజకీయ హక్కులపై అంతర్జాతీయ ఒడంబడిక అమలుపై నిపుణుల సంఘం ఆందోళనలు, సిఫారసులు, ఇతర అంశాలతోపాటు, దేశాలలో ఈ నివేదిక తెలియజేస్తుంది. వివక్షను నిషేధించే సమగ్ర చట్టాన్ని, సాధారణ ప్రజలలో అవగాహన పెంచటానికి, పౌర సేవకులు, చట్టాన్ని అమలుచేసే అధికారులు, న్యాయవ్యవస్థ, సమాజ నాయకులకు వైవిధ్యం పట్ల గౌరవాన్ని పెంపొందించటానికి శిక్షణ ఇవ్వాలని నిపుణుల సంఘం భారత్‌కు పిలుపునిచ్చింది. భారతదేశ సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం, ఇతర తీవ్రవాద వ్యతిరేక చట్టాలలోని కొన్ని నిబంధనలు ఒడంబడికకు అనుగుణంగా లేవని కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చట్టం ప్రస్తుతం జమ్ముకాశ్మీర్, నాగాలాండ్, మణిపూర్, అసోం, అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో అమలులో ఉంది. యునైటెడ్ స్టేట్స్ స్టేట్ డిపార్ట్‌మెంట్ 2023 ఇంటర్నేషనల్ రిలిజియస్ ఫ్రీడమ్ రిపోర్ట్‌ను విడుదల చేసిన దాదాపు ఒక నెల తర్వాత ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల కమిటీ నివేదిక వచ్చింది. ఇది భారత్‌లోని మతపరమైన సంఘాల అణచివేతను హైలెట్ చేసింది.

గాజా పిల్లలను 'ఉద్దేశపూర్వకంగా' చంపారు

- బైడెన్, హారిస్‌లకు యుఎస్ వైద్య బృందం లేఖ


గాయపడిన గాజా బాలుడు

గాజా పిల్లలను ఇజ్రాయిల్ దళాలు 'ఉద్దేశపూర్వకంగా' కాల్చిచంపాయని అమెరికాకు చెందిన వైద్య బందం బైడెన్, హారిస్‌లకు రాసిన లేఖలో పేర్కొంది. ఈ మేరకు ఫిరోజ్ సిద్వా ఎక్స్ లో సదరు లేఖను పోస్టు చేశారు. ఇజ్రాయిల్‌కు దౌత్య, సైనిక మద్దతును అమెరికా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. అక్టోబరు నుండి గాజాలో వైద్య సేవలందిస్తున్న 45 మంది అమెరికన్ వైద్యులు, నర్సుల బృందం ఇజ్రాయిల్ దాడులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మాలో ప్రతి ఒక్కరూ ప్రతి రోజు తలపై, ఛాతీలపై కాల్చబడిన పిల్లలు, యువకులకు చికిత్స చేశాం. మహిళలు, పిల్లలపై భరించలేని క్రూరత్వ దృశ్యాలను స్వయంగా చూశాం. వాటిని మరచిపోలేం." అని లేఖలో తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

వెనిజులాకు మరో పరీక్ష

కారకస్: వెనిజులా మరో కీలక పరీక్ష ఎదుర్కోనుంది. ఆరేళ్లకొకసారి జరిగే అధ్యక్ష ఎన్నికలు ఆదివారం జరగబోతున్నాయి. వెనిజులా ప్రజలు బొలివేరియన్ ఎజెండాకు అనుకూలంగా తీర్పు ఇస్తారా? లేక ఒకప్పటి కులీనుల భయంకర పాలనవైపు మొగ్గుతారా? అన్నది తేలాల్సి ఉంది. వెనిజులాలో 1999లో కులీనుల ప్రభుత్వాన్ని కూలదోసి నూతన బొలివేరియన్ రాజ్యాంగం ప్రకారం నిర్వహిస్తున్న ఆరవ ఎన్నికలివి. 2013, 2019 అధ్యక్ష ఎన్నికల్లో వరుసగా గెలుస్తూ వచ్చిన నికోలస్ మదురో వామపక్షాలు, ప్రజాతంత్ర పార్టీల కూటమి తరపున మూడోసారి పోటీ చేస్తున్నారు. ఆయనకు ప్రత్యర్థిగా మితవాది, వృద్ధ నేత ఎడ్మండ్ గొంజాలెజ్ బరిలో ఉన్నారు. జువాన్ గైడో 2021లో ఏర్పాటు చేసిన యూనిటరీ ప్లాట్‌ఫామ్‌కు సారథ్యం వహిస్తున్న గొంజాలెజ్ పశ్చిమ దేశాలకు నమ్మిన బంటు. అధికారం చేపట్టిన బొలివేరియన్ విప్లవకారుడు హ్యూగోచావెజ్ మరణానంతరం అనేక గడ్డు పరిస్థితులను ఎదుర్కొని వెనిజులాను బొలివేరియన్ పంథాలో ముందుకు నడిపించేందుకు యత్ని స్తున్నాడు. ఈ బొలివేరియన్ ఎజెండాను అడ్డుకోడానికి అమెరికా, దాని తైనాతీలు నిరంతరం కుట్రలు పన్నుతూనే ఉన్నాయి. 2019లో ఎన్నికైన మదురో ప్రభుత్వానికి పోటీగా జువాన్ గైడో నేతృత్వంలో సమాంతర ప్రభుత్వాన్ని తెరపైకి తెచ్చాయి. ప్రజల మద్దతుతో మదురో ఈ కుట్రను తిప్పికొట్టాడు. 2015లో చమురు ధరలు పడిపోయేలా చేసి వెనిజులాను ఆర్థికంగా దెబ్బ తీయాలని అమెరికా యత్నించింది. వాటిని తట్టుకుని వెనిజులా ముందుకు సాగింది. 2005 నుంచి వెనిజులాపై అమెరికా ఆర్థిక ఆంక్షలు కొనసాగిస్తున్నది. 90 శాతం సొంత ఆర్థిక వనరులపై ఆధారపడిన వెనిజులా ఆర్థిక వ్యవస్థపై ఈ ఆంక్షల ప్రభావం పరిమితమనే చెప్పాలి.

'పోలవరం', నిర్వాసితులూ ముఖ్యమే

(మొదటిపేజీ తరువాయి)

సంక్షేమశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు.

పరిశీలనలో వలంటీర్ల వేతనాల పెంపు

వలంటీర్ల గౌరవ వేతనాన్ని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరిశీలన చేస్తోందని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. జూన్ 12 నుంచి జులై 23 వరకు టిడిపి సానుభూతిపరులపై దాడులు చేసిన వైసిపి అనుచరులపై 42 క్రిమినల్ కేసులు, ప్రతిపక్ష, సానుభూతిపరులపై దాడులు చేసిన టిడిపి అనుచరులపై 38 క్రిమినల్ కేసులు నమోదు చేశామని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత.. వైసిపి సభ్యులు టి.రఘురామ్, ఎం.అరుణకుమార్, టి.మాధవరావు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు ఆర్థిక సహాయం అందించేందుకు మహాశక్తి పథకాన్ని ప్రభుత్వం రూపొందిస్తుందని, వీటి మార్గదర్శకాలు త్వరలో జారీ చేస్తామని మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి... వైసిపి సభ్యుల ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

నేడు నీతి ఆయోగ్ పాలకమండలి భేటీ

- హాజరుకానున్న సిఎం చంద్రబాబు
- కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఏడుగురు సిఎంలు దూరం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులతో శనివారం నీతి ఆయోగ్ తొమ్మిదో గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలకు చెందిన ఏడుగురు ముఖ్యమంత్రులు దూరంగా ఉండనున్నారు. కేంద్ర బడ్జెట్‌లో వివక్ష చూపడం, రాష్ట్రాల హక్కులు కాలరాయడాన్ని నిరసిస్తూ ఆయా రాష్ట్రాల సిఎంలు ఈ నిర్ణయం తీసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపడుతూ హాజరుకాలేమని ప్రకటించిన వారిలో తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, పంజాబ్, జార్ఖండ్ సిఎంలు భగవంత్ మాన్, హేమంత్ సోరెన్ ఉన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎ.రేవంత్ రెడ్డి (తెలంగాణ), సిద్ధరామయ్య (కర్ణాటక), సుఖ్వీందర్ సింగ్ సుఖ్ (హిమాచల్ ప్రదేశ్) ఉన్నారు. ఢిల్లీ ముఖ్య మంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ మద్యం పాలసీ కేసులో తీహార్ జైలులో ఉండడం వల్ల ఆయన హాజరుకాలేరు. పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి మమతా బెనర్జీ నీతి ఆయోగ్ సమావేశానికి హాజరై, నిరసన తెలుపుతానని ప్రకటించారు. నీతి ఆయోగ్ తొమ్మిదో పాలక మండలి సమావేశం శనివారం రాష్ట్రపతి భవన్‌లోని కల్చరల్ సెంటర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షత జరగనుంది. 'ఈజ్ ఆఫ్ లివింగ్ పై దృష్టి సారించండి, భవిష్యత్ అభివృద్ధిపై దృష్టి పెట్టండి' నినాదంతో ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోపాటు బీహార్, మహారాష్ట్ర సిఎంలు నితీష్ కుమార్, ఏక్‌నాథ్ షిండేతో పాటు బిజెపి పాలిత ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా హాజరయ్యే అవకాశాలున్నాయి.



జాబితాలో పేరులేకపోయినా బిజెపి ఎంపి ఈరన్న మాట్లాడేందుకు అనుమతించిన రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖర్

ప్రజా సమస్యలపై చర్చకు పట్టు

- పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన
- కార్గిల్ యుద్ధ వీరులకు నివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజా సమస్యలపై చర్చకు అనుమతించాలని, కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్ష వీడాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్‌లో ఆందోళన కొనసాగింది. శుక్రవారం పార్లమెంట్ ఉభయ సభలు ప్రారంభం కాగానే ప్రజా సమస్యలపై చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. వివిధ సమస్యలపై తాము ఇచ్చిన నోటీసులను అనుమతించాలని సభ్యులు పట్టుపట్టారు. రాజ్యసభలో ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్, లోక్‌సభలో స్పీకర్ ఓం బిర్లా ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసులను తిరస్కరించారు. కార్గిల్ యుద్ధ విజయోత్సవ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఉభయ సభలు నాటి యుద్ధ వీరులకు నివాళులర్పించాయి. పార్లమెంట్ సభ్యులంతా ఒక నిమిషం మౌనం పాటించారు.

లోక్‌సభ ప్రారంభం కాగానే స్పీకర్ ఓం బిర్లా ప్రశ్నోత్తరాలు ప్రారంభించేందుకు ప్రయత్నించారు. ప్రజా సమస్యలపై చర్చించాలంటూ ప్రతిపక్ష సభ్యులు తమ స్థానాల్లో లేచి నినాదాలు చేశారు. ప్రతిపక్షం దేశాన్ని అవమానించిందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. ఆయనకు వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. ప్రతిపక్షాన్ని, అధికార పార్టీని సమన్వయం చేయడం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కర్తవ్యమని, ప్రతిపక్ష ఎంపిలపై విమర్శలు చేయడం కాదని కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్ హితవు పలికారు. ప్రతిపక్షాల ఆందోళనతో సభను 15 నిమిషాల పాటు స్పీకర్ వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో జీరో అవర్ జరిగింది. మధ్యాహ్నం సభలో ప్రైవేట్ మెంబర్ బిల్లుపై చర్చ జరిగింది. అనంతరం సభను సోమవారానికి వాయిదా వేశారు. రాజ్యసభలో కూడా ప్రతిపక్ష ఎంపిలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖర్ మాట్లాడుతూ సభ్యులు తమ స్థానాల్లో కూర్చో వాలని కోరారు. రాజ్యసభలో మాట్లాడేవారి జాబితాలో పేరు లేకపోయినా కర్ణాటకకు చెందిన బిజెపి ఎంపి ఇరన్న బి. కడడికి అవకాశం ఇవ్వడంపై ప్రతిపక్ష ఎంపిలు జగదీప్ ధన్‌ఖర్‌ను ప్రశ్నించారు. దీనికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. రాజ్యసభలో జీరో అవర్ అయిన తరువాత, ప్రశ్నోత్తరాలు జరిగాయి. మధ్యాహ్నం ప్రైవేట్ మెంబర్ బిల్లు ప్రవేశపెట్టిన అనంతరం సభను సోమవారానికి వాయిదా వేశారు.

పరువు నష్టం కేసులో యుపి కోర్టుకు రాహుల్

లక్నో /సుల్తాన్‌పూర్ : పరువునష్టం కేసులో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సుల్తాన్‌పూర్‌లోని ఎంపి-ఎమ్మెల్యే కోర్టు ఎదుట శుక్రవారం హాజరయ్యారు. ప్రత్యేక న్యాయమూర్తి శుభం వర్మ ఎదుట హాజరై, తన వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి కేసు తదుపరి విచారణను ఆగస్ట్ 12కి వాయిదా వేశారు. తదుపరి విచారణకు రాహుల్ గాంధీ కోర్టుకు హాజరుకానవసరం లేదని తెలిపారు. బిజెపి అధ్యక్షుడు అమిత్‌షాపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ 2018 ఆగస్టు 4న స్థానిక బిజెపి నేత విజయ్ మిశ్రా రాహుల్‌గాంధీపై ఈ కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం రాహుల్ తరపున న్యాయవాది కాశీ ప్రసాద్ శుక్లా మీడియాతో మాట్లాడారు. పరువు నష్టం కేసుకు దారితీసే విధంగా ఎవరిపైనా రాహుల్‌గాంధీ తప్పుడు ప్రకటన చేయలేదని అన్నారు. తేలిగ్గా ప్రచారం పొందేందుకు ఈ కేసు దాఖలు చేశారని చెప్పారు. రాహుల్‌గాంధీ ఉదయం 11 గంటలకు కోర్టుకు రావడంతో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు అక్కడికి చేరుకున్నారు. కోర్టు ఎదుట భారీస్థాయిలో భద్రతా బలగాలను మోహరించారు. రాయ్‌బరేలీ నుండి విమానంలో లక్నో చేరుకున్న రాహుల్ గాంధీ రోడ్డు మార్గంలో సుల్తాన్‌పూర్‌లోని కోర్టుకు వచ్చారు.

పశ్చిమ మహారాష్ట్రకు ఆరెంజ్ ఎలర్ట్

ముంబయి : పశ్చిమ మహారాష్ట్ర పరిధిలోని జిల్లాలకు భారత వాతావరణ శాఖ ఆరెంజ్ ఎలర్ట్ జారీ చేసింది. రాయ్‌గఢ్, రత్నగిరి, సింధుదుర్గ్, పుణే, సతారా జిల్లాల్లో శనివారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ముంబయి, ధానే జిల్లాలకు ఎల్లో ఎలెర్ట్ జారీ చేసింది. దీని ప్రకారం ఈ జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ జిల్లాలకు తప్ప రాష్ట్రంలో మిగిలిన ఇతర జిల్లాలకు ఎలాంటి ఎలర్ట్‌ను జారీ చేయలేదు. మహారాష్ట్రలో గురువారం దాదాపు అన్ని జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురవడం, అనేక ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదు కావడంతో జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీని ప్రభావం శుక్రవారం కూడా కనిపించింది. భారీ వర్షాల కారణంగా కృష్ణానదితో సహా రాష్ట్రంలో అన్ని నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సంగ్లి వద్ద కృష్ణా నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది.

ఖరీఫ్ ఆశలు ఆవిరి!

(మొదటిపేజీ తరువాయి)

అటువంటి పరిస్థితులే పునరావృతమవుతున్నాయి.

జూన్‌లో అత్యధికం... జులైలో అత్యల్పం

జూన్‌లో అనంతపురం జిల్లాలో అత్యధికంగా వర్షపాతం నమోదైంది. ఆ నెలలో

సాధారణ వర్షపాతం 61 మిల్లీమీటర్లు కాగా, 147.1 మిల్లీమీటర్లు నమోదైంది. సాధారణం కంటే 86.1 మిల్లీమీటర్లు అధికంగా నమోదు కావడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఖరీఫ్‌కు ముఖ్యంగా వేరుశనగకు కీలకమైన జులైలో సాధారణ వర్షపాతం 55.4 మిల్లీమీటర్లకుగానూ ఇప్పటి వరకూ 19.1 మిల్లీమీటర్లు మాత్రమే నమోదయ్యాయి. దీంతో, జిల్లాలోని 31 మండలాల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.

24 శాతమే సాగు

జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 8.56 లక్షల ఎకరాలు కాగా, 2.07 లక్షల ఎకరాల్లోనే (24 శాతం విస్తీర్ణంలోనే) ప్రస్తుతం పంటలు సాగులో ఉన్నాయి. ప్రధాన పంట వేరుశనగ సాధారణ సాగు 1,97,884 ఎకరాలు కాగా, జులైలో వర్షాలు అనుకూలించకపోవడంతో ఇప్పటి వరకు 34,062 ఎకరాల్లో (17.2 శాతం విస్తీర్ణంలో) మాత్రమే వేశారు. ఈ పంట సాగుకు అదును దాటుపోతోంది. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 48,586 ఎకరాలు కాగా, 15,530 ఎకరాల్లోనే ప్రస్తుతం సాగులో ఉంది. కంది సాధారణ సాగు 37,367 ఎకరాల కాగా, 19,708 ఎకరాల్లోనూ, ఆముదం సాధారణ సాగు 16,340 ఎకరాలు కాగా, 7,025 ఎకరాల్లోనూ వేశారు. గతేడాది కరువు పరిస్థితులు నెలకొన్నా 2.62 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు వేశారు.



గురు మహేంద్ర

పాఠశాల గోడ కూలి విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి-నెల్లూరు

మున్సిపల్ పాఠశాల సన్‌షేడ్ కూలి విద్యార్థి మృతి చెందిన సంఘటన నెల్లూరు జిల్లాలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భక్తవత్సల నగర్‌లోని చిన్న కెవిఆర్ పాఠశాలలో గురుమహేంద్ర (15) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం పాఠశాల ముగిసిన అనంతరం ఇంటికి వెళ్లే క్రమంలో పాఠశాలలో నూతనంగా నిర్మించిన సన్‌షేడ్ కూలింది. ఒక్కసారిగా విద్యార్థిపై పడడంతో గురుమహేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. డిఇఒ రామారావు, సర్వశిక్షా అభియాన్ అధికారి సిహెచ్ ఉషారాణి, ఆర్‌డిఒ మలోల, నగర డిఎస్‌పి డి.శ్రీనివాసులరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించి ఓదార్చారు. గత ప్రభుత్వ హయాంలో నాడు -నేడు పథకంలో భాగంగా పాఠశాల అదనపు తరగతి గదులు నిర్మించారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేసేందుకు రెండో దఫా పనులు చేపట్టారు. పాఠశాల గదికి నూతనంగా నిర్మించిన సన్‌షేడ్ ఊడిపడింది. విద్యార్థి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని డిఇఒ రామారావు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యవసాయ కార్మికుడు మృతి

రాయదుర్గం : అనంతపురం జిల్లా రాయదుర్గం మండలంలోని రాతిబావివంక గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మికుడు బోయ రాముడు (40) శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందాడు. రాముడు మధ్యాహ్నం పొలంలో విద్యుత్ మోటారు వేసేందుకు వెళ్లగా మోటారు ఆన్ చేస్తున్న సమయంలో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన నేర చట్టాలతో ప్రజల హక్కులకు భంగం

అవగాహనా సదస్సులో హైకోర్టు న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్



ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

నూతన నేర చట్టాలతో ప్రజల హక్కులకు భంగం కలగనుందని హైకోర్టు సీనియర్ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ అన్నారు. ఈ చట్టాలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన నేర చట్టాలను ఉపసంహరించుకోవాలని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో శుక్రవారం సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యవక్తగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలో వలస పాలకులు తీసుకొచ్చిన చట్టాలు కొనసాగకూడదంటూ వాటి స్థానంలో కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. కొత్త నేర చట్టాల్లో గొప్పగా మార్పులు చేసిన దాఖలాలు లేవని తెలిపారు. పాత చట్టాలనే పేర్లు మార్చారని, నేడు తీసుకొచ్చిన నూతన నేర చట్టాల్లో కేవలం పది శాతం చట్టాలను మాత్రమే మార్పులు చేశారని వివరించారు. చట్టాలు మార్చినప్పుడు అవి ప్రజలకు మరింత స్వేచ్ఛ, భయాన్ని తొలగించేలా ఉండాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాల్లో అటువంటి ఆనవాళ్లు కనిపించడం లేదని పేర్కొన్నారు. ప్రశ్నించే వారిని నోరెత్తకుండా కఠిన శిక్షలు విధించనున్నారని తెలిపారు. అధికారులకు, పోలీసు వ్యవస్థకు మరిన్ని అధికారాలు ఇచ్చేలా కొత్త నేర చట్టాలు ఉన్నాయని, వీటితో సామాన్య ప్రజలు హక్కులు కోల్పోతారని వివరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి సాగర్, సిపిఐ (ఎంఎల్) జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి, సిపిఎం జిల్లా నాయకులు జివి కొండారెడ్డి, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ఐలు జిల్లా కార్యదర్శి ఎండి యాసిన్, ప్రజాతంత్ర ఐక్యవేదిక నాయకులు, సీనియర్ న్యాయవాది పి గోవిందయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ ఇఎస్ఐలో కనీస సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

కాకినాడలో ఐదు నెలల క్రితం ప్రారంభమైన కార్మిక రాజ్య బీమా ఆస్పత్రి (ఇఎస్ఐ)లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బందిని ఇంకా సమకూరలేదు. దీతో, కార్మికుల ఆరోగ్యానికి భరోసా ప్రశ్నార్థకంగా మారింది. కేంద్ర కార్మిక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆస్పత్రికి నిధుల కొరత లేనప్పటికీ పాలకుల నిర్లక్ష్యం వల్ల అసౌకర్యాల చెరలో కొట్టుమిట్టాడుతోంది. బయట అందమైన పెద్ద పెద్ద భవనాలు, ఆహ్లాదకరమైన వాతావరణం దర్శనమిస్తున్నా లోపల కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు సేవలు స్వల్పంగానే అందుతున్నాయి.

స్థానిక సాంబమూర్తినగర్‌లో కార్మిక రాజ్య బీమా ఆస్పత్రి (ఇఎస్ఐ)ని 1960లో సువిశాల స్థలంలో పలు భవనాల్లో ఏర్పాటు చేశారు. కాకినాడ, కాకినాడ రూరల్, యానాం, సామర్లకోట పరిధిలో వివిధ పరిశ్రమలు, సంస్థలో పని చేస్తున్న కార్మికులకు అవుట్ పేషెంట్లు (ఒపి) సేవలు ఇక్కడే అందేవి. భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వాటిని తొలగించారు. 2020 ఫిబ్రవరి 26న నూతన భవన పనులకు శంకుస్థాపన జరిగింది. రూ.110 కోట్లతో సుమారు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో వంద పడకల ఆస్పత్రిని నిర్మించారు. ప్రస్తుతం నాలుగు అంతస్తుల్లో సువిశాల ఆవరణలో విశాలమైన భవనాలు దర్శనమిస్తున్నాయి. కాకినాడ, యానాం ప్రాంతాల్లో పని చేస్తున్న 63 వేల మంది కార్మికులు, వారిపై ఆధారపడిన 2.45 లక్షల కుటుంబ సభ్యులకు ఈ ఆస్పత్రే ఆధారం. కొత్త భవనంలో ఏడాది ఫిబ్రవరి 25న ఇఎస్ఐ ఆస్పతి సేవలను ప్రారంభించారు. ఐదు నెలలు గడుస్తున్నా పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించలేదు. సాధారణ వైద్యులు 38 మంది ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం పది మందే ఉన్నారు. స్పెషలిస్టులు 18 మంది ఉండాల్సి ఉన్నా, ప్రస్తుతం ఒక్కరూ లేరు. వైద్య సిబ్బంది 54 మందికిగాను 28 మందే ఉన్నారు. పేరుకే వంద పడకల ఆస్పత్రి అయినప్పటికీ 20 పడకలే అందుబాటులో ఉన్నాయి. సెక్యూరిటీ, హౌస్ కీపింగ్, వార్డ్ బాయ్‌ల కొరత వేధిస్తోంది. సాధారణ వైద్య సేవలు మాత్రమే అందుతున్నాయి. కొని రకాల మందులు అందుబాటులో లేవు. స్కానింగ్ పరికరాలు నేటికీ సమకూర్చలేదు. అల్ట్రాసౌండ్ మిషన్ ఉన్నప్పటికీ సంబంధిత స్పెషలిస్ట్ వైద్యుడు లేకపోవడంతో కార్మికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

కౌలు రైతులకు రుణాలేవి..!

- లక్ష్యానికి అనుగుణంగా కొరవడిన అధికారుల కార్యాచరణ
- కౌలుకార్డుల జారీలో తొలగని ఇబ్బందులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లాలోనే కాదు.. పశ్చిమగోదావరి జిల్లాలోనూ కౌలురైతులకు పంట రుణాలపై అధికారులు నిర్దేశించిన లక్ష్యం అత్యంత దారుణంగా ఉంది. కౌలురైతులకు పంట రుణాల మంజూరులో గత ప్రభుత్వంలోని పాలకులు, అధికారులు వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా మారిందని చెప్పొచ్చు. ప్రభుత్వం మారడంతో కౌలురైతులకు జిల్లా వ్యవసాయ వార్షిక రుణ ప్రణాళికలకు అనుగుణంగా పంట రుణాలు మంజూరు చేయాలని సమాచార శాఖా మంత్రి పార్థసారధి జిల్లా సమీక్షా సమావేశంలో అధికారులకు ఇచ్చిన ఆదేశాలు అమలు చేస్తేనే కౌలురైతులకు న్యాయం జరుగుతుంది. మంత్రి ఆదేశాలకు అనుగుణంగా అధికారుల కార్యాచరణ ఏమాత్రం కన్పించడం లేదు. ప్రస్తుత పరిణామాలు అందుకు అద్దం పడుతున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వ హాయాంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 3.15 లక్షల మంది కౌలురైతులకు కౌలుకార్డులు జారీ చేసిన పరిస్థితి కొనసాగింది. ప్రస్తుతం కౌలుకార్డుల జారీపై అధికారులు తీసుకున్న లక్ష్యం అందులో సగం కూడా లేని పరిస్థితి నెలకొంది. 'పశ్చిమ'లో లక్షా ఆరు వేలు, ఏలూరు జిల్లాలో 76 వేలు మొత్తం లక్షా 82 వేల కౌలుకార్డులు మాత్రమే జారీ చేయాలని అధికారులు లక్ష్యం నిర్ణయించుకున్న పరిస్థితి నెలకొంది. మరో లక్షా 20 వేల మంది కౌలురైతులకు కౌలుకార్డుల జారీ ప్రశ్నార్థకంగా మారింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో వార్షిక పంట రుణాల లక్ష్యం రూ.ఏడువేల కోట్లకుపైగానే ఉంది. జిల్లాలో 75 శాతానికిపైగా వ్యవసాయ సాగు చేస్తున్న కౌలురైతులకు పంట రుణాల కింద రెండు జిల్లాల మొత్తంగా చూసిన రూ.600 కోట్లకు మించి లేకుండా పోయింది. రెండు జిల్లాల్లో దాదాపు రూ.14 వేల కోట్ల పంట రుణాల లక్ష్యంలో పట్టుమని రూ.600 కోట్లు కూడా ఇవ్వకపోతే వాస్తవ సాగుదారుడైన కౌలురైతులు ఏవిధంగా సాగు చేయాలో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు మంత్రి ఆదేశాలకు అనుగుణంగా కౌలురైతులకు పంట రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.

గత ప్రభుత్వం భూయజమాని అంగీకారంతో కౌలుకార్డులు జారీ చేయాలని నిబంధనల్లో మార్పులు చేసింది. దీంతో భూయజమానులు కౌలురైతులకు కౌలుకార్డులు ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. దీంతో కౌలుకార్డుల జారీ, రుణాల మంజూరుసైతం సక్రమంగా జరగడం లేదు. దీంతో పంట దెబ్బతింటే నష్టపరిహారంగాని, బీమా పరిహారంగాని, అన్నదాత సుఖీభవ వంటి పథకాలుగాని అందే పరిస్థితి లేకుండాపోయింది. ప్రభుత్వం నిబంధనలను మార్పుచేసి కౌలురైతులకు రుణార్హత కార్డులు జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది.



పర్యావరణానికి హాని కలిగిస్తే కరువు కాటకాలు

- వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్

ప్రజాశక్తి - తాళ్లరేవు(కాకినాడ జిల్లా)

పర్యావరణానికి హాని చేయడం వల్లే దేశంలో 60 శాతం కరువు సంభవించిందని జల సంరక్షకుడు (వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా), పర్యావరణ వేత్త రాజేంద్ర సింగ్ అన్నారు. పర్యావరణాన్ని ప్రేమిస్తే మానవ మనుగడకు అది మరింతగా దోహదం చేస్తుందని తెలిపారు. అంతర్జాతీయ మడ అడవుల పరిరక్షణ దినోత్సవంలో భాగంగా కాకినాడ జిల్లా కోరంగి మడ అడవుల్లోని చొల్లంగి వన్యప్రాణి కేంద్రంలో శుక్రవారం విద్యార్థులతో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎనిమిది రెట్ల ఆక్సిజన్ ఇచ్చే మడ అడవులను సంరక్షించడం ద్వారా పర్యావరణానికి మరింత మేలు జరుగుతుందన్నారు. తీరప్రాంతాలకు రక్షణ కవచాలుగా మడ అడవులు ఉండడమే కాకుండా, పలు జీవరాశులకు ఆలవాలంగా ఉన్నాయని వివరించారు. అటువంటి మడ అడవులను రక్షించడానికి విద్యార్థి దశ నుంచి కృషి చేయాలని కోరారు. అనంతరం మడ అడవుల సంరక్షణపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. 'మడ పర్యావరణ వ్యవస్థ పరిరక్షణ, అంతర్జాతీయ దినోత్సవం-2024' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కాకినాడ సబ్ డిఎఫ్ఒ అనూష అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, పర్యావరణ వేత్తలు బొలిశెట్టి సత్యనారాయణ, మృత్యుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం' కోసం

- జూనియర్ కళాశాల విద్యార్థుల ఆందోళన
- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఖాళీప్లేట్లతో నిరసన

ప్రజాశక్తి-రాయదుర్గం

గత టిడిపి ప్రభుత్వంలో జూనియర్ కళాశాలల్లో అమలైన మధ్యాహ్న భోజన పథకాన్ని పున:ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాయదుర్గం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పట్టణంలోని కనేకల్ రోడ్డుపై ఖాళీ ప్లేట్లతో బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ విషయంపై రాష్ట్రంలోని ఎమ్మెల్యేలందరికీ వినతిపత్రాలు అందిచామన్నారు. అయినా ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా ఈ విషయంపై అసెంబ్లీలో మాట్లాడకపోవడం విచారకరం అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఎంతగానో ఉపయోగంగా ఉంటుందన్నారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. వైసిపి అధికారంలోకి వచ్చాక దీనిని రద్దు చేశారన్నారు. ప్రస్తుతం అదే పార్టీ అధికారంలో ఉన్న నేపథ్యంలో ఈ పథకాన్ని పున:ప్రారంభించి విద్యార్థుల ఆకలి తీర్చాలన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ పథకం అమలు చేసే వరకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని, అవసరమైతే ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడికి సైతం వెనకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్, గౌతమ్, అనిల్, సందీప్, భానుప్రకాష్, విష్ణు, తిప్పేసి, శివారెడ్డి, సందీప్, వంశీ, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



22న 'ఆర్‌కె పురంలో?' విడుదల

రవికిరణ్ గుబ్బల హీరోగా 'ఆర్‌కెపురంలో ' సినిమాతో తెరంగ్రేటం చేశారు. హీరో చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆగస్టు 22న ఈ సినిమా విడుదల కానుంది. దర్శకుడు కట్టా శ్రీకర్ ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. నిర్మాణ సారథ్యం కూడా రవికిరణే. హైదరాబాద్, విశాఖపట్టణం, కోనసీమ ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ చేశారు. సెన్సార్ కూడా పూర్తయ్యింది. రవికిరణ్ ఈ సినిమాలో అన్యాయాలను ఎదురించే పోలీసు అధికారి పాత్రను పోషించారు. అంతర్వేది ఆలయం వద్ద ఈ చిత్రం పోస్టర్‌ను రాజోలు శాసనసభ్యులు దేవ వరప్రసాద్ ఇటీవల ఆవిష్కరించారు. ఆర్‌కె పురం అనే గ్రామంలో ఏమి జరిగింది అనే నేపథ్యంలో ఈచిత్రాన్ని రూపొందించామని దర్శకుడు శ్రీకర్ ప్రసాద్ తెలిపారు. మత్తుకు బానిసవుతున్న యువత, దాని వల్ల తలెత్తే పరిస్థితులు, స్మగ్లింగ్‌ను అరికట్టే అంశాలపై సస్పెన్స్ థ్రిల్లర్‌గా క్లాస్, మాస్ యాంగిల్‌లో సినిమాను తెరకెక్కించామన్నారు. కుటుంబ నేపథ్యంలో చూడదగ్గ చిత్రంగా దీనిని రూపొందించామన్నారు.

23న 'కొట్టుకాళి' విడుదల



కోలీవుడ్‌కు చెందిన ప్రముఖ హాస్యనటుడు సూరి, అన్నా బెన్ (కైరా) జంటగా నటించిన చిత్రం 'కొట్టు కాళి'. ఈ చిత్రం ఆగస్టు 23న విడుదల చేయనున్నట్లు నిర్మాత, తమిళ స్టార్ హీరో శివ కార్తికేయన్ వెల్లడించారు. సూరి నటించిన 'గరుడన్' చిత్రం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలవటంతో ఆయన తాజాగా 'కొట్టు కాళి' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాకు పీఎస్ వినోద్‌రాజ్దర్శకత్వం వహిస్తున్నారు. కల్కి చిత్రంలో కైరాగా అలరించిన మలయాళ నటి అన్నాబెన్ కథానాయికగా నటిస్తోంది. గతంలో సూరి 'విడుదలై'లో కూడా హీరోగా నటించారు. సీక్వెల్‌లోనూ ఆయన నటిస్తున్నారు.

ఎన్టీఆర్‌తో నటించటం చాలా ఇష్టం : జాన్వీకపూర్



'టాలీవుడ్‌లో తొలి సినిమానే ఎన్టీఆర్ లాంటి స్టార్ హీరోతో కలిసి నటించే అవకాశం రావటం నా అదృష్టం. ఆయన చాలా ఎనర్జిటిక్‌గా ఉంటాడు. సెట్‌లోకి వస్తే అందరితో ఉత్సాహంగా ఉంటారు. ఇటీవల మా ఇద్దరిపై ఓ పాటను చిత్రీకరించారు. ఎన్టీఆర్ డ్యాన్స్‌తో ఇరగదీశారు. ఆయన వేసే స్టెప్పులు చూసి ఆశ్చర్యపోయాను. ఏదైనా నేర్చుకోవడానికి ఎన్టీఆర్‌కు ఒక సెకను చాలు. అదే విషయాన్ని నేను నేర్చుకోవాలంటే కనీసం 10 రోజుల సమయం పడుతుంది. ప్రస్తుతం 'దేవర'లోని రెండోపాట కోసం ప్రాక్టీస్ చేస్తున్నా. తెలుగువారితో కలిసి పనిచేయటం ఆనందంగా ఉంది. వారు కళను, సినిమాను గౌరవిస్తారు. హుందాగా ప్రవర్తిస్తారు' అని బాలీవుడ్ హీరోయిన్ జాన్వీకపూర్ అన్నారు. ఆమె నటించిన తాజా చిత్రం 'ఉలజ్' విడుదలకు సిద్ధమైన విషయం తెలిసిందే. సుధాంశు సరియా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో జాన్వీ కపూర్ ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారిణిగా కనిపించనున్నారు. ఆగస్టు 2న ఈ సినిమా విడుదల కానుంది.

కెసిఆర్ డైలాగ్‌ను మంచిగానే పెట్టాం : మణిశర్మ



హీరో రామ్ పోతినేని ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్‌గా ఈ మూవీని పూరీ జగన్నాథ్ చేస్తున్నారు. ఇటీవల ఈ మూవీ నుంచి 'మార్ ముంత... చోడ్ చింత' అనే రిలిక్‌తో పాట విడుదలైంది. అందులో తెలంగాణా మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ వాయిస్‌ను ఉపయోగించారు. 'ఏం జేద్దామంటవు మరి? ఫ ..' అనే డైలాగ్‌ను యథాతథంగా వాడారు. దీన్ని బిఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా విమర్శించాయి. ఇలాంటి మందు పాటలో కేసీఆర్ డైలాగ్ ఎలా వాడతారని మండిపడ్డారు. ఈ వివాదంపై సంగీత దర్శకుడు మణిశర్మ వివరణ ఇచ్చారు. 'కేసీఆర్ గొప్ప వ్యక్తి. ఆయన మనందరి ఫేవరెట్. ఆయన్ను చాలా మీమ్స్‌లో చూస్తుంటాం. అలా మీమ్స్ నుంచి ఆ డైలాగ్ తీసి వాడాం. ఎంజాయ్.. పండుగ అనేది కూడా మీమ్స్ నుంచి తీసిన డైలాగే. ఈ అల్టిమేట్ సాంగ్‌లో కేసీఆర్ డైలాగ్ పెడితే బాగుంటుందనుకున్నాం. అంతే తప్ప ఆయన్ను కించపర్చాలని కాదు. కేవలం ఎంటర్‌టైన్‌మెంట్ కోసమే చేశాం. దయచేసి దీన్ని తప్పుగా తీసుకోకండి. పైగా ఇది ఐటెం సాంగ్ కాదు. హీరోహీరోయిన్లు చేసే డ్యూయట్ సాంగ్' అని వివరణ ఇచ్చారు. ఈ సినిమా ఆగస్టు 15న విడుదల కానుంది.

'కమిటీ కుర్రోళ్లు' ట్రైలర్ విడుదల



నిహారిక కొణిదెల సమర్పణలో ఎల్‌ఎల్‌పి, శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందించిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. యదు వంశీ దర్శకత్వంలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించారు. ఆగస్టు 9న ఈ సినిమా విడుదల కానుంది. చిత్ర మేకర్లు ట్రైలర్‌ను శుక్రవారంనాడు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రం ద్వారా 11 మంది హీరోలు, నలుగురు హీరోయిన్లు పరిచయం అయ్యారు. ఈ చిత్రంలో ఎక్కువగా కొత్త నటులు కనిపించినా వారు నటించిన తీరు చూస్తే ప్రేక్షకులు ఫిదా అవుతారు. ట్రైలర్‌లో ఎక్కువగా స్నేహం, భావోద్వేగాలు, ప్రేమ, పల్లెటూరిలోని రాజకీయాలు, యువత పడే సంఘర్షణలన్నింటినీ చక్కగా చూపించారు. చూపించారు. ప్రతి గ్రామంలో ఇలాంటి 'కమిటీ కుర్రోళ్లు' తప్పకుండా ఉంటారు అనేలా ట్రైలర్ ఉంది.



క్రికెట్ అభివద్ధిలో జర్నలిస్టుల కృషి ఎనలేనిది

- ఎసిఎ మాజీ సిఎసి ఛైర్మన్ సత్యప్రసాద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో క్రికెట్‌కు విశేష ఆదరణ లభించడానికి, ఇంతలా అభివద్ధి కావడానికి జర్నలిస్టులు చేసిన కృషి ఎనలేనిదని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మాజీ సిఎసి ఛైర్మన్ సత్యప్రసాద్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం విజయానంద్ మైదానంలో జరిగిన కెఎస్‌సి జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ సెమీఫైనల్స్ ప్రారంభానికి సత్యప్రసాద్, లైఫ్‌స్పాన్ స్పోర్ట్స్ హెడ్ భరణి ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక నైపుణ్యం గల ప్లేయర్‌ను పైకి తీసుకురావడంలో జర్నలిస్టులు పడే తాపత్రయం, శ్రద్ధను ప్రశంసించారు. అనంతరం టాస్ వేసి, ఇరు జట్ల ప్లేయర్లకు శుభాకాంక్షలు తెలిపారు.

ఒక శాతం మంది వద్దే 42 ట్రిలియన్ డాలర్ల సంపద

ఆక్స్‌ఫామ్ తాజా విశ్లేషణ

న్యూఢిల్లీ : సంపదలో చోటుచేసుకుంటున్న అసమానతలను ఆక్స్‌ఫామ్ తాజా విశ్లేషణ బహిర్గతం చేసింది. గత దశాబ్ద కాలంలో ప్రపంచంలోని అత్యంత సంపన్నులైన ఒక శాతం వ్యక్తులు 42 ట్రిలియన్ డాలర్ల సంపదను పోగేసుకున్నారని ఆక్స్‌ఫామ్ తెలిపింది. ప్రపంచ జనాభాలో అత్యంత నిరుపేదలైన యాభై శాతం మంది సంపదతో పోలిస్తే ఇది సుమారు 34 రెట్లు అధికం. బ్రెజిల్‌లోని రియో డీజెనీరోలో జి-20 దేశాల ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకుల గవర్నర్ల సమావేశం కావడానికి ముందు ఈ నివేదిక విడుదలైంది. పది సంవత్సరాల క్రితం ప్రపంచ జనాభాలో అత్యంత ధనవంతులైన ఒక శాతం వ్యక్తుల సంపద కేవలం 335 డాలర్లు మాత్రమే ఉంది. అది ఇప్పుడు దాదాపు నాలుగు లక్షల డాలర్లకు పెరిగింది.

నల్ల ఇసుకను కొల్లగొట్టేశారు

ప్రజాశక్తి-పూసపాటిరేగ(విజయనగరం జిల్లా)

తుపాను సమయంలో సముద్రం ఆటుపోట్లకు గురవుతూ అల్లకల్లోలంగా మారుతుంది. ఆ సమయంలో నల్లని ఇసుక రేణువుల్ని తెచ్చి ఒడ్డున పడేస్తుంది. ఇసుకే కదా.. రంగు మారిందని పొరపాటు పడుతున్నాం. ప్రకృతి ప్రసాదిస్తున్న అతివిలువైన ఖనిజ సంపదని గుర్తించలేకపోతున్నాం. దాని విలువ రూ.లక్షల్లో ఉంటుందని ఊహించలేకపోతున్నాం. శ్రీకాకుళం, విజయనగరం తీరంలో కొన్ని చోట్ల మాత్రమే దొరికే ఈ నల్ల బంగారం.. గత కొంతకాలంగా అడ్డదారిలో రాష్ట్రాలు దాటిపోతోంది. అక్రమార్కులు కాపుకాసి రాత్రిపూట గుట్టుచప్పుడు కాకుండా కొల్లగొడుతున్నారు. కోట్లాది రూపాయల విలువైన సంపద అక్రమార్కుల జేబుల్లోకి చేరుతోంది. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని తీరప్రాంత వాసులు కోరుతున్నారు. విజయనగరం జిల్లా భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలో సముద్ర తీరాన నల్ల ఇసుక అతి విలువైన ఖనిజ సంపదనే చెప్పాలి. ఎందుకంటే? లారీ ఇసుక విలువ రూ.2 లక్షలుపైమాటే. ఇది వినడానికి నమ్మశక్యం కాకున్నా, ఆ నల్ల ఇసుక నుంచి వచ్చే ఖనిజాల గురించి తెలిస్తే నమ్మితీరాల్సిందేనని ఖనిజ నిపుణులు చెబుతున్నారు. ఇలిమిలైజ్, సిలిమినైట్, రుటైల్, జిర్గాన్, గార్నైట్, మోనలైజ్ వంటి విలువైన ఖనిజాలు అందులో లభ్యమవుతాయి. ఇందులో కొన్ని రకాల రేణువులు అణు విద్యుత్తు, అణుబాంబులకు ఉపయోగిస్తారని చెబుతున్నారు. కంప్యూటర్లలో వినియోగించే సిలికాన్ చిప్‌లు, స్మార్ట్‌ఫోన్ల పరికరాల తయారీకి ఉపయోగిస్తున్నారు.

మహిళలపై దాడులను అరికట్టాలి

- చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

మహిళలపై దాడులను అరికట్టాలని, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. 'మహిళలపై జరుగుతున్న దాడులు - తీసుకోవాల్సిన చర్యలు' అనే అంశంపై ప్రతిభ ఒకేషనల్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం సెమినార్ నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా అధ్యక్షత జరిగిన ఈ సెమినార్‌లో ప్రసన్నకుమార్ మాట్లాడుతూ దేశంలో ప్రతి నాలుగు నిమిషాలకు మహిళలపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. నెల రోజుల్లో బాలికలపై జరిగిన అత్యాచారాలు బాధాకరమన్నారు. ఈ నెలలోనే ఇలాంటి ఘటనలు 14 బయటకు వచ్చాయన్నారు. నంద్యాల జిల్లా ఘటనతో ఇతర ఘటనలు బయటకు వచ్చాయని తెలిపారు. బయటపడని ఎన్నో ఘటనలున్నాయన్నారు. విజయనగరంలో ఆరు నెలల పసికందుపై జరిగిన దాడి కలిచివేసిందని తెలిపారు. ప్రభుత్వాలు ఘటన జరిగిన సందర్భాల్లో హడావుడిగా చట్టాలను తీసుకొచ్చి చేతులు దులిపేసుకుంటున్నాయని విమర్శించారు. ఘటనలను నివారించే చర్యలు మాత్రం తీసుకోవట్లేదన్నారు. ఉన్న చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని, మద్యం, మత్తుపదార్థాల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పురుషాధిక్య భావజాలాన్ని విడనాడి అసమానతలు లేని సమాజం కోసం కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఐద్వా జిల్లా కార్యదర్శి పి.తులసీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులకు వస్త్రధారణ కారణం కాదన్నారు. అదే అనుకుంటే ఆరు నెలల పసికందు ఏ విధంగా వస్త్రధారణతో కనపడిందని ప్రశ్నించారు. ఇటీవల కాలంలో వస్తున్న సినిమాలు, యాడ్స్, ఇతర మాధ్యమాల్లో మహిళలను వస్తువుగా చూపిస్తున్నారన్నారు. అటువంటి వాటిని బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. పాఠ్యపుస్తకాల ద్వారా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి వాటిపై అవగాహన పెంచాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీలో మనుస్మృతిని పాఠ్యాంశంగా తీసుకురావడం దారుణమన్నారు. మహిళలు ఇంటికే పరిమితం అవ్వాలని చెప్పే మనుస్మృతిని కోర్సుగా తీసుకురావడమంటే కేంద్ర ప్రభుత్వం మహిళల పట్ల ఎలాంటి అభిప్రాయాన్ని కలిగి ఉందో స్పష్టం అవుతుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం భేటీ పడావో - భేటీ బచావో అని మాటల్లో చెప్పడం కాదు... మహిళలపై నిజంగా నిబద్ధత ఉంటే పోర్న్ సైటులను బ్యాన్ చేయించాలన్నారు. చట్టాలను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సంజీవరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వై.భాస్కర్, కమిటీ సభ్యులు సురేష్, ఐద్వా జిల్లా అధ్యక్షులు రజీనా, సీనియర్ నాయకులు సావిత్రి, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక రంగాలకు రిక్తహస్తం

- బడ్జెట్ కేటాయింపుల్లో కోతలే కోతలు
- పేదల సంక్షేమానికి తూట్లు
- రైతన్న నెత్తిన శఠగోపం

న్యూఢిల్లీ : ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో వ్యయానికి సంబంధించిన గణాంకాలు పలు పత్రికల పతాక శీర్షికల్లో కన్పించాయి. అయితే ఇందులో దేశంలోని పేదల కోసం చేసిన కేటాయింపులను పరిశీలిస్తే మాత్రం ఆశాభంగం చెందక తప్పదు. అనేక అణగారిన సమాజాలు ఆధారపడుతున్న పథకాలు, అత్యవసర కార్యక్రమాలకు కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తగ్గిపోయింది. ఇక్కడ గమనించాల్సిన మరో ముఖ్యమైన విషయమేమంటే అట్టడుగు వర్గాల వారు ఏ వ్యవస్థలపై ఆధారపడి జీవిస్తున్నారో ఆ వ్యవస్థలను బలహీనపరిచే ప్రమాదం కూడా కన్పిస్తోంది.

అన్నీ కోతలే

ఇటీవలి సంవత్సరాల్లో ప్రభుత్వం చేస్తున్న మొత్తం ఖర్చులో సామాజిక రంగాల పద్దుల వాటా క్రమేపీ తగ్గిపోతోంది. కొన్ని పద్దులు చిక్కిపోగా మరికొన్నింటిలో పెరుగుదల కన్పించడం లేదు. కొన్ని పద్దులు మాత్రం స్వల్పంగా పెరిగాయి. 2015-16తో పోలిస్తే భారీగా కోత పడిన పద్దుల్లో ఆహార సబ్సిడీ, సాంఘిక సంక్షేమం, విద్య, ఆరోగ్యం, ఎరువుల సబ్సిడీ ఉన్నాయి. ఉదాహరణకు 2015-16లో ఆహార సబ్సిడీకి బడ్జెట్‌లో 7.79 శాతం కేటాయించగా 2024-25 బడ్జెట్ అంచనాల్లో అది 4.26 శాతానికి తగ్గిపోయింది. అదే విధంగా సాంఘిక సంక్షేమానికి కేటాయింపులు 1.7 శాతం నుండి 1.1 శాతం, విద్యకు 3.75 శాతం నుండి 2.61 శాతం, ఆరోగ్యానికి 1.91 శాతం నుండి 1.85 శాతం, ఎరువుల సబ్సిడీకి 4.04 శాతం నుండి 3.4 శాతానికి తగ్గిపోయాయి. పెన్షన్ పద్దుకు కేటాయింపు మాత్రం ఎదుగూ బొదుగూ లేకుండా బడ్జెట్ వ్యయంలో 5.05 శాతంగానే ఉండిపోయింది. దీనికి భిన్నంగా వ్యవసాయం, అనుబంధ రంగాలకు కేటాయింపులు 1.3 శాతం నుండి 3.1, గ్రామీణాభివృద్ధికి 5.04 శాతం నుండి 5.5 శాతానికి పెరిగాయి.

ఏ రంగానికైనా తగ్గుదలే

ఒకప్పుడు గ్రామీణ జనాభాకు ఉపాధి హామీ పథకం మూలస్తంభంగా ఉండేది. 2015-16 బడ్జెట్‌లో దీనికి 2.09 శాతం నిధులు కేటాయించగా, 2024-25 బడ్జెట్ అంచనాల్లో అది కేవలం 1.78 శాతంగానే ఉంది. ఇక వృద్ధాప్య పెన్షన్ పథకం, ఇందిరాగాంధీ జాతీయ వికలాంగ పెన్షన్ పథకం, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం, అన్నపూర్ణతో కూడిన జాతీయ సామాజిక సహాయ కార్యక్రమానికి (ఎన్ఎస్ఏపీ) కూడా కేటాయింపులు 0.48 శాతం నుండి 0.20 శాతానికి తగ్గిపోయాయి. ఎస్ఎస్ఎ, ఆర్ఎంఎస్ఎ, ఉపాధ్యాయ విద్యతో కూడిన సమగ్ర శిక్షా అభియాన్ కార్యక్రమానికి కేటాయింపులు 1.46 శాతం నుండి 0.78 శాతానికి పడిపోయాయి.

అన్నదాతకు లభించని ఆసరా

మధ్యాహ్న భోజన పథకం స్థానంలో తీసుకొచ్చిన పీఎం పోషణ్ కార్యక్రమానికి 2015-16 బడ్జెట్‌లో 0.51 శాతం నిధులు కేటాయించగా 2024-25 బడ్జెట్ అంచనాల్లో అది 0.26 శాతానికి తగ్గింది. రైతులకు సబ్సిడీపై ఎరువులు అందించేందుకు ఉద్దేశించిన పథకానికి కేటాయింపులు 1.23 శాతం నుండి 0.93 శాతానికి, అన్నదాతకు ఎంతో కీలకమైన యూరియా సబ్సిడీని 2.82 శాతం నుండి 2.47 శాతానికి తగ్గించారు. అయితే దేశంలో రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్న నేపథ్యంలో వారికి ఆర్థికంగా భద్రత కల్పించే విషయంలో చేదోడువాదోడుగా నిలుస్తున్న పంటల బీమా పథకానికి కేటాయింపులను మాత్రం స్వల్పంగా 0.17 శాతం నుండి 0.30 శాతానికి పెంచారు. రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు 2019లో ప్రారంభించిన పీఎం కిసాన్ కార్యక్రమానికి 2019-20లో 1.8 శాతం బడ్జెట్ కేటాయింపులు జరపగా, 2024-25లో 1.2 శాతం మాత్రమే కేటాయించారు.

ఆరోగ్యం, ఉపాధి కల్పనకు కూడా...

ఆరోగ్య రక్షణకు ఉద్దేశించిన ప్రధానమంత్రి స్వాస్త్య యోజన పథకానికి కూడా కేటాయింపులు 0.09 శాతం నుండి 0.05 శాతానికి తగ్గాయి. దేశంలో నిరుద్యోగ రేటు పెరుగుతున్నప్పటికీ ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమానికి బడ్జెట్ కేటాయింపులను 0.07 శాతం నుండి 0.05 శాతానికి కుదించారు. ప్రధాని మాత్రం లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించామని చెప్పుకుంటున్నారు.

861 అడుగులకు శ్రీశైలం నీటిమట్టం

ప్రజాశక్తి- శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయం 861 అడుగుల నీటిమట్టానికి చేరంది. కృష్ణా పరివాహక ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో శ్రీశైలం జలాశయానికి శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువ జూరాల నుంచి 2,50,783 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 7,286 క్యూసెక్కులు మొత్తం కలిపి 2,58,069 క్యూసెక్కుల నీరు వస్తున్నాయి. అదే సమయానికి జలాశయ నీటిమట్టం 861 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 109.0060 టిఎంసిలుగా నమోదయింది. అలాగే తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో గడచిన 24 గంటల్లో 36,243 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 17.768 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేశారు.

మైనారిటీలే టార్గెట్

- ఆహారపదార్థాల పేరుతో యుపిలో మత రాజకీయం
- రెస్టారెంట్ యజమానుల పేర్లు తెలియజేయాలంటూ ఆదేశాలు

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లో యోగి సర్కారు అనుసరిస్తున్న మత రాజకీయాలు అక్కడి మైనారిటీ వర్గాల పట్ల తీవ్ర నష్టాన్ని తీసుకొస్తున్నాయి. ఒక వర్గం వారే లక్ష్యంగా యోగి సర్కారు వ్యవహరిస్తున్నది. ఆహార, ఇతర తినుబండారాలను తయారు చేసే రోడ్డు పక్కన ఉండే రెస్టారెంట్ యజమానులు, సిబ్బంది పేర్లను బహిర్గతం చేయాలంటూ ముజఫర్‌నగర్ జిల్లా యంత్రాంగం ఆదేశించింది. దీంతో ఇది అక్కడి 'ఆ వర్గం' రెస్టారెంట్, హొటళ్ల యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నదని కొందరు విశ్లేషకులు చెప్తున్నారు. ఈ నెల ప్రారంభంలో జిల్లా యంత్రాంగం జారీ చేసిన వివాదాస్పద ఉత్తర్వును అనుసరించి.. ఒకేసారి 100 మంది కూర్చునే సౌకర్యం కలిగి ఉండి, అన్ని మతాల ప్రజలకు శాఖాహారం అందించే రెస్టారెంట్‌కు దాని యజమాని, సిబ్బంది పేర్లను ప్రదర్శించాలని ఒత్తిడి వచ్చింది. ఇలాంటి ఆదేశాలు తమ వంటి వారికి కొంత అభ్యంతరకరంగా మారాయని కొందరు రెస్టారెంట్, హోటల్ యజమానులు వాపోతున్నారు.

ముజఫర్‌నగర్‌లోని పోలీసులు శ్రావణ మాసంలో లక్షలాది మంది యాత్రికులు గంగా నది వెంబడి నడుస్తున్న తరుణంలో హిందూ భక్తులు ఏ ఆహార దుకాణాలను వద్దనుకోవాలో నిర్ణయించుకోవటంలో సహాయపడటానికి రెస్టారెంట్లు, రోడ్డు పక్కన వ్యాపారులు తమ పేర్లను ప్రముఖంగా ప్రదర్శించాలని ఈనెల 2న ఆదేశించారు. రెండు వారాల పాటు జరిగే ఈ యాత్ర జులై 22న ప్రారంభమై ఆగస్టు 6న ముగుస్తుంది. ఈ యాత్రలో ఎక్కువ మంది భక్తులు మాంసం, చేపలు తినరు. అయితే ఆ మైనారిటీ వర్గం యాజమాన్యంలోని తినుబండారాలు, ఇతర ఆహార పదార్థాలను తీసుకోకుండా యాత్రికులను ఆపేందుకు యోగి సర్కారు ఆదేశాలతో జిల్లా యంత్రాంగం ఈ చర్య తీసుకున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పొరుగున ఉన్న ఉత్తరాఖండ్‌లో కూడా పోలీసులు ఇలాంటి ఆదేశాలే జారీ చేశారు. అయితే, ఈ రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఒక వర్గం వారిని కావాలనే లక్ష్యంగా చేసుకొని ఈ విధంగా వ్యవహరిస్తున్నదని కొందరు సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండు రాష్ట్రాలల్లో ఇలాంటి వివక్షాపూరిత విధానాలు తీవ్రమయ్యాయని అంటున్నారు. "నా రెస్టారెంట్‌కి మా నాన్న పేరు పెట్టాను. నా పేరు లేదా నా తండ్రి పేరు మనం క్రిస్టియన్, ముస్లిం లేదా హిందువా అని సూచించదు. అయితే, మా మతం గుర్తింపు తెలిపేలా పేర్లు పెట్టాలని నాపై ఒత్తిడి వచ్చింది" అని ఒక రెస్టారెంట్ యజమాని తన ఆవేదనను వ్యక్తం చేశాడు. తన రెస్టారెంట్‌లో 15 మంది సిబ్బంది ఉన్నారనీ, వారిలో ఇద్దరు మాత్రమే మైనారిటీ వర్గం వారు ఉన్నారని ఆ యజమాని అన్నాడు. "నేను వారి పేర్లను ప్రదర్శించను. వారి మతాలను వెల్లడించను. ఇది నా సూత్రాలకు విరుద్ధం. అలా చేయటం ప్రమాదకరం. ఎందుకంటే నా మత గుర్తింపు నాకు, నా సిబ్బందికి ముప్పుగా మారవచ్చు" అని ఆవేదనను వ్యక్తం చేశాడు.

ఇప్పటి వరకు ఈ అంశంలో సుప్రీంకోర్టు స్టే విధించినా.. అత్యున్నత న్యాయస్థానం మళ్లీ విచారణను జరపనున్నది. ఈ తరుణంలో రెండు బిజెపి పాలిత రాష్ట్రాల్లో వివాదాస్పద పోలీసు ఆదేశాలను సమర్థించేలా ప్రభుత్వాలు వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యాయి. ఒకవేళ కోర్టు తీర్పు వ్యతిరేకంగా వచ్చినా.. ఆ రెండు రాష్ట్రాల్లోని బిజెపి ప్రభుత్వాలు ఆర్డినెన్సును తీసుకురావాలనే ప్రత్యామ్నాయ ఆలోచనను చేస్తున్నట్టు తెలిపాయి.

వివిధ దశల్లో 219 ప్రతిపాదనలు

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా హైకోర్టు జడ్జిల నియామకానికి సంబంధించి 219 ప్రతిపాదనలు వివిధ దశల్లో ఉన్నాయని ప్రభుత్వం శుక్రవారం తెలిపింది. రాజ్యసభ సభ్యులు హరీస్ బీరన్ లేవనెత్తిన ప్రశ్నకు న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ సమాధానమిచ్చారు. జులై 19 నాటికి సుప్రీంకోర్టు కొలీజియం (ఎస్‌సిసి) సలహా కోసం ప్రభుత్వం పంపిన 90 ప్రతిపాదనలలో 82 ప్రాసెస్ చేసిందని అన్నారు. ఇటీవల స్వీకరించిన 129 తాజా ప్రతిపాదనలు ఎస్‌సిసి సలహా మేరకు ప్రాసెస్ చేస్తున్నామని చెప్పారు. మిగిలిన 138 ఖాళీలపై హైకోర్టులు ఇంకా సిఫారసులు పంపలేదు. వివిధ హైకోర్టుల్లో మొత్తం 1,114 మంది న్యాయమూర్తులను మంజూరు చేయగా, 757 మంది పని చేస్తున్నారు, 357 మంది ఖాళీగా ఉన్నారని తెలిపారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు న్యాయమూర్తుల ఖాళీని భర్తీ చేయడానికి ఆరు నెలల ముందు ప్రతిపాదనలు పంపాల్సి వుంటుందని, కానీ ఈ టైమ్‌లైన్‌ను హైకోర్టులు పాటించవని ఆరోపించారు.

కమలా హారిస్‌కే ఒబామా దంపతుల మద్దతు



వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాటిక్ అభ్యర్థిగా కమలాహారిస్‌ను బరాక్ ఒబామా దంపతులు ఆమోదించారు. ఈ విషయాన్ని కమలాహారిస్‌కు ఫోన్ ద్వారా ఒబామా దంపతులు శుక్రవారం తెలిపారు. దీంతో డెమోక్రాటిక్ అభ్యర్థిగా కమలాహారిస్ అధ్యక్ష బరిలోకి కమలాహారిస్ దిగడం దాదాపు ఖాయమైనట్లే. బరిలో నుంచి జో బైడెన్ తప్పుకున్న తరువాత కమలాహారిస్‌కు మద్దతు ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా కమలాహారిస్ అభ్యర్థిత్వానికి డెమొక్రాట్లలో అత్యంత ప్రజాదరణ, కీలకమైన నేతలుగా పేరున్న మాజీ అధ్యక్షులు బరాక్ ఒబామా, మాజీ ప్రథమ మహిళ మిచెల్ ఒబామా కూడా మద్దతు ప్రకటించారు. దీంతో నవంబర్‌లో జరిగే ఎన్నికల్లో ట్రంప్‌ను కమలాహారిస్ ఢీకొనడం ఖాయమైనట్లే అని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతాం

- దశలవారీ బకాయిల చెల్లింపులు
- శాసనమండలిలో మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో గాడి తప్పిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. 2019-24 మధ్య జరిగిన ఆర్థిక అవకతవకలపై శుక్రవారం ఆయన శాసనమండలిలో ప్రకటన చేశారు. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.ఆరు లక్షల కోట్ల అప్పులు చేసిందని పేర్కొన్నారు. ఇప్పటికిప్పుడు వివిధ రంగాలలో ప్రభుత్వం రూ.1.45 లక్షల కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని మంత్రి తెలిపారు. నిధులు ఎక్కడి నుంచి తెచ్చి బకాయిలు చెల్లించాలో అధ్యయనం చేస్తున్నామన్నారు. అమరావతిని నిర్మించకపోవడం వల్ల ఏటా రూ.2 లక్షల కోట్లు ఆదాయాన్ని నష్టపోయామన్నారు. పోలవరం నిర్మించకపోవడంతో సంపద పెరగలేదన్నారు. ప్రభుత్వ భవనాలు, చారిత్రక కట్టడాలు, భూములు, కార్యాలయాలు ఏది కనబడితే దానిని తాకట్టుపెట్టి అప్పులు తెచ్చారని ఆరోపించారు. నీటిపారుదల రంగంలో రూ.47,830 కోట్లు కేటాయించగా, చేసిన ఖర్చు రూ.20 వేల కోట్లు, ఆర్అండ్‌బి శాఖకు రూ.8,869 కోట్లు కేటాయించగా, రూ.1300 కోట్లు ఖర్చు చేశారన్నారు. ఉద్యోగులకు రూ.21 వేల కోట్ల అప్పులు ఉన్నాయన్నారు. ఇప్పటికిప్పుడు ప్రభుత్వం సక్రమంగా పనిచేయాలంటే కనీసం రూ.లక్ష కోట్లు కావాలన్నారు. దశలవారీ బకాయిలు చెల్లింపులకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంత అప్పు చేసినా వైసిపి ప్రభుత్వం రూ.19,107 కోట్ల లోటు బడ్జెట్‌తో అధికారం నుంచి తప్పుకుందన్నారు. వివిధ శాఖల నుంచి నిధులను ఇష్టారాజ్యంగా ఫైనాన్స్ కార్పొరేషన్‌కు మళ్లించారని తెలిపారు. ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన నిధులను పంచాయతీలకు బదిలీ చేయకుండా దారిమళ్లించారని విమర్శించారు. ఉద్యోగుల పింఛన్ల, జిపిఎఫ్ నిధుల కూడా ఇతర శాఖలకు బదలాయించి కోర్టుకు కూడా తప్పుడు [illegible] ఘనత గత వైసిపి సర్కారుకు చెల్లిందన్నారు.

రూ.3 లక్షల కోట్లు ఏమయ్యాయి?

గత ప్రభుత్వం సంక్షేమ పథకాలకు దాదాపు రూ.3 లక్షల కోట్లు బటన్ నొక్కి డిబిటి ద్వారా లబ్దిదారుల ఖాతాల్లో జమ చేసినదని, మిగతా రూ.3 లక్షల కోట్లు [illegible] పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులు కూడా దారిమళ్లించారని తెలిపారు. జిపిఎఫ్, జిఎల్ఐ నిధులను కూడా ఇతర శాఖలకు వినియోగించారన్నారు.

గత పదేళ్లుగా రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నడవాలంటే రూ.1.45 లక్షల కోట్లు కావాలని ఉన్నందున కేంద్ర సాయాన్ని కోరాలన్నారు. కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా వెనుకబడిన జిల్లాలకు ఇస్తామన్న రూ.400 కోట్లతో సంప్రదింపులకు బుందేల్ ఖండ్ ప్యాకేజీ కోరాలన్నారు. ప్రస్తుత కేంద్రంలోని ఎన్‌డిఎలో టిడిపి కీలక భాగస్వామి కనుక ఈ విధంగా తగిన ఒత్తిడి తెస్తే ఏడాదికి రూ.21 వేల కోట్లు వస్తాయన్నారు. ఈ అంశంపై చర్చలో ఎమ్మెల్సీ వెంపాడ చిరంజీవిరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం రిజర్వు బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా అప్పులు చేసిందన్నారు. ఈ చర్చ అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు ఛైర్మన్ మోషేనురాజు తెలిపారు.

వాల్తేరు డివిజన్‌లో రైళ్ల రీషెడ్యూల్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

వాల్తేరు డివిజన్‌లో పుండి - నౌపడ విభాగంలో భద్రత, ఆధునికీకరణ పనుల కారణంగా జూలై 29, ఆగస్ట్ 1, 3 తేదీలలో పలు రైళ్లను రీషెడ్యూల్, షార్ట్ టర్మినేట్ చేశారు. రైలు నెంబర్ 12830 భువనేశ్వర్ - ఎంజిఆర్ చెన్నయ్ సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 1న సాధారణ షెడ్యూల్ సమయం 12:10 గంటలకు బదులు గంట ఆలస్యంగా 13.10 గంటలకు రానుంది. 22974 పూరీ - గాంధీధామ్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 3వ తేదీన సాదారణ షెడ్యూల్ సమయం 11:15 గంటలకు బదులు గంటా 30 నిమిషాలు ఆలస్యంగా 12:45 గంటలకు రీషెడ్యూల్ చేయబడింది. 22879 భువనేశ్వర్ - తిరుపతి ఎక్స్‌ప్రెస్ 3వ తేదీన సాధారణ షెడ్యూల్ సమయం 12:10 గంటలకు బదులు గంట ఆలస్యంగా 13.10 గంటలకు రీషెడ్యూల్ అయింది.

మరో గల్ఫ్ బాధితురాలి ఆక్రందన

స్వదేశానికి రప్పించాలంటూ మత్స్యపురి వాసి వీడియో సందేశం

ప్రజాశక్తి - వీరవాసరం (పశ్చిమగోదావరి జిల్లా)

గల్ఫ్ బాధితుల కన్నీటి కథలు ఒకొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం మత్స్యపురికి చెందిన మహిళ ఒక వీడియో విడుదల చేయడం చర్చనీయాంశమైంది. సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్‌ను ఉద్దేశించి విడుదల చేసిన ఈ వీడియోలో తనను రక్షించాలని కోరారు. వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామానికి చెందిన బొక్కా జ్యోతి సంవత్సరం క్రితం మస్కట్‌కు ఉపాధి నిమిత్తం వెళ్లారు. ఆమె భర్త బొక్కా ప్రియస్వామి నరసాపురంలో ఒక హోటల్‌లో పని చేస్తున్నారు. బాధితురాలి భర్త తెలిపిన వివరాల ప్రకారం తన భార్య వెళ్లిన మూడో నెల నుండి ఆమె పని చేస్తున్న ఇంటి యజమానులు వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ విషయం పాలకొల్లులోని ఏజెంట్ అల్లూరి రవికి తెలిపినా పట్టించుకోలేదు. ఇదే విషయాన్ని ఈ నెల ఒకటో తేదీన ప్రియస్వామి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎటువంటి స్పందనా లేదని వాపోయాడు. తన భార్య జ్యోతి తల్లి ఊర్మిళ ఈ విషయం తెలిసి మనస్తాపంతో అనారోగ్యం పాలైందన్నారు. తన భార్యను ఇండియాకు రప్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని కోరాడు. జ్యోతి తన వీడియో సందేశంలో పేర్కొన్నారు.

మడ అడవుల విధ్వంసంపై కఠిన చర్యలు

- ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తీర ప్రాంత పరిరక్షణలో కీలకంగా ఉన్న మడ అడవులను విధ్వంసం చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవం సందర్భంగా మంగళగిరిలోని అటవీశాఖ కార్యాలయంలో మడఅడవుల రక్షణ, విస్తీర్ణంపై అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు మడ అడవుల పరిరక్షణకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణపై తనకు ప్రత్యేకమై ఆసక్తి ఉండటం వల్లే అటవీశాఖను ఎంచుకున్నానని చెప్పారు. నరికివేత, ఆక్వాకల్చర్ చేయడం, పట్టణీకరణ వంటి అంశాలతో ఈ అడవులకు ముప్పు పొంచి ఉందన్నారు.

కుంకీ ఏనుగులపై కర్ణాటకతో చర్చిస్తాం

కుంకీ ఏనుగుల కోసం కర్ణాటక ప్రభుత్వంతో తాను చర్చిస్తానని పవన్ కళ్యాన్ అన్నారు. చిత్తూరు, పార్వతీపురం జిల్లాల రైతులు, ప్రజలు ఏనుగుల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయమై అధికారులతో ఆయన మాట్లాడారు. పొలాల్లోకి, నివాస ప్రాంతాల్లోకి వచ్చే ఏనుగుల గుంపును తిరిగి అడవుల్లోకి పంపించేందుకు రాష్ట్ర అటవీశాఖ వద్ద కుంకీ ఏనుగుల కొరత ఉందని అధికారులు పవన్‌కు వివరించారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగులు తీసుకొచ్చేందుకు కృషి చేద్దామని పవన్ అన్నారు. ఈ సమావేశంలో అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి అనంతరాము, అటవీశాఖ దళపతి చిరంజీవి చౌదరి, వైల్డ్‌లైఫ్ చీఫ్ ఎకె నాయక్, అటవీ శాఖ ప్రత్యేక కార్యదర్శి శరవణన్ పాల్గొన్నారు.

కుప్పంలో ఐఎఎస్ కోచింగ్ సెంటర్‌కు ప్రణాళికలు

- స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం
- కుప్పంలో ముగిసిన నారా భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి - కుప్పం టౌన్

హైదరాబాద్ తరహాలో ఉచిత ఐఎఎస్ కోచింగ్ సెంటర్‌ను కుప్పంలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని సిఎం సతీమణి భువనేశ్వరి తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. మహిళల సంక్షేమం, ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా ఎన్‌టిఆర్ ట్రస్టు ముందుకు సాగుతుందని తెలిపారు. విలేకరులతో భువనేశ్వరి మాట్లాడుతూ.. మహిళా సంక్షేమమే ధ్యేయంగా ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. కేవలం కుట్టు శిక్షణకే పరిమితం కాకుండా బట్టల ఫ్యాక్టరీల వారితో చర్చించి, వారికి అవసరమైన రీతిలో బట్టలు తయారు చేసే విధంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో ఎన్‌టిఆర్ ట్రస్టు ద్వారా స్కూలు ఏర్పాటు చేసి, పేద పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నారు. ఉచితంగా డిఎస్‌సి కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

- దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్
- గుంతకల్లు, డోన్, కర్నూలు సిటీ సెక్షన్లలో తనిఖీ

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ అన్నారు. శుక్రవారం ఆయన గుంతకల్లు-ధోన్, కర్నూలు సిటీ సెక్షన్‌లను తనిఖీ చేశారు. ఆయనతో పాటు ఈ తనిఖీలో గుంతకల్లు డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.విజయ్ కుమార్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో డివిజన్ పనితీరుపై జనరల్ మేనేజర్ సమగ్ర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వివిధ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించి, ప్రస్తుతం కొనసాగుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సమీక్షానంతరం ఆయన గుంతకల్లులో నూతనంగా నిర్మించిన డివిజనల్ ఆపరేషన్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ భవనం అత్యంత ఆధునికతో, పర్యావరణహితంగా నిర్మించారు. ఇందులో ఈ రైలు కార్యకలాపాలను సజావుగా నిర్వహహించడానికి 24/7 పర్యవేక్షించడానికి వీలు ఉంటుందన్నారు. గుంతకల్లు నుండి డోన్ సెక్షన్ వరకు రియర్ విండో తనిఖీని నిర్వహించారు. ఈ తనిఖీలో ట్రాక్‌లు, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల నిర్వహణకు సంబంధించిన భద్రతా అంశాలను పరిశీలించారు. తరువాత ఆయన డోన్ రైల్వే స్టేషన్ ను క్షుణంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా స్టేషన్లో అందుబాటులో ఉన్న ప్రయాణికుల సౌకర్యాలను, స్టేషన్ పరిసర ప్రాంగణాన్ని, స్టేషన్ మాస్టర్ కార్యాలయం, వెయిటింగ్ హాల్, సర్క్యులేటింగ్ ఏరియాను పరిశీలించారు. అనంతరం డోన్ - కర్నూల్ సెక్షన్‌లో రియర్ విండో తనిఖీని చేపట్టారు.

ప్రకటనల కుంభకోణంపై

హౌస్ కమిటీ వేయాలి

- ప్రశ్నోత్తరాల్లో టిడిపి సభ్యులు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత వైసిపి ప్రభుత్వ హయాంలో దినపత్రికలకు ప్రకటనలు ఇవ్వడంలో పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయని, ఆ కుంభకోణంపై హౌస్ కమిటీ వేసి విచారణ జరిపించాలని పలువురు టిడిపి సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రశ్నోత్తరాల సందర్భంగా ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. టిడిపి సభ్యులు నక్కా ఆనందబాబు, తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్ర, బెందాళం అశోక్ మాట్లాడుతూ ఎబిసి నివేదికకు విరుద్ధంగా గత ప్రభుత్వంలో పౌరసంబంధాల శాఖ అధికారులు వ్యవహరించారని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి 15 రోజులకు ఒకసారి తమకు కావాల్సిన పత్రికలకు మీడియా నిబంధనలకు విరుద్ధంగా ప్రకటనలు ఇచ్చి అనుచిత లబ్ధి కలిగించారని చెప్పారు. సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి వివరణ ఇస్తూ జిఓ నెంబర్ 431 ప్రకారం వున్న విచక్షణాధికారంతో ఈ చర్యలకు పాల్పడ్డారని అన్నారు. సభ్యుల డిమాండ్ మేరకు హౌస్ కమిటీ వేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యసేవలను మెరుగు పర్చాలి

ఏజెన్సీ ప్రాంతాల్లో వైద్యసేవలు అందక ప్రజలు చనిపోతున్నారని రాజానగరం ఎమ్మెల్యే బి రామకృష్ణ, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పార్వతీపురం ఎమ్మెల్యే విజయచందర్, ఎచ్చర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావులు తెలిపారు. పిహెసిలలో సిబ్బంది కొరత తీవ్రంగా వుందన్నారు. ఆధు నిక వైద్యపరికరాలు వున్నా వాటిని నిర్వహించే సిబ్బందిలేక తుప్పు పట్టిపోతున్నాయన్నారు. పాముకాటు, కుక్కకాటుకు కూడా మందులు వుండటం లేదని అన్నారు. పిహెచ్‌సిలను సిహెచ్‌లుగా మార్చి వైద్యసేవలను మెరుగుపర్చాలన్నారు. ఇందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం వైద్యరంగాన్ని ధ్వంసం చేసిందని గాడిలో పెట్టేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టామన్నారు.

ఎండోమెంట్ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్నవారికి రెగ్యులర్ చేయండి

రాష్ట్ర వ్యాప్తంగా ఎండోమెంట్ భూముల్లో ఇళ్లు నిర్మించుకొని దశాబ్దాలుగా నివసిస్తున్న వారి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ ప్రభుత్వంలోనైనా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు వంశీకృష్ణయాదవ్, దూళిపాళ్ల నరేంద్ర కోరారు. అలాగే పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు, ఓర్వకల్ మండలాల్లో దేవాదాయ భూములను ఆక్రమించుకొని వైసిపి నాయకులు రియల్ ఎస్టేట్ వెంచర్లను వేశారని వాటిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఈ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని దేవదాయశాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డి హామీ ఇచ్చారు.

హుదూద్ తూఫాన్ బాధితులకు న్యాయం చేయాలి

2014లో విశాఖకు హుదూద్ తుఫాన్ వచ్చినప్పుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బాధితుల కోసం నిర్మించిన ఇళ్లను వైసిపి ఎమ్మెల్యేలు అనర్హులకు ఇచ్చారని ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, విష్ణుకుమార్‌రాజులు తెలిపారు. వాటిని బాధితులైన పాత లబ్ధిదారులకు కేటాయించాలన్నారు. విచారణ జరిపి అర్హులకు కేటాయిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి సభలో ప్రకటన చేశారు.

జగన్ పిటిషన్‌పై విచారణ 30కు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

అసెంబ్లీలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలంటూ మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 30కు వాయిదా పడింది. ఈ పిటిషన్‌లో ప్రభుత్వం తరపున ఎజి దమ్మాలపాటి శ్రీనివాస్ వాదిస్తారని, గడువు కావాలని కోరడంతో విచారణను వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ చీమలపాటి రవి శుక్రవారం ప్రకటించారు. ఈ పిటిషన్‌కు విచారణార్హత లేదని ప్రభుత్వ వాదన. పిటిషన్ విచారణార్హతపై తేల్చాలని ఎజి కోరారు.

సింగిల్ జడ్జి విచారణను సమర్థించిన డివిజన్ బెంచ్

విశాఖపట్నంలోని భీమునిపట్నం బీచ్ సమీపంలో తమ ప్రహరీని కూల్చేందుకు జివిఎంసి ఇచ్చిన తుది ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎంపి విజయసాయిరెడ్డి కుమార్తె పెనకా నేహా రెడ్డి వేసిన పిటిషన్‌ను సింగిల్ జడ్జి విచారణ చేయడాన్ని డివిజన్ బెంచ్ సమర్థించింది. నేహారెడ్డి వ్యాజ్యాన్ని సింగిల్ జడ్జి ముందుంచేందుకు చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రీని బెంచ్ ఆదేశించింది. ఈ కేసులో ప్రతివాదిగా జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్‌ను చేర్చేందుకు అనుమతినిచ్చింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎసిఆర్‌లోని ప్రతికూల విషయాలు చెప్పాలి : హైకోర్టు

ఒక ఉద్యోగి వార్షిక రహస్య నివేదిక (ఎసిఆర్)లోని ప్రతికూల అంశాలను సదరు ఉద్యోగికి చెప్పకపోవడం మొత్తం ప్రమోషన్ల ప్రొసీడింగ్స్‌కు ఇబ్బంది కలిగిస్తాయని హైకోర్టు పేర్కొంది. సూపరింటెండెంటు ఇంజినీర్ (ఎస్ఇ) పోస్టు సెలక్షన్ పోస్టు అని, దీనికి ప్రతిభ, సమర్థతే ప్రామాణికమని చెప్పింది. తిరుమల, తిరుపతి దేవస్థానాలు (టిటిడి) సూపరింటెండెంటు ఇంజనీర్ (సివిల్) పోస్టుల్లో టివి సత్యనారాయణ సీనియర్ అవుతారని స్పష్టం చేసింది. ఇతరుల కంటే ఆయనే సీనియర్ అవుతారని జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ తీర్పు చెప్పారు. తాను సీనియర్ అయినప్పటికీ తనకు కాకుండా పలువురికి సూపరింటెండెంటు ఇంజినీర్లుగా, ఆ తరువాత చీఫ్ ఇంజినీర్లుగా పదోన్నతి కల్పిస్తూ టిటిడి ఇఒ ఇచ్చిన ఉత్తర్వులను సత్యనారాయణ సవాల్ చేసిన కేసులో తీర్పు చెప్పారు.

'ఉపాధి' పెండింగ్ బిల్లులు త్వరలో విడుదల

- మంత్రి పయ్యావుల, టిడిపి అధ్యక్షులు పల్లా
- టిడిపి కార్యాలయంలో ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి హయాంలో జరిగిన ఉపాధి పనుల పెండింగ్ బిల్లులను త్వరలో విడుదల చేస్తామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ జరిగింది. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను పయ్యావుల, పల్లా స్వీకరించారు. వచ్చిన అర్జీలలో వెంటనే పరిష్కరించదగిన వినతులపై సంబంధిత అధికారులకు ఫోన్ల ద్వారా సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని ఆదేశించారు. నామినేటెడ్ పదవులు కోసం నేతలు ఇచ్చిన అర్జీలను పల్లా శ్రీనివాస్, ప్రజాసమస్యలపై వచ్చిన వినతులను మంత్రి పయ్యావుల స్వీకరించారు. ఉపాధి హామీ బిల్లులను గత ప్రభుత్వం కక్షపూరితంగా నిలిపేసిందని, వీటిని వెంటనే చెల్లించాలని కోరారు. మంత్రి పయ్యావుల మాట్లాడుతూ ఇప్పటికే రూ.40 కోట్ల వరకు విడుదల చేశామని, మిగిలిన బిల్లులను కూడా త్వరలోనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. టిడిపి హయాంలో నియమించిన తమను కొనసాగించాలని కళ్యాణమిత్రలు కోరారు. హైకోర్టులో ఉండే తమను విధుల్లోకి తీసుకోవాలని కోర్టు ఆర్డర్ ఇచ్చినా ఇప్పటికీ తమకు న్యాయం జరగలేదని 2021 మాజీ హోంగార్డులు కోరారు. విశాఖ, తిరుపతి, విజయవాడ ఇతర ప్రాంతాల నుంచి వచ్చి అర్జీలు అందజేశారు.

నేడు మంత్రులతోనే గ్రీవెన్స్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టిడిపి కార్యాలయం పర్యటన శనివారం రద్దయింది. టిడిపి కార్యాలయంలో ప్రతి శనివారం ప్రజావేదిక పేరుతో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. శనివారం జరిగే నీతి ఆయోగ్ సమావేశానికి శుక్రవారం సాయంత్రమే ఢిల్లీకి చంద్రబాబు చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రికి బదులు అందుబాటులో ఉన్న మంత్రులు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని టిడిపి కార్యాలయ కార్యదర్శి పి అశోక్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు.


డివిఇఒ కార్యాలయం వద్ద బైఠాయించిన విద్యార్థులు

350 మందికి ఇద్దరే గురువులు

- డివిఇఒ కార్యాలయాన్ని ముట్టడించిన విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

350 మందికి పైగా ఉన్న కళాశాలకు ఇద్దరు పర్మినెంట్ అధ్యాపకులను కేటాయిస్తే తమ చదువులు ఎలా కొనసాగుతాయని విద్యార్థులు నినదించారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ విజయనగరం డివిఇఒ కార్యాలయాన్ని ముట్టడించారు. అంతకుముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కస్పా ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి డివిఇఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేశ్ మాట్లాడుతూ.. 350 మందికి పైగా ఉన్న ఈ కళాశాలలో ఇద్దరు మాత్రమే పర్మినెంట్ అధ్యాపకులు ఉన్నారని, తక్షణమే అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. కళాశాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, పాఠ్యపుస్తకాలను తక్షణమే అందజేయాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని తిరిగి ప్రారంభించాలని కోరారు. ఆందోళన వద్దకు చేరుకున్న డివిఇఒ ఎస్‌బి శంకర్రావుకు విద్యార్థులు వినతి పత్రం అందజేశారు. అధ్యాపక పోస్టుల భర్తీ తన చేతిలో లేని విషయమని, ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని హామీ ఇచ్చారు. సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో పోరాటాన్ని ఉధృతం చేస్తామని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె.రాజు, పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారంతో బురిడీ

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

నకిలీ బంగారంతో ఓ మహిళ తాకట్టు వ్యాపారస్తుడుని బురిడీ కొట్టించిన ఘరానా మోసం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో చోటుచేసుకుంది. పట్టణ సిఐ కెవి.స్వామి కథనం ప్రకారం నరసాపురం పట్టణానికి చెందిన శిరిగినీడి ఉషారాణి మెయిన్ రోడ్డులోని జెపి బ్యాంకర్స్‌లో బంగారం తాకట్టు పెట్టి సొమ్ము తీసుకునేది. అలా పలుమార్లు చేయడంతో వ్యాపారితో పరిచయం పెరిగింది. కొంతకాలం తర్వాత వ్యాపారి తాను తాకట్టు పెడుతున్న వస్తువులకు గీటు పెట్టడం లేదని గమనించిన ఆమె మోసానికి తెరలేపింది. మొత్తం 23 వస్తువులను తాకట్టు పెట్టి రూ.67 లక్షలు తీసుకుంది. చాలాకాలమైనా విడిపించుకోవడానికి రాకపోవడంతో అనుమానం వచ్చిన వ్యాపారి తాకట్టు పెట్టిన ఆభరణాలను తనిఖీ చేయగా అవి నకిలీ బంగారం అని తేలడంతో ఆ వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మీకోసం

టమాటాలు ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే, ఒకదానికొకటి తగలకుండా నిల్వ చేసుకోవాలి.

జీవన సౌరభం

ప్రతి అవకాశంలోనూ కొన్ని అడ్డంకులు, ప్రతి అడ్డంకి వెనుకా కొన్ని అవకాశాలు ఉంటాయి.

స్నేహం




సీతాపురంలో రామయ్య, భీమయ్య పక్కపక్క ఇళ్లల్లో నివాసం ఉంటారు. రామయ్య పిల్లిని పెంచుకుంటుంటే, భీమయ్య కుక్కను పెంచుకుంటున్నాడు. 'ఏంటి రామయ్య! ఎవరైనా కుక్కను పెంచుకుంటారు గాని పిల్లిని పెంచుకుంటారా?' అన్నాడు భీమయ్య. రామయ్య నవ్వి ఊరుకున్నాడు. ఇలా ఉండగా కొన్ని రోజులకు భీమయ్య బంధువుల పెళ్లికని కుటుంబంతో సహా పొరుగూరు వెళ్లవలసి వచ్చింది. ఇదే విషయం రామయ్యకు చెప్పి 'ఒక వారం పాటు మా కుక్కను చూసుకోగలవా?' అని అడిగాడు. 'ఓ దానికేం భాగ్యం. లక్షణంగా చూసుకుంటాను మీరు ఊరికి వెళ్లిరండి' అన్నాడు రామయ్య.

పిల్లి, కుక్క కలసి మెలసి ఉండేవి వాటి మధ్య వైరం ఏమాత్రమూ లేదు. ఒకే పళ్ళెంలోని పాలు తాగుతూ ఒకే చోట పడుకునేవి. వారం తరువాత భీమయ్య కుటుంబంతో సహా వచ్చి రాగానే రామయ్య ఇంటికి వెళ్ళాడు. కుక్క, పిల్లి ఒకే పళ్లెంలో పెరుగన్నం తినడం చూసి 'ఏంటి రామయ్యా! ఈ వింత' అన్నాడు.

'మనుషులు స్నేహంగా ఉన్నట్టు నటిస్తూనే మనసులో ద్వేషాన్ని పెంచుకుంటారు. కానీ కుక్కకు, పిల్లికి శతృత్వం ఉన్నా ఎంతో స్నేహంగా ఉంటూ కలసిమెలసి తింటున్నాయి' అన్నాడు రామయ్య.

'పిల్లిని ఎవరైనా పెంచుకుంటారా? అన్నాను. నన్ను క్షమించు రామయ్యా! నాకు కనువిప్పు అయ్యింది. నీవు చెప్పింది నిజమే. నోరు లేని ఈ జీవులను చూసి మనుషులు నేర్చుకోవలసింది ఎంతైనా ఉంది' అన్నాడు భీమయ్య.

-యు.విజయశేఖర రెడ్డి, హైదరాబాద్.



సరైన ఆకారం గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలో మధ్యలో భాగం పక్కనే ఉంది. ఏ ఆంగ్ల అక్షరం పక్కన ఆ భాగం ఉందో ఆ అక్షరం మధ్యలో రాయండి.

నేను గీసిన బొమ్మ



వి.వేనూహ్య రెడ్డి, 6వ తరగతి, సూళ్లూరుపేట, నెల్లూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

చిన్ని గుండెల కోసం..

'పాలక్ ముచ్చల్'.. ఈ పేరు తెలియని సంగీత అభిమానులు ఉండరు. ఇండోర్‌కి చెందిన ఈ యువగాయని గురించి ఇంకాస్త వివరంగా తెలియాలంటే 'ఎం ఎస్ ధోనీ' చిత్రంలో ఆమె పాడిన 'కౌన్ తుఝే..' పాట గుర్తు తెచ్చుకుంటే సరి. ప్రముఖ గాయనిగా ఎన్నో హిట్ చిత్రాల్లో పాటలు పాడిన పాలక్, చిత్ర రంగంలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ఎందరో అభిమానులను సొంతం చేసుకున్నారు. అయితే ఆమె గురించి అభిమానులకు తెలియని విషయం ఇంకొకటుంది. ఆ మధురమైన గాత్రం వెనుక అంతకంటే మధురమైన మనస్సు ఉంది.

సాధారణంగా గాయనీగాయకులు అభిరుచి కోసమో, డబ్బు సంపాదన కోసమో పాటలు పాడుతుంటారు. కానీ పాలక్ అలా కాదు. తన పాటల వెనుక ఓ బృహత్తర సంకల్పం ఉంది. పాటలు పాడి వచ్చిన డబ్బులను తన స్వలాభం కోసం కాక, గుండె జబ్బుతో బాధపడే వేలాది మంది పేద పసిపిల్లల శస్త్రచికిత్సలకు ఖర్చు పెడుతున్నారు. అలా ఇప్పటి వరకు 3 వేల పైచిలుకు చిన్నారులకు వైద్యం చేయించారు. ఇటీవల ఓ 8 ఏళ్ల బాలుడికి శస్త్రచికిత్స చేయించిన వీడియోని సోషల్ మీడియాలో విడుదల చేస్తూ ఈ విషయాన్ని బహిర్గతం చేశారు. ఇప్పటివరకు పాలక్ పాటలకు ముగ్ధులైపోయిన ఆమె అభిమానులు ఇప్పుడు తన మంచి మనసు గురించి తెలుసుకుని రెట్టింపు ప్రేమతో ఆమెని ఆరాధిస్తున్నారు.

ఇండోర్‌లో మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన పాలక్‌కి చిన్నప్పటి నుండి సంగీతం అంటే ఆసక్తి. కూతురు ఇష్టాన్ని కాదనకుండా ఆమె తల్లిదండ్రులు తనని సంగీత క్లాసులకు పంపించారు. అలా కళ్యాణ్‌జీ-ఆనంద్‌జీ లిటిల్ స్టార్ బృందంలో చేరేనాటికి పాలక్ వయస్సు నాలుగేళ్లు. ఏడేళ్లు వచ్చేసరికే పాలక్ తన సేవా ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. 1999లో కార్గిల్ అమర వీరుల కుటుంబాలకు సాయంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో భాగంగా దుకాణాల ముందు పాటలు పాడుతూ విరాళాలు సేకరించింది. అప్పట్లో తన గురించి భారత్ మీడియాలో ప్రముఖంగా ప్రచురించారు కూడా.

2000 సంవత్సరం వచ్చేసరికి, 'దిల్ సే దిల్ తక్', 'సేవ్ లిటిల్ హార్ట్స్' పేరుతో విదేశాల్లో సంగీత కన్సర్ట్‌లు ఇవ్వడం ప్రారంభించింది. ఇంగ్లీషు భాషలో ఆమె ఇచ్చే కన్సర్ట్‌లకు లక్షల్లో అభిమానులు ఉన్నారు. ఆ కార్యక్రమంలో పోగైన నిధులను నిరుపేద కుటుంబాల్లో గుండె సమస్యలతో బాధపడుతున్న పిల్లల కోసం వినియోగించడం ప్రారంభించింది. 10 ఏళ్ల పాటు నిర్విరామంగా కన్సర్ట్‌లు చేసిన పాలక్, ఆ తరువాత కూడా తన సేవా ప్రస్థానాన్ని కొనసాగించారు.

2011 వచ్చేసరికి బాలీవుడ్‌లో ప్రముఖ గాయనిగా ఎదిగారు. ఎక్కడ ఉన్నా, ఏం చేస్తున్నా తన సేవా ప్రస్థానాన్ని మాత్రం ఆపలేదు. 'ఏడేళ్లప్పుడు ఈ సేవా ప్రస్థానాన్ని ప్రారంభించినప్పుడు ఈ బృహత్తర కార్యక్రమానికి నా జీవితాన్ని వెచ్చిస్తానని ఎప్పుడూ అనుకోలేదు. ఇప్పుడు ఇది నా జీవితంలో ఓ భాగం. సినిమాల్లో అవకాశాలు రానప్పుడు మూడు గంటలపాటు కన్సర్ట్ చేసి ఒక పిల్లవాడికైనా చికిత్స చేయించాలని లక్ష్యం పెట్టుకుంటాను. నా పాటలు విశేష ప్రజాదరణ పొందుతున్న సమయంలో ఒక్క కన్సర్ట్‌తోనే 13 నుండి 14 సర్జరీలు చేయించేదాన్ని. పిల్లల చికిత్స కోసమే నేను కన్సర్ట్ చేస్తాను. చిత్రాల్లో పాటలు పాడితే ఇచ్చే సొమ్ము కూడా పిల్లల వైద్యం కోసమే ఖర్చు పెడతాను. ప్రస్తుతం నా దగ్గర ఆపరేషన్లు జరగాల్సిన 413 మంది పిల్లల జాబితా ఉంది. వీళ్ల బాధ్యతే కాదు, ఇంకా మరెంతో మంది పిల్లలు డబ్బుల్లేక, వైద్యం అందక దుర్భర పరిస్థితుల్లో ఉన్నారు. అందుకే ఈ పనిని నేను నిరంతరం కొనసాగించాలని లక్ష్యం పెట్టుకున్నాను' అని చెబుతున్న పాలక్, ఎంతోమంది వర్ధమాన కళాకారులకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తున్నారు.







సమయ పాలనపై స్పష్టంగా ఉండాలి!



చాలా మందికి ఏ పని ఎప్పుడు చేసుకోవాలో అవగాహన ఉండదు. దీంతో అనుకున్న సమయానికి ఆ పనులు పూర్తికావు. అన్ని పనులూ ఒకేసారి మీదేసుకుని సతమతం అవడం కంటే ఉన్న కొద్ది సమయంలోనే ఓ ప్రణాళిక ప్రకారం చేసుకుపోతే ఏ సమస్యా రాదు.

ఏ పనులు ఎప్పుడు ...

ఒకరోజు లేదా వారం లేదా పది రోజుల్లో పూర్తి చేయబోయే పనుల్ని ముందుగానే ఒక జాబితాగా రాసుకోండి. నిర్దేశించుకున్న సమయంలో ఏయే పనులు చేయాలి? వాటి కోసం ఎప్పుడు ఎక్కడికి వెళ్లాలి? ఇలా వివరాలతో సహా డైరీలో రాసుకోవాలి. దాని ప్రకారం ఒకదాని తర్వాత మరొక పని పూర్తి చేసుకుంటూ ముందుకు వెళ్లాలి.

ప్రాధాన్యత ప్రకారం..

రాసుకున్న పనుల్లో ముఖ్యమైనవి, ముందు చేయాల్సినవి, నిదానంగా చేసుకునే పనులు ఉంటాయి. వాటి ప్రకారం ప్రాధాన్యత ఇచ్చుకుంటూ పనులు ఎంచుకోవాలి. అప్పుడే ఉన్న సమయంలో ఏ పనులు ఎప్పుడు పూర్తి చేయగలరో ఒక అవగాహన వస్తుంది.

ఏ పనికి ఎంత సమయం?

ఒక్కో పని గంట పడుతుంది. మరో పని నిమిషాలు పడుతుంది. దీని ప్రకారం ప్రణాళికలో సమయం కూడా చేర్చుకుంటే సరిపోతుంది. అప్పుడు మనకు ఉన్న సమయంలో ఎన్ని గంటలు ఆ పనికి కేటాయించ గలమో అర్థమవుతుంది.


సహాయం తీసుకోండి..

అన్ని పనులూ మీద వేసుకుని చేయాలంటే ఒత్తిడికి గురికాక తప్పదు. అప్పుడు ఆ పని చేయాలన్న ఆసక్తి తగ్గిపోతుంది. దాంతో పనిలో నాణ్యత ఉండదు. కాబట్టి స్నేహితులు, సన్నిహితుల సహాయం తప్పకుండా తీసుకోండి.

విశ్రాంతి తప్పనిసరి..

ఎన్ని పనులున్నా.. వాటికి ఎంత సమయం కేటాయించినా కాస్త సమయం మీ కోసం మీరు కేటాయించుకోవాలి. మీ మనుసుకు నచ్చిన సంగీతం, పాటలు, సినిమా చూడాలి. ఇష్టమైన కుటుంబ సభ్యులను, స్నేహితులను కలిసి మాట్లాడుకుంటే మనసుకు కాస్త ప్రశాంతంగా ఉంటుంది. ఆ తరువాత చేయాల్సిన పనిపై శ్రద్ధ పెరుగుతుంది.

ఒలింపిక్ సిత్రాలు



సెయిన్ నది ప్రారంభోత్సవ వేడుకల్లో ఓ దృశ్యం



ఫ్రాన్స్ పాప్ సింగర్ లేడీ గాగా



ఆయా నకమురా



ప్రారంభోత్సవాలకు హాజరైన ఐఓసి అధ్యక్షులు బాచ్‌తో ఒలింపిక్ కమిటీ ప్రతినిధులు



జోరువానలోనూ వేడులకు తిలకిస్తున్న ఫిఫా అధ్యక్షుడు జియాని



ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌తో ఐఓసి అధ్యక్షుడు థామస్ బాచ్



పారిస్‌లోని సెయిన్ నదిలో ఆ దేశ జెండా రంగులతో అద్భుత ప్రదర్శన

ఒలింపిక్స్‌లో నేడు (భారత్ పోటీపడే క్రీడాంశాలు)

27(శని):	మ.12.00గంll	**బ్యాడ్మింటన్(గ్రూప్‌స్టేజ్)** హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, పివి సింధు, సాత్విక్-చిరాగ్, తానీషా-పొన్నప్ప
	మ.12.30గంll	**రోయింగ్ :** బల్‌రాజ్ పన్వార్(స్కల్స్ హీట్) **షూటింగ్ :** 10మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీం సందీప్ సింగ్-బబుతా, ఇలవేణి-రమిత
	మ.2.00గంll	10మీ. ఎయిర్ రైఫిల్ పురుషుల క్వాలిఫికేషన్ షరబ్‌జ్యోతి సింగ్, అర్జున్ ఛీమా 10మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీం మెడల్‌రౌండ్స్ షరబ్‌జ్యోత్.
	మ.3.30గంll	**టెన్నిస్ :**పురుషుల సింగిల్స్, డబుల్స్... సుమిత్ నాగల్, రోహన్ బొప్పన్న-శ్రీరాం బాలాజీ
	సా.4.00గంll	**షూటింగ్ :** మహిళల 10మీ. ఎయిర్ పిస్టల్ రిథమ్ సంఘ్వాన్, మను బకర్
	సా.6.30గంll	**టేబుల్ టెన్నిస్ :** పురుషుల, మహిళలసింగిల్స్ శరత్ కమల్, హర్‌మీత్ దేశాయ్, మనిక బత్రా, శ్రీజ ఆకుల
	రా.7.00గంll	**బాక్సింగ్ :** మహిళల 54కి. రౌండ్-32. ప్రీతి పన్వార్
	రా.9.×0గంll	**హాకీ(పురుషులు) :** భారత్ × న్యూజిలాండ్

9వ సారి ఫైనల్లోకి భారత్

- బౌలింగ్‌లో మెరిసిన రేణుక
- 28న టైటిల్‌కై శ్రీలంకతో ఢీ
- మహిళల ఆసియాకప్ కప్


ధంబుల్లా(శ్రీలంక): మహిళల ఆసియా కప్ ఫైనల్లోకి భారత్ 9వ సారి ప్రవేశించింది. ఈ టోర్నమెంట్ చరిత్రలో భారత మహిళలజట్టు ప్రతి సందర్భంలోనూ ఫైనల్‌కు చేరింది. దంబుల్లా స్టేడియంలో శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో హర్మన్‌ప్రీత్ సేన 10వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై ఘన విజయం సాధించింది. తొలుత పేసర్ రేణుకా సింగ్(3/10), రాధా యాదవ్(3/14)లు బౌలింగ్‌లో రాణించడంతో బంగ్లాదేశ్ జట్టును 80పరుగులకే కట్టడి చేసింది. ఆ లక్ష్యాన్ని భారత్ 11ఓవర్లలో వికెట్లేమీ కోల్పోకుండా ఛేదించింది. ఓపెనర్లు స్మృతి మంధానా(55) అర్ధసెంచరీకి తోడు, షెఫాలీ వర్మ(26) బ్యాటింగ్‌లో రాణించారు. చివరి ఓవర్లో మంధాన హ్యాట్రిక్ ఫోర్లు బాది కేవలం 33బంతుల్లోనే అర్ధసెంచరీని బాది మ్యాచ్‌ను ముగించింది. టాస్ గెలిచిన బంగ్లాదేశ్ బ్యాటింగ్ తొలిగా బ్యాటింగ్‌కు దిగినా.. తొలి ఓవర్లోనే రేణుకాసింగ్ ఓపెనర్ దిల్వారా అక్తర్(4)ను ఔట్ చేసింది. ఆ తర్వాతి ఓవర్లో ముర్షిదా ఖాతూన్(6), ఇష్మ తంజిమ్(9)లను ఔట్ చేసి బంగ్లాను చావు దెబ్బ కొట్టింది. ఒకదశలో 21 పరుగులకే మూడు వికెట్లు పడగా కెప్టెన్ నిగర్ సుల్తానా(32) పట్టుదలగా ఆడింది. ఛేదనలో భారత ఓపెనర్లు 7.1 ఓవర్లకే 50 పరుగులు బాదేశారు. నహిదా అక్తర్ వేసిన 11వ ఓవర్లో మంధాన వరుసగా మూడు బౌండరీలు కొట్టింది. దాంతో, టీమిండియా 10 వికెట్ల తేడాతో విజయఢంకా మోగించింది. రేణుకా సింగ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

రెండో సెమీస్‌లో శ్రీలంక జట్టు మూడు వికెట్ల తేడాతో పాకిస్తాన్ మహిళలపై విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 140 పరుగులు చేయగా.. ఛేదనలో శ్రీలంక జట్టు ఒక్క బంతి మిగిలి ఉండగానే 141పరుగులు చేసి గెలిచింది. శ్రీలంక కెప్టెన్ ఛమరీ ఆటపట్టు(63) అర్ధసెంచరీకి తోడు వికెట్ కీపర్ సంజీవని(24) బ్యాటింగ్‌లో రాణించారు. పాకిస్తాన్ బౌలర్లు సదాయ్ ఇక్బాల్‌కు నాలుగు, కెప్టెన్ నిదా ధార్‌కు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఛమరీ ఆటపట్టుకు లభించింది.



సూర్యకుమార్ కెప్టెన్సీకి పరీక్ష

నేడు శ్రీలంకతో తొలి టి20 • రాత్రి 7.00గంllలకు



కొలంబో: శ్రీలంక పర్యటనకు వెళ్లిన భారత జట్టు టి20 సిరీస్‌కు సిద్ధమైంది. ఇరుజట్ల మధ్య మూడు టి20ల సిరీస్‌కు ఇరుజట్ల తరఫున కొత్త కెప్టెన్లు సారథ్యం వహిస్తున్నారు. భారతజట్టుకు టి20 స్పెషలిస్ట్ బ్యాటర్ సూర్యకుమార్, శ్రీలంక జట్టుకు ఛరిత్ అసలంక కెప్టెన్లుగా వ్యవహరించనున్నారు. కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్‌కు, హెడ్‌కోచ్‌గా గౌతం గంభీర్‌కు ఇదే తొలి సిరీస్. దాంతో వీరిద్దరూ శ్రీలంక పర్యటనను దిగ్విజయంగా ముగించాలని భావిస్తున్నారు. శ్రీలంక పర్యటనలో భాగంగా భారత జట్టు శ్రీలంకతో మూడు టి20, మూడు వన్డేలు ఆడనుంది. మూడు టి20ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ నేడు జరగనుంది. ఆగస్టు 2నుంచి వన్డే సిరీస్ ఆరంభం కానుంది. వన్డేల్లో విరాట్ కోహ్లి, కెప్టెన్ రోహిత్ శర్మలు జట్టుతో కలువనున్నారు.

జట్లు(అంచనా)..

భారత్: శుభ్‌మన్, సూర్యకుమార్(కెప్టెన్), జైస్వాల్, పంత్(వికెట్ కీపర్), హార్దిక్ పాండ్యా, రింకు సింగ్/దూబే, సుందర్, అక్షర్ పటేల్, బిష్ణోయ్, అర్ష్‌దీప్, సిరాజ్.

శ్రీలంక: నిస్సంక, ఛరిత్ అసలంక(కెప్టెన్), ఫెర్నాండో, కుశాల్ మెండీస్(వికెట్ కీపర్) శనక, కమిందు మెండీస్, హసరంగ, తీక్షణ, మధుశంక, పథీరణ, బినారా ఫెర్నాండో.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68